
# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి : 14 సంచిక : 3 హైదరాబాద్ 157 మార్చి 2024 పేజీలు : 48 వెల : 20/-

- తెలంగాణ ఏడో గ్యారెంటీయే ముఖ్యం
- విద్య-అంబేద్కర్ ప్రాసంగీకత
- గద్దర్ ఒక సర్వనామం
- భాషా ప్రజాస్వామికవాది కాళోజి
- ఈ తరానికి మహనీయుల చిరునామా



తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

# TELUGU LITERARY CONGRESS (TLC) 2024

## తెలుగు సాహిత్య మహాసభ 2024









# నడుస్తున్న తెలంగాణ

మార్చి 2024
సంచిక : 3
సంపుటి : 14

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక



గౌరవ సంపాదకులు
**ప్రొ॥ అడపా సత్యనారాయణ**
రిటైర్డ్ ప్రొఫెసర్, చరిత్రశాఖ, ఓయు

సలహామండలి
**అల్లం నారాయణ**
చైర్మన్, ప్రెస్ అకాడమి, తెలంగాణ
**ప్రొఫెసర్ చింతా గణేష్**
సోషియాలజి డిపార్ట్‌మెంట్, ఓయు
ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల, ఓయు

ప్రధాన సంపాదకుడు
**ప్రొఫెసర్ చింతకింది కాశీం**
తెలుగుశాఖ, ఆర్ట్స్ కళాశాల, ఓయు

సంపాదకురాలు
**స్నేహలత ఎం.**
హైకోర్ట్ అడ్వకేట్, తెలంగాణ

**సంపాదకవర్గం**
**ప్రొఫెసర్ ఎ.సిల్మానాయక్**,
ప్రిన్సిపాల్, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల
**క్రాంతి**, జర్నలిస్టు
**డా॥శివరాత్రి సుధాకర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి)
**ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (సి),
తెలుగుశాఖ ఆర్ట్స్ కళాశాల, ఓయు

డిటిపి, లే ఔట్ : స్నేహ
కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా
**స్నేహలత ఎం.,**
ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,
వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2, కాకతీయ నగర్, హబ్సిగూడ
హైదరాబాద్-500 007.
ఇ.మెయిల్: nadusthunnatelangana@gmail.com
ఫోన్ నెం.: 9290745490


## సంపాదకుని ఉత్తరం

*మెప్పించటమే*
*కార్యక్రమమైతే*
*అందరినీ మెప్పించవచ్చు*
*అప్పుడు*
*శత్రువు మిత్రుడనే*
*తేడాలెందుకు!?*

మిత్రవైరుధ్యం
పాఠ్యాంశమే అయితే
పరీక్ష తప్పేవాళ్లందరూ
ఊరి చివరే ఉంటారు

వాదనకైనా
వైరుధ్యానికైనా
సమఉజ్జీలే కావాలి

2 మార్చి 2024


*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ


**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| ఆడబిడ్డల్ని కాపాడుకుందాం | **స్నేహలత ఎం.** | 5 |

**నడుస్తున్న కాలం**

| | | |
|---|---|---|
| తెలంగాణకు ఏడో గ్యారెంటీయే ముఖ్యం | **ప్రొ॥ చింతకింది కాశీం** | 6 |
| విద్య–అంబేద్కర్ ప్రాసంగికత | **చెలిమి** | 9 |
| గద్దర్ ఒక సర్వనామం | **స్పందన** | 13 |
| భూమి–గింజ | **సత్యం** | 15 |
| భాషా ప్రజాస్వామికవాది కాళోజీ | **డా॥శివన్న చంద్రయ్య** | 17 |
| అడగవలసిన ప్రశ్న | **స్నేహలత ఎం.** | 20 |

**సాహిత్యం**

| | | |
|---|---|---|
| ఈ తరానికి మహనీయుల చిరునామా | **ప్రొ॥ చింతకింది కాశీం** | 24 |

**పరిశోధన**

| | | |
|---|---|---|
| స్మార్ట్‌ఫోన్ ఆప్‌లలో తెలుగు భాషా సాహిత్యాలు | **డా॥దానక్క ఉదయ్‌భాను** | 27 |
| తెలంగాణ సాహిత్య విమర్శ వికాసం | **ఇమ్మిడి మహేందర్** | 32 |



**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు.**

**ఫేస్‌బుక్ పేజీ:** WWW.Facebook.com/pages/nadustunna telangana

సంపాదకీయం

# ఆడబిడ్డల్ని కాపాడుకుందాం

స్నేహలత ఎం.

సీతాకోకచిలుకల్లా ఆనందంతో గంతులేస్తూ ఎగిరే పిల్లలు. ఏ పని చేయాలో, చేయకూడదో తెలియని వయస్సు. ఆనందం వస్తే కల్మషం లేని హృదయంతో నవ్వడం, కోపమొస్తే, బాధ కలిగితే ఏడవడం మాత్రమే వారికి తెలుసు. వర్షంలో ఆడటం, కోకిల గొంతుతో శృతికలపడం, లేడిపిల్లల్లా గెంతుతూ, తుళ్ళుతూ ఉండే లేత గులాబీల వంటి పసికందులపై అత్యాచారాలకు పాల్పడమే కాకుండా గొంతు విప్పుతారనే అనుమానం ఉంటే చాలు ఆ పిల్లలను చంపేస్తున్నారు. కశ్మీర్‌లోని కతువాలో సంచార తెగకు చెందిన ఎనిమిదేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాపిత సంచలనం. ఈ సంఘటన అనంతరం చత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పెళ్లివేడుకల్లో ఇద్దరు బాలికలపై అత్యాచారం, హత్య సంఘటనలు జరిగాయి. తెలంగాణలోని పెద్దపల్లిలో నాలుగేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఇలా బాలికలపై అత్యాచారాల సంఘటనలు మనం రోజూ దినపత్రికల్లో చూస్తున్నాం. ఒకటి ఆరా కాస్త లెక్కకు మించి తెలంగాణలోని యాదగిరిగుట్టతో సహా ఎనిమిది ప్రాంతాల్లో బహిరంగ రహస్యంగా చిన్నపిల్లలతో వ్యభిచార గృహాలు నడుస్తున్నాయనేది బయటపడింది. ఇటువంటి చిన్నపిల్లల వ్యభిచార కూపాలు దేశవ్యాప్తంగా చోటా, మోటా రాజకీయ నాయకుల అండతో, పోలీసుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నట్లు ఈ మధ్య కాలంలో బయటపడ్డాయి, పడుతున్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు పెరిగియానేది యునిసెఫ్ మొదలు భారతదేశంలో ఎన్‌సీఆర్‌బీతో పాటు అనేక స్వచ్ఛంద సంస్థల సర్వేలో బయటపడింది. భారతదేశంలో రోజుకు 50 నుంచి వంద చొప్పున సంవత్సరానికి దాదాపు 40 వేల అత్యాచార కేసులు నమోదైతే అందులో 18 వేల అత్యాచారాలు బాలికలపైనే జరుగుతున్నాయనేది 2016లో నమోదైన లెక్కలు చెబుతున్నాయి. 5 నుంచి 15 ఏళ్ల వయస్సు బాలికలే లక్ష్యంగా దేశంలో చైల్డ్ ట్రాఫికింగ్(పిల్లల అపహరణ, రవాణా) జరుగుతుందని ఎన్‌సీఆర్‌బీ సర్వేలో తేలింది. ప్రధానంగా పేదరికంలో మగ్గిపోతున్న కుటుంబాల నుంచి పిల్లల్ని కొనుగోలు చేయడం, వీధుల్లో ఆడుకునే పిల్లల్ని అపహరించడం, చాక్లెట్లు, బహుమతులు ఆశ చూపించి ఎత్తుకెళ్లడం ఇలా రకరకాలుగా ప్రతీ సంవత్సరం ఎనిమిది నిమిషాలకు ఒకరు చొప్పున బాలబాలికలను అక్రమ రవాణా చేస్తున్నారనేది ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. వీరిలో ఎక్కువగా బాలికలేననేది కూడా ఎన్‌సీఆర్‌బీ తేల్చిచెప్పింది.

అపహరించిన పిల్లల్లో రంగునూ, రూపాన్ని బట్టి వారి బిజినెస్ కొనసాగుతుందని యాదగిరిగుట్ట సంఘటనలో బయటికొచ్చింది. 5 సంవత్సరాల లోపు పిల్లలైతే వ్యభిచార గృహాల్లో పనులు చేయించుకోవడం, బిక్షమెత్తించడం చేయిస్తున్నారు. 8 సంవత్సరాల వయస్సు పిల్లలకు వ్యభిచార వృత్తికి పనికొచ్చేలా అసహజ శారీరక ఎదుగుదల కోసం ఈస్ట్రోజన్ ఇంజక్షన్లు ఇచ్చారని, వారి ఏడుపులు, అరుపులు బయటి సమాజానికి వినిపించకుండా నేల మాళిగల్లో దాచారని గుట్ట సంఘటనలో వెలుగుచూసింది. రాష్ట్ర వ్యాప్తంగా తప్పిపోయిన తమ పిల్లలు బయటపడిన, పోలీసులు బయటపెట్టిన వ్యభిచార గృహాల్లో దొరుకుతారనే ఆశతో ఎందరో తల్లిదండ్రులు వచ్చి వెతుక్కున్నారు. మహిళలు, బాలబాలికలను అపహరించి ఇతర ప్రాంతాలకు తరలించడం, వ్యభిచార వృత్తిలోకి దించే ముఠాలు 40 వరకు ఉన్నాయని ఈ మధ్య కాలంలో పోలీసులే ప్రకటించారు.

2014 తర్వాత మహిళలపై అత్యాచారాలు, అపహరణలు పెరిగాయని, రోజుకు 180 ట్రాఫికింగ్ కేసులు నమోదవుతున్నాయని క్రై అనే ఒక స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన నివేదికలో వెలుగుచూసింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నేరాల శాతం మరింతగా పెరిగిందనేది లెక్కలే నిరూపిస్తున్నాయి. దేశంలో ఈ మధ్య కాలంలో జరిగిన కొన్ని కేసుల్లో స్వయంగా అధికార పార్టీ నాయకులే నిందితులుగా పట్టుబడ్డారు.

లైంగిక నేరాల నుంచి బాలికలను రక్షించేందుకంటూ 2012లో పోక్సో చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చినా మార్పేమీ లేదనేది రోజురోజుకూ మరింత ఎక్కువగా నమోదవుతున్న అపహరణ కేసులతో నిరూపితమవుతోంది. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించడానికి ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తామని చెప్పే ప్రభుత్వాలకు బహిరంగంగా అడుగడుగునా నడుస్తున్న హైటెక్ వ్యభిచారం కనిపించడం లేదా? సినిమా, టీవీ, ఇంటర్నెట్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో ప్రసారమవుతున్న అశ్లీల చిత్రాలను ప్రమోట్ చేస్తున్నది పాలకవర్గాలే. ఇట్లాంటి సంస్కృతి సమాజం నిండా పరివ్యాపితమై మనుషులు విధ్వంసమైపోవడం ఏలికకు అవసరం. అందుకే తమ అస్తిత్వం కోసం అప్పుడప్పుడు మాట్లాడటం తప్ప, ప్రభుత్వాల ప్రత్యేక నివారణ చర్యల ఫలితాలేమి ఉండవు.

భారతదేశంలో భూస్వామ్య, బ్రాహ్మణీయ, సామ్రాజ్యవాద సంస్కృతే అమలవుతున్నది. బ్రాహ్మణీయ భూస్వామ్యానికి, సామ్రాజ్యవాదానికి స్త్రీ భోగవస్తువు మాత్రమే. ఆమె గగనతలమెక్కినా, ఆయుధం పట్టి పోరాడినా, సాధికారిక అధికారిగా పనిచేసినా, అక్షరాన్ని ఒడిసిపట్టి సాహిత్య లాలిత్యాన్ని ప్రదర్శించినా సమాజంలో ఇంకా రెండో శ్రేణి పౌరురాలిగానే పరిగణిస్తున్నారు. ఆడది అనే ఆలోచన ఇంట్లో, బడిలో, పాఠాల్లో, పని ప్రదేశాల్లో పోనంత వరకు స్త్రీకి రక్షణ లేదు. ఏ భావజాలమైనా ఉత్పత్తి సంబంధాల నుంచే పుడుతుంది. కనుక ఉత్పత్తి సంబంధాలు మారకుండా స్త్రీని తక్కువ చూసే భావజాలం మారదు. ఇప్పటికైతే వాటిని మార్చే మార్గంలో పయనించడమే పరిష్కారం. (మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా..)

*5 మార్చి 2024*

# తెలంగాణకు ఏడో గ్యారెంటీయే ముఖ్యం

ప్రొ॥ చింతకింది కాశీం

"రేవంత్‌రెడ్డి గారు గత సంవత్సరకాలంగా తన రాజకీయ ఆచరణలో వేగాన్ని పెంచాడు. క్షేత్ర స్థాయిలో స్తబ్దుగా ఉండిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలలో చలనం తీసుకొచ్చే కార్యక్రమాలను చేపట్టాడు. కొన్ని సందర్భాలలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను కూడా పట్టుదలగా నడిపాడు. బీఆర్ఎస్ ప్రభుత్వంతో నేరుగా తలపడడానికి అన్ని ప్రయత్నాలు చేసాడు. ఇంకో వైపు కొన్ని రాజకీయ వ్యాఖ్యలు కూడా చేసాడు. కేసీఆర్ కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులను లక్ష్యంగా చేసుకొని ఆయన చేసిన కామెంట్స్ కొన్నిసార్లు రాజకీయంగా దుమారానికి కేంద్రమయ్యాయి. ఇంకోవైపు ఆయన మాట్లాడిన రెండు విషయాలను ఇవ్వాళ మనం తప్పకుండా చర్చించాలి. ఒకటి 'కేసీయార్ పాలనలో ప్రజలు నక్సలైట్లు తిరిగి రావాలని కోరుకుంటున్నారు', రెండోవది 'ప్రజాస్వామ్య తెలంగాణ కావాలి'. ఈ కాలంలో రేవంత్‌రెడ్డి రాజకీయ ఆచరణ, చేసిన వ్యాఖ్యలు తన రాజకీయ పునాదిని పటిష్టం చేసుకోవడానికి ఆలంబనగా ఉండినాయని కాస్త రాజకీయ పరిజ్ఞానమున్న ఎవరికైనా అర్థమవుతుంది. ఆయన అధికారంలోకి రావడానికి, లక్ష్యసాధన కోసం అన్ని ప్రయత్నాలు చేసాడని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తీరును బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ఆరునెలల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. కానీ రేవంత్‌రెడ్డి మాత్రం అధికారంలోకి వస్తున్నామనే భావనను ప్రజలలో ప్రోది చేయగలిగినాడు.

తన సామాజిక వర్గాన్ని అన్నిరకాలుగా ఐక్యం చేసి తనతో ఉంచుకోగలిగినాడు. కాంగ్రెస్ పార్టీలో తన వ్యతిరేకులను అధిష్టానం ఆజ్ఞలతో ఉదాసీనం చేయగలిగాడు. కేసీయార్ పట్ల వ్యతిరేకంగా ఉన్న ఉద్యోగులకు, నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చాడు. ఇక మేధావులలో, ప్రజస్వామిక వాదులలో, ఆలోచనాపరులలో రాహుల్‌గాంధీ భారత్‌జోడో యాత్ర సమయంలో సానుకూల దృక్పథాన్ని పొందాడు. ఇక మిగిలింది మావోయిస్టు ప్రభావిత ప్రజాసమూహంలో అనుకూలతను తెచ్చుకోవడానికి ప్రజాస్వామిక తెలంగాణ, నక్సలైట్లు అనే నినాదాలను ఎత్తుకున్నాడు. సంఘ్‌పరివార్ శిక్షణ నుంచి ఎదిగిన రేవంత్‌రెడ్డి సైద్ధాంతికంగానే నక్సలైట్లకు, ప్రజాస్వామ్యానికి విముఖుడనే భావనను పోగొట్టుకోవడానికి ఈ వ్యాఖ్యలు ఉపయోగపడ్డాయి. నక్సలైట్లు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పిన ఆయన నిజంగా వాళ్ల రాజకీయ ఆచరణకు అవకాశం కల్పిస్తాడా? అనే ప్రశ్న వేసుకుంటే సమాధానం వెతుక్కోవడం అంత కష్టమేమి కాదు.

ఇక ప్రజాస్వామ్య తెలంగాణ గురించే మనందరం విస్మరించకుండా పూనికతో చర్చించాలి. దాని అమలు కోసం గట్టి ప్రయత్నం చేయాలి. రేవంత్‌రెడ్డికి ప్రజస్వామ్య తెలంగాణ అనే మాటకు సంబంధించిన లోతైన చరిత్ర తెలియకపోయినా, స్థూలమైన అవగాహనతో మాట్లాడుతున్నాడనే ఆయన ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు విన్న ఎవరికైనా అర్థం అవుతుంది. కానీ 'ప్రజాస్వామ్య తెలంగాణ' అనే నినాదానికి ఉన్న పాతికేళ్ల చరిత్రను మాత్రం ఆయనకు తప్పక గుర్తుచేయాలి. ఆనాడు ఆ నినాదాన్ని వ్యతిరేకించి, హేతుబద్ధతను విడనాడి కేసీయార్ అధికారానికి సానుకూలతను కల్పించి, ఇవ్వాళ ఆయన పక్కన వేదికల మీద 'ప్రజాస్వామ్య తెలంగాణ' అని నినదిస్తున్న మేధావుల చరిత్ర కూడా

ఆయనకు తెలిసి ఉండాలి. తెలంగాణ నేల మీద కనీస ప్రజాస్వామిక హక్కులు కూడా అమలుకు నోచుకోకుండా రాజ్యాంగ విలువలకు పరిమితులు విధించిన కాలమొకటి కొనసాగింది. ఆట, మాట, పాటకు పాలకులు భయపడి, సృజనాత్మక వ్యక్తీకరణ మీద భౌతిక దాడులకు పూనుకొన్నారు. ప్రజల నిత్య జీవితంలో ముళ్ల కంచెలు మొలిచాయి. 1969లో నిర్బంధానికి గురైన ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష ప్రజల డిమాండ్‌గా తొంభయోదశకం మధ్యలో ఎజెండా మీదకు వచ్చింది. దేశవ్యాపితంగా చిన్న రాష్ట్రాల ఏర్పాటు కూడా దీనికి దోహదం చేసింది. తెలంగాణలోని బుద్ధిజీవులు, ప్రజాస్వామికవాదులు తిరిగి ప్రత్యేక తెలంగాణ చర్చను ప్రజాక్షేత్రంలోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికి తెలంగాణలో ప్రాబల్యశక్తులుగా ఉండిన విప్లవ, పార్లమెంటరీ కమ్యూనిస్టుల మధ్య ప్రత్యేక తెలంగాణ అంశం చర్చనీయంగా మారింది. మెజార్టీ కమ్యూనిస్టు శిబిరం ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షను అస్తిత్వ ఉద్యమంగా, బూర్జువా డిమాండ్‌గా భావించింది. కనుక కార్మిక సమూహాల మధ్య విభజనను తీసుకొచ్చే అంశంగా తెలంగాణ డిమాండ్‌ను పరిగణించి కొందరు ఉదాసీనంగా ఉన్నారు. మరికొందరు వ్యతిరేక వైఖరిని తీసుకున్నారు.

ఈ నేపథ్యంలో మొదటిదశ తెలంగాణ ఉద్యమంలో విప్లవకర అంశాన్ని గుర్తించిన కొండపల్లి సీతారామయ్య, కె.జి.సత్యమూర్తి కొనసాగింపుగా రూపొందిన పీపుల్స్‌వార్ పార్టీ 1997 జూన్‌లో 'తెలంగాణ అభివృద్ధి–విప్లవోద్యమ కార్యక్రమం' అనే తమ విధాన పత్రాన్ని సమాజం ముందు ఉంచింది. కేవలం భౌగోళిక తెలంగాణ ఏర్పాటు కాకుండా ప్రజాస్వామిక ఆకాంక్షల నెరవేరే తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజాశిబిరం పూనుకోవాలని ఆ విధాన పత్రం అభిప్రాయపడింది. ఈ పత్రం వెలుగులోనే ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబ నాయకత్వంలోనే వరంగల్ డిక్లరేషన్ సభ జరిగింది(డిసెంబర్ 1997) ఈ సభలో పాల్గొన్న ప్రజాకవి కాళోజీ 'ప్రత్యేక తెలంగాణ–ప్రజాస్వామిక ఆకాంక్షలు' అనే డాక్యుమెంట్‌ను రెండు లక్షల మంది సమక్షంలో విడుదల చేసాడు. ఆ తర్వాత తెలంగాణ జనసభ (జూలై 1998), తెలంగాణ స్టూడెంట్ ఫ్రంట్ 'ప్రజాస్వామిక తెలంగాణ' నినాదంతో ఏర్పడ్డాయి. "ప్రజాస్వామ్య మడిగెనా తెలంగాణ జనసభ–ప్రత్యేక రాష్ట్రమడిగెనా తెలంగాణ జనసభ" అనే పాపులర్ పాటను ఆ రోజుల్లో రాజనర్సింహ, బెల్లిలలిత విస్తృతంగా పాడేవాళ్లు. "ప్రజల ప్రజాస్వామిక హక్కులకు పూర్తి గ్యారంటీ ఉండాలి. తిండి, బట్ట, ఇల్లు కొరకు పోరాడే హక్కు ప్రజలకుండాలి. ప్రజల మీద కొనసాగుతున్న భయంకరమైన రాజ్యహింస నిలిచిపోవాలి. పోలీసు క్యాంప్‌లను ఎత్తివేయాలి. బూటకపు ఎన్‌కౌంటర్లను మానుకోవాలి. బీఎస్ఎఫ్, సీఆర్‌పిఎఫ్ తదితర పారా మిలటరీ బలగాలను వెనుకకు పంపాలి. ఎలాంటి రాజకీయ అభిప్రాయాలపైన నిషేధం ఉండకూడదు" అని వరంగల్ డిక్లరేషన్‌లో ప్రజాస్వామిక తెలంగాణ గురించి వివరించారు. భారత రాజ్యాంగం ఏ పరిమితులకు గురికాకుండా అమలు కావడమే ప్రజాస్వామిక తెలంగాణ అని ఆనాటికి ఈ నాటికి ఒకే అర్థంలో వ్యక్తమవుతుంది.

నిజామాబాద్‌లోని పోచంపాడులో జరిగిన తెలంగాణ స్టూడెంట్స్ ఫ్రంట్ రాజకీయ శిక్షణా తరగతులలో విద్యారంగం గురించి మాట్లాడిన ప్రొఫెసర్ జయశంకర్ ప్రజాస్వామిక తెలంగాణ అంటే పీపుల్స్‌వార్ కోరుకునే నూతన ప్రజాస్వామిక విప్లవం అనే అర్థం ధ్వనిస్తుంది. కనుక మీరు ఆ నినాదం ఇస్తే తెలంగాణ సాధనకు ప్రతికూలమవుతుందేమో ఆలోచించండని జయశంకర్ అన్నారు. మొదట భౌగోళిక తెలంగాణ రానివ్వండి, తర్వాత మిగతా విషయాలు చర్చించుకుందామని ఆనాటి శుద్ధ ప్రత్యేక తెలంగాణ వాదులందరూ మాట్లాడారు. కానీ తెలంగాణ జనసభ రాజీ లేకుండా పోరాట క్రమంలోనే ప్రజల ఆకాంక్షలు చర్చలో ఉండాలని తన ఆచరణను రూపొందించుకున్నది. ప్రజాస్వామ్య తెలంగాణ నినాదాన్ని ఇచ్చే క్రమంలో బెల్లిలలిత, ఐలయ్య, సుదర్శన్,

కనకాచారి లాంటి నాయకత్వాన్ని రాజ్యహింసకు కోల్పోయింది. ఆ నినాదం ఇవ్వడానికి ఆ నాడు రాజీపడి కేసీయార్‌ను జేఏసీల ద్వారా అధికారంలోకి తెచ్చిన వాళ్లందరూ ఈ రోజు ప్రజాస్వామ్య తెలంగాణ నినాదం ఇవ్వటం అతిపెద్ద రాజకీయ విషాదం. ఆనాడు తెలంగాణ ఉద్యమ సందర్భంలో ఉదాసీనంగా ఉన్న రేవంత్‌రెడ్డి ఇవ్వాళ ప్రజాస్వామిక తెలంగాణ గురించి పూనికతో మాట్లాడుతున్నాడు. ఓట్ల కోసం ఎన్నికల ముందు మాట్లాడని అనుకుందామంటే ముఖ్యమంత్రి హోదాలో అసెంబ్లీలో కూడా ప్రజాస్వామిక తెలంగాణ ప్రస్తావన తెచ్చాడు.

ఉద్యమ కాలంలో ప్రజాస్వామిక ఆకాంక్షల గురించి కొందరు మెతకవైఖరిని ప్రదర్శించటం వలన అధికారమైకంలో కేసీయార్ రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామిక భావనను గౌరవించలేదు. సహజంగా ఫ్యూడలిజంలో ఉండే నియంతృత్వాన్ని అమలుచేసాడు. తెలంగాణ ఉద్యమానికి కేంద్రంగా ఉన్న ఉస్మానియా విశ్వవిద్యాలయంపై కేసీయార్ పరోక్షంగా కక్ష తీర్చుకున్నాడు. ఉద్యమ సందర్భంలో కేసీయార్‌కు ప్రతిపక్షంగా ఉండిన చరిత్రను ఓయూ నెలకొల్పింది. ప్రజల అసమ్మతికి కేంద్రంగా ఉన్న ఇందిరాపార్క్ దగ్గర ఉన్న ధర్నా చౌక్‌ను ఎత్తివేసాడు. ప్రజాసంఘాల సభలు జరగకుండా సుందరయ్య విజ్ఞాన కేంద్రానికి తాళాలు వేయించాడు. ప్రజలను, ప్రజాప్రతినిధులను కలవకుండా, పాలనను తన ఇంటికే పరిమితం చేసాడు. పార్లమెంటరీ సంస్కృతిలో భాగమైన మంత్రి మండలి సమావేశాలను కూడా పాక్షికం చేసాడు. వైయక్తిక నిర్ణయాలే మంత్రిమండలి నిర్ణయాలుగా మార్చాడు. ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడిన మేధావుల మీద ఊపా కేసులు మోపి జైల్లో బంధించాడు. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడితే అర్బన్ నక్సలైట్లనే అపవాదు వస్తుందనే భయాన్ని బుద్ధిజీవుల్లో కల్గించాడు. సీసీ కెమెరా నిఘా నేత్రంలో తెలంగాణ సమాజాన్ని అదుపుచేసాడు. రాజకీయ నాయకులు, మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజలు ఈ పదేళ్ల కాలంలో ఉక్కపోతను అనుభవించారు. ఫలితంగా ఎన్నికల్లో ప్రతికూలతను చవిచూసాడు.

కేసీయార్ విషయంలో ప్రజలు వ్యక్తం చేసిన అసమ్మతిని అర్థం చేసుకుంటేనే, ప్రజాస్వామిక తెలంగాణ చరిత్రను తెలుసుకుంటేనే రేవంత్‌రెడ్డికి రాజ్యాంగ విలువ అర్థమవుతుంది. ప్రజాస్వామిక తెలంగాణ భావన కేవలం ఎన్నికల నినాదం కాదు. అదొక ప్రజాభిప్రాయ విలువ. తెలంగాణ సమాజం ఉక్కపోతను భరించలేదు. చరిత్ర పొడుగునా తన అసమ్మతిని ప్రకటించడానికి అసమాన్య త్యాగాలను చేసిన విలువ తెలంగాణ సొంతం చేసుకున్నది. ఈ సమాజం తన భావనను పాట రూపంలో, ఆట రూపంలో, మాట రూపంలో, పోరాట రూపంలో వ్యక్తం చేస్తుంది. గనీభవించిన సామాజిక విలువలు కదలబారడానికి నరంతర సంవాదంలో ఉండే అరుదైన లక్షణం తెలంగాణకు ఉన్నది. ఈ విలువ అవిచ్ఛిన్నంగా కొనసాగాలంటే మానవ ఆవేదనలన్ని భిన్న రూపాలలో వ్యక్తమయ్యే మార్గం ఉండాలి. ఈ నాటి ప్రజా ఆకాంక్షలో నాణ్యమైన విద్యను పొందడం, ఆరోగ్యం విషమించినప్పుడు అందరూ కనీస వైద్యం పొందటం రాజ్యాంగం కల్పించిన హక్కులే. విస్మృత వర్గాలన్ని తమ విముక్తి కోణం ఆలపిస్తున్న బృందగానం కూడా ప్రజాస్వామిక విలువనే. ప్రతీ మనిషి సామాజిక నిర్మాణంలో సమానత్వంగా, గౌరవంగా జీవించడం మానవీయ విలువనే. చేతికింత పనిలేక ఆకలితో అర్థాంతరంగా జీవితం నుంచి నిష్క్రమించే స్థితి కొందరికి ఉందంటే అది మన సమాజపు అవిటితనం అవుతుంది. ఈ సమాజం మౌలికంగా మారి నూతన విలువలను ఆవిష్కరించుకోవాలని కొందరు ప్రాణతర్పన చేస్తూ రాపిడిపడే అవకాశం ఉన్నప్పుడే మన ప్రజాస్వామిక పరిపక్వత నిలబడుతుంది. ఇంతటి లోతైన చింతన ఉన్నప్పుడే రేవంత్‌రెడ్డికి ప్రజాస్వామిక తెలంగాణ భావన అర్థమవుతుంది.

★ రచయిత: ప్రొఫెసర్, ఓయు

# విద్య-అంబేద్కర్ ప్రాసంగికత

చెలిమి

విద్య అనే పదం విథ్ అనే సంస్కృత ధాతువు నుంచి వచ్చింది. విద్య అంటే ప్రవేశించుట, నేర్చుకొనుట, నైపుణ్యం అనే నైఘంటికార్థాలు ఉన్నాయి. కానీ వ్యవహారంలో విద్య అంటే అక్షరాలు నేర్చుకోవటం అని ఉంది. దీనిని బలపర్చేటట్టు 'విద్య లేని వాడు వింత పశువు' అనే సామెతను కూడా ప్రచారంలో పెట్టారు. అక్షర జ్ఞానం ఉన్నవాడు అనే అర్థంలో విద్య పదాన్ని ప్రయోగిస్తున్నారు. నిఘంటువు అర్థం ప్రకారమైతే, నాగలి దున్నటం, కుండను తయారుచేయటం, బట్టను నేయటం, చెప్పులు కుట్టటం మొదలైన ఉత్పత్తి కులాల నైపుణ్యాలను ఒక తరం నుంచి మరో తరానికి అందించటమే విద్య. ఒక పనిలోకి ప్రవేశించటం, దానిని నేర్చుకోవటం, అందులో నైపుణ్యం పొందటం- ఇది చాలా శాస్త్రీయ నిర్వచనం. బహుశ లిపి పూర్వదశలో విద్యకు ఈ నిర్వచనం ఉండి ఉంటుంది. లిపి ఏర్పడి, వర్ణ వ్యవస్థ ఉనికిలోకి వచ్చాక అక్షర జ్ఞానాన్ని తమ అదుపులో ఉంచుకున్న బ్రాహ్మణిజం శారీరక, మానసిక శ్రమలకు మధ్య అంతరాన్ని సృష్టించింది. దూరాలను పెంచుతూ పోయింది. ఇతర వృత్తులు చేసే వాళ్లు విద్యావంతులు కాదని, కేవలం వేద పఠనం, మంత్రోచ్ఛారణ చేసేవారే విద్యావంతులనే ప్రచారం ముందుకు వచ్చి ఉంటుంది.

ఇదంతా తెలిసిన వాళ్లు కూడా అక్షరాస్యులనే విద్యావంతులని అంటున్నారు. సమాజంలో ఇది స్థిరపడిన భావనగా చలామణి అవుతోంది. విద్య గురించి మాట్లాడే వాళ్లంతా అక్షరాస్యత గురించే మాట్లాడుతున్నారు. అయితే కొందరు మాత్రం అక్షర జ్ఞానంతో కూడిన స్థాయిలోనే కాకుండా సమాజంలో మౌలిక మార్పును తెచ్చే సాధనంగా విద్య ఉండాలని భావిస్తున్నారు. ఇది సాధ్యం కావాలంటే పాఠ్య ప్రణాళికల రూపకల్పన, శాస్త్రీయ పాఠ్యాంశాల ఎంపిక, బోధనా పద్ధతులు, తరగతిగది వాతావరణం మొదలైన నిర్మాణమంతా కింది నుండి(from the below) జరగాలని వీరి ఉద్దేశ్యం.



ఇలాంటి వాళ్లలో డా॥బి.ఆర్.అంబేద్కర్ మొదటివాడు.

విద్య గురించి ఆయన చేసిన ఆలోచనలు అందరిలాంటివి కావు. భిన్నమైనవి. భారతదేశంలో శాస్త్రీయ విద్యా విధానం కావాలని 60వ దశకం నుంచి వామపక్ష, విప్లవ శిబిరాలకు చెందిన ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. కాని ఈ విషయాలను అంబేద్కర్ 1927 నుంచే ఆలోచిస్తూ, రాస్తూ, ప్రభుత్వం ముందు ప్రతిపాదన రూపంలో పెడుతూ వచ్చాడు. అంబేద్కర్‌కు విద్యా విధానం పట్ల స్పష్టమైన అభిప్రాయాలు ఏర్పడటానికి జీవితంలో ఆయన అనుభవించిన అవమానాలే పునాదిగా పనిచేసాయి.

ఒక రోజు గణితం టీచర్ బ్లాకు బోర్డు మీద ఒక లెక్కవేసి దానిని సాధించవల్సిందిగా తరగతి గదిలోపల బెంచీల మీద కూర్చున్న అగ్రకుల విద్యార్థులను అడిగాడు. ఎవరూ దానిని సాధించలేకపోయారు. కాని తరగతి గది బయట కూర్చొని ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ పాఠాలు వింటున్న అంబేద్కర్ ఆ లెక్కను సాధిస్తానని అన్నాడు. ఆ టీచర్ అంబేద్కర్‌ను తరగతి గదిలోకి ఆహ్వానించాడు. కాని తరగతిలో ఉన్న విద్యార్థులు అంబేద్కర్ ఆ బోర్డును తాకడానికి వీలులేదని అన్నారు. టీచర్ ఎందుకని అడిగాడు. 'మేము తినడానికి తెచ్చుకున్న టిఫిన్ బాక్సులు బోర్డు వెనుకాల ఉన్నాయి. అంబేద్కర్ బోర్డును ముట్టుకుంటే అతని మైల బ్లాకు బోర్డుకు అంటి తద్వారా టిఫిన్ బాక్సులకు అంటుతుంది' అన్నారు. టీచర్ ఏం చేయలేక పోయాడు. అంబేద్కర్ ఆ లెక్కను సాధించకుండా నిరాశగా బయటికి వెళ్లిపోయాడు. తరగతి గదిలో కూర్చున్న సోకాల్డ్ అగ్రకుల 'ప్రతిభా వంతులు' టీచర్ వేసిన లెక్కను చేయలేక పోయారు. కాని అంటరాని ప్రతిభావంతుని ప్రతిభను మాత్రం అణిచివేసారు. ఈ సంఘటన అంబేద్కర్ జీవితం మీద విశేష ప్రభావం వేసింది.

ఇట్లాంటి అవాంతరాలు, అవమానాలు ఎన్ని ఎదురైనా అంబేద్కర్ చలించలేదు. వెన్ను చూపలేదు. ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. కసితో చదివాడు. పట్టుదలగా చదివాడు. చదువుల్లో ఉండే సారాన్నంతా గ్రహించాడు. దేశ విదేశాలలో అత్యున్నత డిగ్రీలు పొందాడు. ఆ రోజుల్లోనే అంబేద్కర్ పదేళ్ల పాటు విదేశాలలో చదువుకున్నాడు. ఎం.ఏ, పిహెచ్.డి, ఎమ్మెసి, డిఎస్సీ, బార్-ఎట్-లా డిగ్రీలు కష్టపడి సాధించాడు. అంబేద్కర్‌కు కొలంబియా(1952) ఉస్మానియా విశ్వవిద్యాలయాలు(1953) గౌరవ డాక్టరేట్లను ఇచ్చి తమను తాము గౌరవించుకున్నాయి. ఈ చదువంతా, జ్ఞానమంతా అంబేద్కర్‌లో సూక్ష్మ పరిశీలన తెచ్చింది. హేతు దృష్టిని పెంచింది. ప్రజాస్వామిక దృక్పథాన్ని ఇచ్చింది. ప్రజానుకూల ఆలోచనలు చేయడానికి ప్రాతిపదిక దొరికింది.

విద్యారంగానికి సంబంధించిన స్పష్టత అంబేద్కర్‌లో రావడానికి ఇద్దరు వ్యక్తుల ప్రభావం ఉందని ఆయనను చదివాక అన్పిస్తుంది. ఒకరు బుద్ధుడు రెండో వ్యక్తి జాన్ డివే. అంబేద్కర్ రోజూ ఒక పార్కులో కూర్చొని శ్రద్ధగా చదువుతుండేవాడు. అదే పార్కులోకి కేలూస్కర్(మరాఠీ పండితులు) షికారుకు వెళ్లేవాడు. అంబేద్కర్‌కు చదువు పట్ల ఉన్న ఆసక్తిని గమనించి 'బుద్ధుని జీవితం' అనే పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చాడు. ఆ పుస్తకాన్ని చదివిన అంబేద్కర్‌ను బుద్ధుడు ఎంతగానో ప్రభావితం చేసాడు. ఈ ప్రభావం అంబేద్కర్ విద్యా విధానానికి సంబంధించిన ఆలోచనలలో కూడా వ్యక్తమయ్యింది.

అంబేద్కర్ కొలంబియాలో చదువుకుంటున్న సందర్భంలో జాన్ డివే శిష్యరికం లభించింది. జాన్ డివే ఉదారవాద ప్రజాస్వామిక భావాలు కలిగినవాడు. అమెరికా విద్యా విధానాన్ని, సంస్కృతిని సంపూర్ణంగా అధ్యయనం చేసి వాటిపట్ల సాధికారిక వ్యాఖ్యానం చేయగలిగిన వ్యక్తి. అంతేకాదు ఆయన ఆలోచనల ద్వారా, అమెరికా విద్యా విధానానికి, సంస్కృతికి స్థిరత్వాన్ని కల్పించాడు. "వ్యక్తులను మలచడానికి, సామాజిక మార్పును ప్రేరేపించడానికి విద్యను ఒక సాధనంగా వాడాలని, విద్య ద్వారా సామాజిక, సాంస్కృతిక జీవనంలో గుణాత్మకమైన మార్పులు తేవచ్చునని" డివే నమ్మాడు.

అందుకే అంబేద్కర్ డివే ప్రభావంతో విద్య సామాజిక మార్పులో ఆయుధంగా పనిచేస్తుందని చెప్పాడు. ఆయన సామాజిక జీవితంలో కూడా ఎడ్యుకేట్, ఎజిటేట్, ఆర్గనైజ్ అనే నినాదాలను రూపొందించుకున్నాడు. బోధించడం ద్వారా సమీకరించడం, సంఘటితంగా పోరాడి విముక్తిని సాధించడం అనే సూత్రాన్ని ఆచరించాడు. 1927లో బాంబే విశ్వవిద్యాలయ సవరణ చట్టం బిల్లుపై ప్రసంగిస్తూ "మనం నాగరికత అందించిన భౌతిక ప్రయోజనాలనైనా వదులుకోవచ్చునేమో కాని, విద్య ద్వారా లభించే సర్వోత్కృష్ట

ఫలితాలను, ఫలాలను సంపూర్ణంగా అనుభవించే హక్కును మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కోల్పోకూడదు. సమాజంలో వెనుకబడ్డ కులాలవారు విద్య లేకుండా తమ ఉనికికి భద్రత లేదన్న విషయం ఇప్పుడిప్పుడే తెలుసు కుంటున్నారు" అని అన్నారు.

అంబేద్కర్ ఇండియాలో చదువుకునే రోజుల్లో అగ్రకుల విద్యార్థుల నుంచి, అధ్యాపకుల నుంచి తీవ్రమైన వివక్షను అవమానాన్ని ఎదుర్కొన్నాడు. అదే అంబేద్కర్ కొలంబియా చదువుల కోసం వెళ్లినప్పుడు వ్యక్తి స్వేచ్ఛ, హోదా, గౌరవం, సమానత్వం చూసాడు. ఇవన్నీ అమెరికన్ సమాజానికి విద్య ద్వారా వచ్చాయని నమ్మాడు. కనుక భారతదేశంలో ఉన్న సంప్రదాయ విలువలు వేగంగా తుడిచిపెట్టుకపోవాలంటే విద్య ప్రధాన పాత్ర వహిస్తుందని అంబేద్కర్ విశ్వాసం. తిరోగమన సంప్రదాయ భారతదేశాన్ని మార్చడమన్నది విద్య ద్వారానే సాధ్యం అవుతుందని నమ్మాడు. అయితే విద్య అంటే కేవలం అక్షరజ్ఞానం, అక్షరాస్యత, చదువు అనే పరిమిత అర్థంలో అంబేద్కర్ చూడలేదు. మనిషిని సంపూర్ణంగా మార్చే ఆయుధం విద్య అనే భావించాడు. మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్ది జ్ఞానం వైపు నడిపించేలా విద్య ఉండాలి అనుకున్నాడు.

ఈ ఆలోచనలకు మూలం బౌద్ధం. తాను చిన్ననాడు చదువుకున్న బౌద్ధం, తర్వాత అధ్యయన విస్తృతిని పెంచుకొని విద్యకు సంబంధించి బౌద్ధం చెప్పిన సూత్రాలను తన విద్యా లక్ష్యాలలో ప్రతిబింబించాడు. బౌద్ధం ప్రజ్ఞ, కరుణ, సమత అనే గుణాలు మనిషికి ఉండాలని చెబుతుంది. ఈ త్రిగుణాలే విద్య పరమార్థంగా ఉండాలని అంబేద్కర్ భావన. ప్రజ్ఞ ప్రతి మనిషిలో ఉండాలి, అయితే కరుణ, సమతతో కూడిన జ్ఞానం ఉన్నప్పుడే అది సమాజానికి ఉపయోగపడుతుందని అంబేద్కర్ ఆలోచన.

1928లో అంబేద్కర్ 'బహిష్కృత హితకారిణి' సభ తరపున సైమన్ కమీషన్‌కు సమర్పించిన నివేదికలో ఉత్పత్తి కులాలకు విద్య అందవల్సిన అవసరాన్ని చెప్పాడు. సైమన్ కమీషన్, నిర్బంద ప్రాథమిక విద్యను రద్దు చేయాలనే ప్రతిపాదనతో వస్తే అంబేద్కర్ దానిని వ్యతిరేకించి దళితులు చదువుకోవాలంటే నిర్బంధ విద్య ఉండాలని చెప్పాడు. అంతేకాకుండా 1883లోనే మహాత్మ జ్యోతిరావు ఫూలే, హంటర్ కమీషన్‌కు దళితులు, శూద్ర కులాల విద్య గురించి ఇచ్చిన నివేదికను, అనంతరం వచ్చిన కమీషన్ రిపోర్ట్‌ను అమలు చేయాలని పట్టుపట్టాడు. చదువుకున్నవారికి ఉద్యోగం ఉంటుందనే హామీని ప్రభుత్వం ఇస్తే తప్పనిసరిగా చదువుకునేవాళ్ల శాతం పెరుగుతుందని సూచించాడు. ప్రాథమిక విద్య బలపడకపోతే ఎంత ప్రయత్నం చేసినా ఉన్నత విద్య నిష్ప్రయోజనంగా మారుతుందని చెప్పాడు.

దళిత విద్యార్థులకు తిండిని సమకూర్చుకోవడమే కష్టంగా ఉంటుందని కనుక ప్రభుత్వమే వారికి హాస్టళ్లను నెలకొల్పి చదువు చెప్పించాలని అంబేద్కర్ కమీషన్‌ను కోరాడు. 100 మంది విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో చేరితే 4వ తరగతికి వచ్చేసరికి 18 మంది విద్యార్థులు మాత్రమే మిగులుతున్నారని 82 మంది విద్యార్థులు ప్రాథమిక విద్యలోనే డ్రాపౌట్స్ ఉండటం దళితుల, శూద్ర కులాల స్థితిని తెలియచేస్తుందని వివరించాడు. దీనికి విరుగుడు హాస్టల్స్‌ను నెలకొల్పడమేనని సూచించాడు. చరఖాను వడుకుతూ విద్యను నేర్చుకోవాలని గాంధీ తన బేసిక్ విద్యావిధానంలో చెబితే, పనులు చేస్తూ డబ్బు సంపాదిస్తూ చదువు కోవటం వలన విద్యార్థికి చదువు మీద ఆసక్తి తగ్గి, సంపాదన మీద ఆసక్తి పెరుగుతుందని విమర్శ పెట్టాడు. పైగా గ్రామాలలో చరఖా వడుకుతూ చదువుకోవటం వలన గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నష్టం జరిగి పట్టణ ప్రాంతాలలో ఉండే విద్యార్థులకు లాభం జరుగుతుందన్నాడు.

బాల్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఏ పనులు చేయకుండా చదువుకునే హక్కు పిల్లలకు ఉండాలని చెప్పాడు. దళిత, శూద్ర కులాల విద్యార్థులలో దళిత విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తే వాళ్లు చదువుకునే అవకాశం ఏర్పడుతుందని భావించిన అంబేద్కర్ స్వయంగా 1925లోనే బెల్గాం, షోలాపూర్‌లో హాస్టల్స్ నెలకొల్పాడు.


1946 సెప్టెంబర్ 13న అంబేద్కర్ 'పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ' అనే సంస్థను స్థాపించాడు. ఆ సందర్భంలో విద్య గురించిన స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేసాడు. "హక్కుల సాధన కోసం చదువుకోండి. సంఘటితం కండి. పోరాడండి. విశ్వాసం పెంచుకోండి. మనకు ఓటమి ఉండదు. ఇది విజయం కోసం చేస్తున్న పోరాటం. స్వేచ్ఛ కోసం సాగిస్తున్న యుద్ధం. ఈ యుద్ధం మనం కోల్పోయిన వ్యక్తిత్వాన్ని తిరిగి

పొందడానికి చేస్తున్నది" అన్నాడు. దళితులు చదువుకోవడం ద్వారా తరతరాలుగా ఆచరిస్తూ వస్తున్న వృత్తులకు స్వస్తి చెప్పి గౌరవప్రదమైన వృత్తులలో స్థిరపడే అవకాశం ఉంటుందని, ఫలితంగా అగ్రకులాల దృష్టిలో ఉండే చిన్నచూపు కొంతైనా తగ్గుతుందని అంబేద్కర్ భావించాడు. అందుకే పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీకి జ్ఞానం, మేధో సంపత్తి, నైతిక విలువలు, సాంఘిక ప్రజాస్వామ్యం అనే లక్ష్యాలను రూపొందించాడు. అంబేద్కరే ప్రారంభించిన ఇండిపెండెంట్ లేబర్ పార్టీ(1936) ఎజెండాలో అందరికి విద్య, నిర్బంధ ఉచిత విద్య ఉంటుందని ప్రకటించాడు. పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటి తరపున 50 వరకు విద్యా సంస్థలను స్థాపించాడు. వాటికి పేర్లను పెట్టడంలో కూడా శాస్త్రీయ దృక్పథాన్ని ప్రదర్శించాడు. సిద్ధార్థ, గౌతమ, మిళింద పేర్లతో విద్యాలయాలను నెలకొల్పాడు. మొదటి రెండు బుద్ధుని పేర్లు మూడోది రాజా మిళింద అనే బౌద్ధ మేధావి పేరు.

అధ్యాపకుడు, విద్యాలయ వాతావరణం- ఈ అంశాలను గురించి అంబేద్కర్ గొప్ప ఆలోచనలు చేసాడు. అధ్యాపకుడికి పరిశోధన, వాగ్ధాటి, రచనా నైపుణ్యం అనే మూడు లక్షణాలు ఉండాలన్నాడు. బోధన విశాల దృక్పథంతో నడవాలి, అధ్యాపకుడికి స్వేచ్ఛ ఉండాలని చెబుతూ విశ్వవిద్యాలయాలు కేవలం గుమస్తాలను తయారు చేసే కేంద్రాలుగా ఉండవద్దని చెప్పాడు. డిగ్రీ, పీజీకి ఒకే అధ్యాపకుడు బోధించటం వలన విద్యార్థులకు జ్ఞానం పెరుగుతుందని అన్నాడు. విద్యను వాణిజ్యీకరించడాన్ని అంబేద్కర్ ఆనాడే తప్పుపట్టాడు. 90 ఏళ్ల కింద భారతదేశంలో ఉండవల్సిన విద్యా విధానం గురించి అంబేద్కర్ చెప్పినది శాస్త్రీయమూ, ఆచరణీయమూ అయిన పద్ధతి. 129వ జయంతి సందర్భంలో అంబేద్కర్‌ను నెత్తిన ఎత్తుకుంటున్న పాలకులు, ఆయన విద్యమీద చేసిన ఆలోచనలను గమనంలో ఉంచుకోవల్సి ఉంది.

సామాజిక మార్పు పోరాటాల ద్వారా, పోరాటాలు విజ్ఞానం ద్వారా, విజ్ఞానం విద్య ద్వారా అందుతాయని అంబేద్కర్ చెప్పిన మాటలను ఉద్యమ శక్తులు గమనంలో ఉంచుకోవాలి.

***రచయిత: తెలుగు పరిశోధకురాలు, కాకతీయ విశ్వవిద్యాలయం**




**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు**

**ఫేస్‌బుక్ పేజీ:** www.facebook.com/pages/Nadustunna-Telangana

# గద్దర్ ఒక సర్వనామం

స్పందన

గద్దర్ మరణం యావత్ భారతదేశ ప్రగతిశీల శక్తులకు తీరని లోటు. అసమానతలు, వివక్షతలతో కూడిన సమాజాన్ని మార్చాలనుకునే అందరికి గద్దర్ అనుసరణీయం. ఆచరణీయం. మరణించిన వేళ ఆయనపై అనుకూల, ప్రతికూల స్పందనలు. సమాజంలో అన్ని కాలం పెట్టే పరీక్షకు నిలబడాల్సిందే. ఈనాడు ఆయనపై విమర్శలు చేస్తున్న వారు ఆయన చేసిన కాంట్రిబ్యూషన్ ని కూడా చూడాలి. గద్దర్ తెలంగాణ కల్లోల కాలంలో పురుడు పోసుకున్న పోరాట బిడ్డ. ఉద్యమాలలో త్యాగాలు సహజం. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమైనా, పటేల్ సైన్యంతో జరిగిన పోరాటమైనా, స్వాతంత్ర్యోద్యమమైనా, 1969 తెలంగాణ పోరాటమైనా, మలిదశ ప్రత్యేక తెలంగాణ పోరాటమైనా త్యాగాల మీదే నడిచింది. ప్రపంచంలో ఏ ఉద్యమమైనా త్యాగాలతోనే నడుస్తుంది. రక్తం చిందని పోరు, జీవితాలు చెదరని ఉద్యమాలు ఈ ప్రపంచంలో ఎక్కడా లేవు. నిత్య జీవితమే మరణ హోమం. ఆకలితో, అవమానాలతో నిత్యం చస్తున్న సమాజాన్ని శాంతి కపోతం అని పిలుద్దామా? హత్యా రాజకీయాలతో వర్ధిల్లే ప్రభుత్వాలను రామ రాజ్యం అందామా?

నా దృష్టిలో గద్దర్ విప్లవకారుడిగానే బతికాడు. విప్లవకారుడిగానే మరణించాడు. తుపాకి పట్టుకొని, మావోయిస్టు పార్టీ కట్టుబాట్లకు, నాస్తికత్వానికి కట్టుబడి ఉన్నంత వరకే విప్లవకారుడు అనే నిర్వచనాలు ఉంటే చెత్తకుండిలో వేసుకోండి. చెత్తకుండిని కూడా విప్లవ చైతన్యానికి ప్రతీక చేసిన నిజమైన సాంస్కృతిక విప్లవకారుడు గద్దర్. సమాజాన్ని ముందుకు నడిపించడంలో కమ్యూనిజం చేసిన పాత్రను ఎవరు కాదనలేరు. ఒక మార్గానికి అన్ని వర్గాల మద్దతు దొరకదు. భిన్నాభిప్రాయాలు ఉంటాయి. దాడులు, ప్రతి దాడులు ఉంటాయి. అయినా విప్లవకారులకు ఆచరణల్లో ఎత్తుగడలు ఉంటాయన్న విషయాన్నే మర్చిపోవడం విడ్డూరం. చివరి క్షణం వరకు సమాజాన్ని మార్చాలనే తపన పడ్డ మనస్సుకు ఫేస్‌బుక్ పోరాట యోధులకు, వాట్సప్ విప్లవకారులకు ఆయన ఆచరణ గురించి అర్థం కాదు.

మావోయిస్టు పార్టీ "1972 నుండి గద్దర్ విప్లవ ప్రస్థానం మొదలై 2012 వరకు కొనసాగింది" అని ప్రకటించుకుంది. ఆ తర్వాత ఆయన ఆచరణ విప్లవకర శక్తులకు సహాయంగా ఉన్నాయా? లేవా? అన్న విషయాన్ని మరిచి విప్లవకారుడు అనే నిర్వచనాన్ని కుచింపజేసింది. నిజానికి 2012 తర్వాత కూడా ఆయన తెలంగాణ ప్రజల తరపున పోరాటం చేశాడు. పాటను వదలలేదు. మాటను వదలలేదు. ఏడు పదుల వయస్సులో కూడా ఎక్కడికి పిలిస్తే అక్కడికి వెళ్లి ప్రజలను చైతన్యం చేసే ప్రయత్నం చేశాడు. ఏ స్టేజి దొరికితే దాన్ని ఉపయోగించుకున్నాడు. మందు తాగొద్దు అని చెప్పాడు. మందు తాగితే కుటుంబం నాశనం అవుతుంది అన్నాడు. ఇంకాస్త ముందుకు వెళ్లి అసలు మందు ఎందుకు అమ్ముతున్నారు అని ప్రశ్నించాడు. నిన్ను రాజ్యం ఎందుకు మత్తులో ఉంచుతుందో తెలుసా? అని గతితర్కాన్ని చెప్పాడు. ఎక్కడ ఆయన విప్లవ మార్గాన్ని వదిలాడో అర్థం కావటం లేదు. గుళ్లు, గోపురాలు కూడా పోరాట కేంద్రాలే అని భావించలేమా? దేశంలో ఉన్న వాస్తవిక పరిస్థితిని ఎందుకు మరవాలి? "యాదగిరి నర్సన్న" పాటలో ఆయన వేసిన ప్రశ్నలను అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో మనం ఉన్నామా? సమాజాన్ని మార్చాలంటే మీరనుకునే విప్లవకారుడే అయి మాత్రమే

ఉండాలా? సాధారణ మనిషిని ప్రగతిశీల శక్తిగా గుర్తించవద్దా? తునకలు తిన్నానని, బొక్కలు మెడలేసుకొని తిరగాలా? ఏమి అభాండాలు ఇవి.

సమాజాన్ని ఒక మెట్టు ఎక్కించడానికి ఎవరు కృషి చేసిన వారు పోరాడే శక్తులకు ఆచరణీయుడే. గద్దర్ విప్లవానికి ఒక సర్వనామం. విప్లవమంటే మార్పు. సమాజంలో అప్పటివరకు గూడు కట్టుకొని, పిల్లలు కంటున్న భావజాలానికి అడ్డుకట్ట వేసిన సామాజిక మార్పుకు గద్దర్ ఒక సర్వనామం. సమాజ మార్పే లక్ష్యంగా గజ్జె కట్టి, పాటలు పాడి ప్రజలను చైతన్యం చేశాడు. విప్లవ సాంస్కృతిక యోధుడు ఏ విప్లవ పార్టీలో సభ్యుడు కానక్కర్లేదు. రాజ్యాధికార సాధనకు అవగాహన కల్పించాలని తపన పడ్డాడు. పీడిత ప్రజలకు అధికారం దక్కడానికి మార్గాలను అన్వేషించాడు. ఆ అన్వేషణలోనే కుల, మత, వర్ణ, వర్గ, లింగ అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఒరిగిపోయాడు. గద్దర్ ఒక అమర వీరుడు. బురదలో పంది పొర్లుతున్న సమూహాలను తట్టి లేపే ఎన్నో పాటలను గద్దర్ ఆశువుగా పాడాడు. పాకుతూ పోతున్న సమాజాన్ని నిలబడి కలబడేలా చేసిన అసమాన పోరాట వ్యక్తీకరణ తన కార్యాచరణ ద్వారా అందించాడు. గద్దర్ ఒక కవి, రచయిత, విమర్శకుడు, పాటగాడు, ఆటకాడు, ఒక విప్లవకారుడు. వీటన్నింటిని ఆయన తన ఆచరణ ద్వారానే సాధించాడు.

గద్దర్ అమర్ రహే.....

★ రచయిత: ఆంగ్ల అధ్యాపకురాలు, బద్రుకా కాలేజ్



# భూమి-గింజ

కొత్తపల్లి సత్యం

భూమికి గింజకి ఉన్న సంబంధం ఏమిటి? భూమికి గింజకి సంబంధం కలిపి జీవ కోటికి ఆహారం సృష్టించే మనిషికి మాత్రం ఏ సంబంధం లేకుండా పోయింది. ఎందుకని?

భూమి ఎవరి సొత్తు? గింజ ఎవరి సంపద? భూమి గింజల సంబంధం తల్లీ బిడ్డల సంబంధాన్ని విడదీసిచూసి తల్లినొకదగ్గర, బిడ్డనొకదగ్గర విడదీసి బంధించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు.

భూస్వాములు, ధనవంతులు, పాలకులు భూమి ఎక్కడుందో తెలియదు కాని వాళ్ళ చేతుల్లో ఉంటది. భూమి సరిహద్దులేంటో తెలియదు కాని వాళ్ళ పేరు మీద పట్టాలు ఉంటాయి.

గింజ ఎక్కడినుండి వచ్చిందో తెలియదు కాని వారి పళ్లెంలో సన్న మెతుకుల అన్నం ఉంటది. ఆ గింజ నాగేటి సాళ్లలో ఒదిగి నానా తంటాలు పడి ఎట్ల పైకి లేస్తుందో వారికి తెలియదు. కాని వారి చేతుల్లో విత్తన శుద్ధి పరిశ్రమ ఉంటుంది.

ఆ గింజలను దోసిట్లో వడిసిపట్టుకొని భూమాత ఒళ్లను గుళ్ల చేసి ఓ భూమాత నీకు వందనం అంటూ తన రక్త మాంసాలన్నీ బిగపట్టి తన శరీరాన్ని, తనరక్తాన్ని చెమటగా మార్చి భూతల్లి పురుడు కోసం ఆకాశం వైపు దీనంగా చూస్తూ ఆ నల్లని మేఘాల ఘర్షణలకు జడవక చూస్తూ కరుణించి కరుణించక వచ్చిన ఆ వర్షపు చినుకులకు కన్నీళ్లను జోడించి ఓ గింజలారా లేవండి అనే రైతుకు భూమికి, గింజతో ఏం బంధం? ఒక గింజకి కోట్లాది గింజలై ఎన్నో కుప్పల రాశు లై పశుపక్షులకు, జంతుజాలానికి, ఈ నవ జీవన నిర్మాణానికి జీవ ధాతువులను ప్రసాదించి నూతన జవసత్వాలకు నాంది పలుకు అంటూ తన కుటుంబాన్ని, తన శరీరాన్ని, సర్వస్వాన్ని త్యాగం చేసి అన్నం మెతుకులు సృష్టించిన కష్టజీవి రైతన్నకు మాత్రం భూమికి గింజకి ఏ సంబంధం ఉండదు ఎందుకని! దీనిపై చర్చ జరగాలి.

వందలాది ఎకరాల మాగాణం ఎవరిపేరిట ఉన్నది? కష్టించి పని చేసే శ్రమ జీవులు ఎవరి పేరిట ఉన్నారు.? బుద్ధి జీవులు ఈ విషయం అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

వందల ఎకరాల భూమి ఒక కుటుంబం పేరు మీద ఉంటే (భూస్వాములు) ఆ వందల ఎకరాలలో కొన్ని వేల కుంటుంబాలు ఆ భూమితో సంబంధం పెట్టుకొని దానితో అనుబంధాలను పెంచుకొని ఆ భూమిని సర్వస్వంగా నమ్ముకొని ఆహారాన్ని ఉత్పత్తి చేసి మనకి, దేశానికి ఇస్తుంటే చివరకు వారికే మెతుకులేదు, బతుకులేదు.



వాళ్ళు కౌలు రైతులుగానో, రైతుకూలీలు గానో, దారిద్రరేఖకి దిగువనున్న వారిగానో రేషన్ కార్డులలోనో రేషన్ దుకాణాల ముందు నిలబడి దొడ్డు బియ్యం అడుక్కునే స్థితిలో నిలబడి ఉన్నారు. ఇక వాళ్ల ఆరోగ్యం గురించి, విద్య గురించి వారు నివసించే ఆవాసాల గురించి చెప్ప నక్కరలేదు. భూమితో ఏ

సంబంధం లేని వారికి వైద్యం, విద్య, సకల సౌకర్యాలు అన్నీ వాళ్ళకే.

భూమిల పుట్టి భూమిల పెరిగి ఎండకు ఎండి, వానకు తడిసి, చలికి వణికి ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకొని నాలుగు మెతుకులు మనకి అందిస్తున్న వారికి ఏమీ లేదు. భూమిని దున్నిన భూమి వారిది కాదు.

పండించిన పంటలు వారివి కావు. ఈ పరిస్థితి పై మేధావులు ముఖ్యంగా పాలకులు, భూస్వాములు, పెట్టుబడి దారులు నిశితంగా ఆలోచించి శ్రమించేవారికి ఫలితం ఉండే విధంగా ఆలోచించాలని నా అభిప్రాయం.

“ఐదారెకరాలు పైబడిన రైతు కుటుంబాలలో ప్రభుత్వ ఉద్యోగం సంపాదిస్తే ఆ ఉద్యోగికి ఆ భూమి పై హక్కులు రద్దు చేయాలి.”

“యాభై నుండి వంద ఎకరాలు ఉన్న భూస్వాములలో ఆ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి ఐదెకరాలు ఉంచి మిగతా భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు ప్రభుత్వ పరంగా వారికి ఆ భూమిని ఇస్తే బాగుంటుంది.”

“సాగుకు అనుకూలంగా ఉన్న భూములు బీడుబడి ఉంటే ఆ పట్టాదారునిపై చర్యలు తీసుకోవాలి.”

“సాగు భూమిని కౌలుకు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలి. పంటకు గిట్టుబాటు ధర తప్పకుండా కల్పించాలి.”

“రైతుబంధు పథకం సాగు చేస్తున్న రైతుకే ఇవ్వాలి. ఎక్కడో ఏసీ గదుల్లో కూర్చున్న వారికి కాదు.”

“భూమిలేని నిరుపేదలు కూడా రైతు బాంధవులే. వారు లేకుంటే ఏ యజమాని సొంతగా తన భూమి సాగు చేసుకోలేడు. వారికి వ్యవసాయ కూలీ బంధు పథకం పెట్టాలి. వారి పిల్లలకి ఉచిత విద్య, వైద్య సౌకర్యాలు అందించాలి. వ్యవసాయ ఎక్విప్‌మెంట్స్ వ్యవసాయదారులకే ఇవ్వాలి. పెట్టుబడిదారునికి కాదు.”

మన దేశ దౌర్భాగ్యస్థితి ఏమిటంటే అధికారులు వాళ్ళే, భూ యజమానులు వాళ్ళే, చట్టాలు చేసేది వాళ్ళే, పట్టాలు ఇచ్చేది వాళ్ళే, కాలేజీలు వాళ్ళవే, ఖార్కానాలు వాళ్ళవే, కార్పొరేటు వైద్య విద్యలు వాళ్ళవే, చదువు వారిదగ్గరే, చట్టం వారిదగ్గరే ఉంది. ఇలాగే కొనసాగితే మన దేశం ఆహారసంక్షోభంలో పడక తప్పదు.

“దున్నే వారి దగ్గరే భూమి ఉండాలి.” భూమికి గింజకూ జరుగుతున్న పోరాటమే ఇది. ఈ రెండింటి సహచర్యం గమనంలో నలుగుతున్న మట్టి మనిషి బతుకేమిటి? మనం ఆలోచించాలి.

“భూమినుండి గింజ, గింజనుండే బువ్వ, బువ్వకొరకే మనిషి”.

★ రచయిత: సామాజిక విశ్లేషకులు


Statement about ownership and other particulars of periodical Nadusthunna Telangana as required to publisher in The First issue of every year after the last day of February

**Form IV (See Rule 8)**

| | |
|---|---|
| 1. Place of Publication | : Hyderabad |
| 2. Periodicity of its publication | : Monthly |
| 3. Printer's name | : M.Snehalatha |
| Whether citizen of India | : Indian |
| Adress | : H.No:1-1-305, Road No.6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Hyd-35 |
| 4. Publisher's Name | : M.Snehalatha |
| Whether citizen of India | : Indian |
| Adress | : H.No:1-1-305, Road No.6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Hyd-35 |
| 5. Editor's name | : Dr.C.Kaseem |
| Whether citizen of India | : Indian |
| Adress | : H.No:1-1-305, Road No.6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Hyd-35 |
| 6. Name and addresses of individuals who own the Newspaper | : M.Sneha Latha |

I, M.Sneha Latha, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

sd/-


Date : 1st March, 2024

(M.Sneha Latha)
Signature of the publisher

# భాషా ప్రజాస్వామికవాది-కాళోజీ

డా॥ శివన్న చంద్రయ్య

కొత్తగా ఏర్పడిన రాష్ట్రమేదైనా అంతకుపూర్వం విస్మరణకూ, వివక్షకూ గురైన తన చారిత్రక మూలాలను అన్వేషించడం పరిపాటి. సాహిత్య, సాంస్కృతిక చరిత్రను పునర్మూల్యాంకనం చేసుకోవడాన్ని అందులో భాగంగానే చూడాల్సి ఉంటుంది. 1956లో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని "తెలుగు భాషాదినోత్సవం"గా జరుపుకోవడం ఇటువంటిదే. తెలుగు భాషాసేవలో తన ఆరోగ్యాన్నీ జీవితాన్నీ పట్టించుకోని త్యాగధనుడు గిడుగు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆయనను సమున్నతంగా గౌరవించు కుంటున్నాం. ఈ విలువల కొనసాగింపుగా ప్రత్యక్షంగా పరోక్షంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగస్వాములైన మహనీయులను తెలంగాణ రాష్ట్రావిర్భావం తరువాత స్మరించుకొంటున్నాం. వారి స్మృత్యర్థం ఎన్నో కార్యక్రమాలను కొత్తగా నిర్వచించుకొంటున్నాం. ఆ వరుసలో కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని "తెలంగాణ భాషాదినోత్సవం" జరుపుకుంటున్నాం. ప్రతి ఏడాది కాళోజీ పురస్కారం పేరుతో తెలుగు భాషాసాహిత్య రంగాల్లో విశేషమైన కృషిచేసిన తెలంగాణ సాహితీవేత్తలను గొప్పగా గౌరవించుకొంటున్నాం. ఈ రెండు కార్యక్రమాలద్వారా సామాజిక చైతన్యాన్ని, ముఖ్యంగా ప్రజల వాడుక భాష విషయంలో ప్రజాస్వామిక స్ఫూర్తిని పొందుతున్నాం.



నవోత్తేజం పొందటానికి ఇవి అవసరమైన కార్యాలు.

హక్కుల కార్యకర్త, సామాజికవేత్తైన కాళోజీకీ, భాషోద్యమానికీ ఏంటి సంబంధం? ఆయన జయంతిని 'తెలంగాణ భాషాదినోత్సవం' పేరుతో అధికారికంగా ఎందుకు నిర్వహించాలి? ఆంధ్రప్రదేశ్‌కు 'గిడుగు' ఉన్నాడు కాబట్టి తెలంగాణకూ కాళోజీనా? మొదలైన ప్రశ్నలకు సమాధానాలు కాళోజీ జీవితాన్నీ, తెలుగు భాషపట్ల ఆయనకున్న ప్రజాస్వామిక దృక్పథాన్ని క్షుణ్ణంగా ఎరిగినవారికి చెప్పక్కర్లేదు. భాషకీ సమాజానికీ మధ్యగల సంబంధం అవిభాజ్యమైందని సామాజిక భాషాశాస్త్రం చెబుతుంది. సామాజికంగా భాషల వాడకం, వాటికి గౌరవం, హెూదా పెరిగినప్పుడే అవి బతుకుతాయనేది భాషావేత్తల అభిప్రాయం. సదరు భాషావ్యవహర్తలూ ఆత్మగౌరవంతో తలెత్తుకొని తిరుగుతారనేది చారిత్రక సత్యం. కానీ, ఈ రకమైన గౌరవప్రద 'హెూదా' ఇవ్వడం విషయంలో మన నాలుగు తెలుగు ప్రాంతాల మధ్య 'సమానత్వం' పాటించబడలేదనేది అరిగిపోయిన సత్యం. “ఆనాడు రాఘవాచారి, తెలంగాణల కవులే లేరన్నడు గాని, ఇయ్యాళ తెలంగాణల తెలుగే లేదంటున్నరు. ఇదెక్కడి విచిత్రం. ఇప్పుడు ఎంతమంది ప్రతాపరెడ్లు కావాల్నో!”అని తోటి తెలుగువారు చూపిన భాషావివక్షకు దుఃఖపడ్డాడు కాళోజీ. నిజాంరాజ్యంలో అన్యాయమైన తెలుగుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనైనా గౌరవం దక్కుతుందని కలగన్న కాళోజీకి నిరాశే ఎదురైంది. ఆ దశలో తెలంగాణ ప్రాంత తెలుగుపై బహిరంగంగానే అమలైన చిన్నచూపును వ్యతిరేకించే గొంతుకగా తెలంగాణ చరిత్రలో మనకు కాళోజీ కనబడుతాడు. ఆయన కవిత్వంలో తెలంగాణ నుడికారం నిబిఢీకృతమైన తీరు ఆయనలో ఉన్న తెలంగాణ భాష అస్తిత్వానికి అద్దం పడుతుంది.

“అన్యభాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు/ సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా”. “నీ భాష దీనతకు/నీ వేష దుస్థితికి/కారకుడు నీవేయని కాంచవెందుకురా”అని కాళోజీ విమర్శించారు. ఈ కవితావ్యాఖ్యలో 'ఆంధ్రమ్ము', ఆంధ్రుడా'' అనే మాటలను తెలుగు భాష, యావత్ తెలుగువారు అనే అర్థంలో ప్రయోగించాడు. ఆనాడు హైదరాబాద్ రాజ్యంలో 'ఆంధ్ర' పేరుతో ఎన్నో సంస్థలు తెలుగు భాషాసంస్కృతుల పునర్నిర్మాణానికి కృషిచేసాయి. తరువాత కాలంలో కాళోజీ 'తెలంగాణ భాష' అని ప్రత్యేకంగా పలుమార్లు నొక్కిచెప్పాడంటే 'తెలంగాణ భాష' తెలుగు భాషకంటే ప్రత్యేకమైన 'భాష' అని ఆయన ఉద్దేశంగా తీసుకోకూడదు.

తెలంగాణలో తెలుగే లేదని అవహేళన చేసిన ఆధిపత్య భావజాలంకలవారినీ, తమ స్వార్థానికి అనుకూలంగా కొంతమంది వాడుకున్న ఆంధ్రప్రాంత తెలుగునూ వ్యతిరేకించే క్రమంలో “తెలంగాణ భాష” అనే పదబంధాన్ని ఒక ధిక్కార స్వరంగా వినిపించిన వాడు కాళోజీ. తెలంగాణ తెలుగు గురించి తెలుగేతరుడు ఎవడో అన్న “తౌరక్యాంధ్రం” అనే మాటను ఇప్పుడు ''మీరూ అంటాంద్రు''అని కొంతమంది ఆంధ్రరచయితలనుద్దేశించి చెబుతూ బాధపడ్డాడు. ఇలా పెల్లుబికిన కోపంలోంచి “చా అంటే తప్పు, టీ అంటే తెలుగా? సిల్సిలా అంటే తప్పు సీరియల్ అంటే రైటా? నాష్త అంటే కొంపమునుగుతది.

తోలుకొచ్చినం అంటే పశువులనే. పోయిందంటే చావే." ఇలా రెండు తెలుగు ప్రాంతాల మధ్యగల ఎన్నో భాషావైవిధ్యాలను ఎత్తిచూపుతూ ఆనాటి 'తెలంగాణ భాష'పై వివక్ష ఏ స్థాయిలో ఉండేదో అవగతంచేసాడు. భాషావిషయిక చైతన్యాన్ని తెలంగాణ ప్రజల్లో రగిల్చాడు. "ఎవని వాడుక భాషల వాడు రాయాలె. ఇట్లరాస్తే అవతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకుడు, మనను మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె.'' అంటూ తెలంగాణ రచయితల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. ఈ ఆలోచనల కొనసాగింపుగా బలపడ్డదే "తెలంగాణ భాషావాదం". ఒకరకంగా ఈ వాదానికి ప్రేరకం ఆనాటి కొంతమంది ఆంధ్ర రచయితలేననేది చరిత్ర చెబుతున్న వాస్తవం. వాళ్ల ఆధిపత్యంలోని పత్రికారంగం. నేడు తెలంగాణ ప్రజలూ "తెలంగాణ భాష" అనడాన్ని ఇదే చారిత్రక నేపథ్యంలో అర్థంచేస్కోవాల్సి ఉంటుంది. విశాల హృదయంతో ఆహ్వానించాల్సి ఉంటుంది. విజ్ఞులైన తెలంగాణవారందరికీ తెలుసు రెండు రాష్ట్రాల్లోని తేట తెలుగు ఒక్కటేనని. ఆంగ్లభాషాధిపత్యంలో రెండు రాష్ట్రాల్లోనూ నష్టపోతున్న తెలుగు ఒక్కటేనని.


కాళోజీ కృషి తెలుగుభాష విషయంలో సామాజికమైంది. ఆయన గిడుగువలె భాషానిర్మాణాన్నీ, దాని విశేషాలను చర్చించలేదు. కాళోజీ, భాషకు సంబంధించి తన ఆలోచనలను తెలంగాణేతర తెలుగు ప్రాంతాలకూ వర్తింపచేసాడు. కాళోజీ పాదులువేసిన భాషా ప్రజాస్వామికత తెలుగు ప్రాంతాల్లోని తెలుగు వైవిధ్యాల మధ్య ఏకత్వాన్ని సాధించటానికే కానీ, వైరుధ్యాన్ని పెంచిపోషించటానికి ఎంతమాత్రమూ కాదు. "రెండున్నర జిల్లాలదే దండి బాస అని, తక్కినోళ్ళ యాస తొక్కిపెట్టారన్నాడు. ఆనాడు చలామణిలో ఉన్న భాష కొన్ని చదువుకున్న కుటుంబాలవాండ్ల భాషేనని కాళోజీ నిశ్చితాభిప్రాయం. అసలయితే, ఈ రెండున్నర జిల్లాలు గాక మిగిలిన జిల్లాలన్నిట్ల గూడ, రాయలసీమలో కూడా తమ తమ ప్రాంత యాస, బాస విషయంల అలజడిగావాలె. "అని మనస్ఫూర్తిగా ఆకాంక్షించాడు. రచయితల్లో ఉత్సాహాన్ని నింపాడు. వ్యావహారిక భాషోద్యమంలో గిడుగు చేసిన కృషికి కొనసాగింపుగా తెలంగాణలో కాళోజీ కనిపిస్తాడు. గిడుగు ఆలోచనల్ని అప్పటి శిష్టవ్యావహారికం దగ్గరే పత్రికలు పరిమితంచేసాయి. కాళోజీ ఆలోచనలు మరింత వాడుక భాషలోకి ప్రవహించాయి. కాళోజీ ఇచ్చిన భాషా ప్రజాస్వామిక స్ఫూర్తిని అందుకున్న తెలంగాణ రచయితలు, కవులు తెలంగాణ భాషలోనే ఎక్కువగా రాయడానికి ప్రయత్నంచేసారు. కొన్ని రచనలు నిలిచాయి. కొన్ని రచనలు కృతక తెలంగాణ ప్రయోగాలుగా కాలగర్భంలో కలిసిపోయాయి. అన్ని ప్రాంతాల తెలుగు రచయితలకు తెలుగు భాష విషయంలో సమాన దృక్పథాన్ని కలిగించిన కాళోజీ నిజమైన భాషా ప్రజాస్వామిక వాది. "అసలు రాసేటోడు తెలుగోడయి చదివేటోడు కూడ తెలుగోడయితె 'సహృదయత' ఉంటే తెలుగు అర్థమయితది. నాకు అర్థంకాలేదంటె నువ్వు తెలుగోనివి కాదన్నమాట. లేకపోతే నీకు 'సహృదయత' లేదన్న మాట" అన్న కాళోజీ మాటలు ప్రాసంగికాలు.

★ రచయిత: తెలుగు అధ్యాపకులు, నిజాం కళాశాల

# అడగవలసిన ప్రశ్న

స్నేహలత ఎం.

కదంచించుకుపోతున్న సమాజాలు వికసించాలంటే ప్రశ్ననే ఆలంబనగా ఉండాలి. పరిమాణాత్మక మార్పు గుణాత్మకతను సంతరించుకోవాలంటే ఆయా సమాజాల పెనుగులాటలోని వైరుధ్యమే ఆయువుగా ఉంటుంది. మునుపటి సమాజంలోని ఉత్పత్తి సంబంధాలు భరించరానివిగా మారినప్పుడు జనసందోహంలో నుంచి కొత్త సమాజం పురుడోసుకుంటుంది. ఈ సామాజిక చలనాలన్నింటికి ప్రశ్న చోదకశక్తిగా పనిచేస్తుంది. బానిస, ఫ్యూడల్ సమాజాలలో కూడా ఏలిక మీద ప్రజా సమూహం తమ అసమ్మతిని ప్రకటించింది. యూరప్ దేశాలలో పారిశ్రామిక విప్లవం తనకు కావలసిన శక్తిని పూర్వపు సమాజాల నుంచి పొందింది. అయితే కొత్తగా ఉనికిలోకి వచ్చిన ఉత్పత్తి సంబంధాలను వ్యాఖ్యానించి, నియంత్రించాలంటే అప్పటికి పెట్టుబడిదారి వర్గం ప్రోది చేసుకున్న జ్ఞానం సరిపోలేదు. కనుక సమాజం మూలాల్లో ఉన్న ఆలోచనలకు పదునుపెట్టింది. ఉత్పత్తి శక్తుల జీవితాలలో, ఆచరణలో కొనసాగుతుండిన ఆలోచనల ప్రవంతికి హేతుబద్ధ చర్చను తోడుచేసింది. ప్రాకృతిక జ్ఞానాన్ని సమ్మతించి విస్తృత పరిశోధనలకు పెట్టుబడిదారివర్గం బాటలువేసింది. ఫలితంగా ప్రకృతి, సామాజిక శాస్త్రాల పురోగతిని ఈ కాలంలో మనం గమనించగలుగుతున్నాం. సమాజం నలుమూలల్లో చెల్లాచెదురుగా ఉన్న జ్ఞానానికి ఉమ్మడి ఆవరణం



అవసరమొచ్చింది. ఈ ప్రశ్న నుంచే యూరప్ దేశాలలో ఆధునిక విశ్వవిద్యాలయాలు జీవం పోసుకున్నాయి.

ప్రశ్న వేసుకోవడం, సమస్యను గుర్తించడం, పరికరాలను రూపొందించుకొని పరిశోధించడమనే సంవిధానం నుంచి అభిలషణీయమైన ఫలితాలు వచ్చాయి. ఇట్లా విశ్వవిద్యాలయాలు అధ్యయనం, అధ్యాపనం, పరిశోధన అనే అంశాల మీద ప్రయాణించి పురోగమించాయి. జ్ఞానాన్ని సమాజం ఎల్లెడల వ్యాపించే కృషిలో విశ్వవిద్యాలయాలు భాగస్వామ్యం తీసుకున్నాయి. సమాజంలో ఉన్న ప్రశ్నలకు, ఆలోచనలకు విశ్వవిద్యాలయాలు కేంద్రంగా ఉన్నాయి. మనదేశంలోని నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాలు కూడా ఆనాటి కులీన వర్గం ఆలోచనలకు ప్రతిబింబాలుగా ఉండేవి. ఇండియాలోకి బ్రిటిష్‌వాళ్లు పెట్టుబడితో పాటు ప్రవేశించారు. అప్పటికే ఇక్కడ ఘనీభవించిన భూస్వామ్యం అనేక అనుమానాలతో ఈస్టిండియా కంపెనీని ఆహ్వానించింది. తర్వాతి కాలంలో నిదానంగా బ్రిటిష్ పెట్టుబడితో ఇక్కడి భూస్వామ్యం స్నేహం చేసింది. అయితే బ్రిటిష్ పెట్టుబడి వర్గానికి ఇండియాలో నైపుణ్యం కలిగిన కార్మికవర్గం కొరత ఏర్పడింది. ఆ నైపుణ్యాలను అందించే పాఠ్యాంశాలు మన సంప్రదాయ విద్యలో లేకపోవడం వలన, పాఠ్యప్రణాళికలో, బోధనలో రావలసిన మార్పుల గురించి నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఆలోచించింది. ఫలితంగా ఆంగ్ల విద్యకు ఇండియాలో పునాదులు పడ్డాయి. ఆంగ్ల విద్యను అభ్యసించిన మొదటితరం ఆలోచనా స్రవంతిలో పెనుమార్పులు సంభవించాయి. తర్వాతి తరానికి మేధోపరమైన విద్యను గరపాలనే భావన పుట్టింది. ఇది గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాస్ నగరాలలో మొదటిసారి విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేసింది. ఆధునిక విశ్వవిద్యాలయాల చరిత్ర ఇండియాలో ఇలా మొదలయింది.

దేశం నలుమూలల నుంచి వచ్చిన భూస్వాముల పిల్లలు తమ ఆలోచనలను, ప్రశ్నలను కలబోసుకోవడానికి విశ్వవిద్యాలయాలు వేదికలయ్యాయి. ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి మాత్రమే కాకుండా కొందరిలో స్పష్టమైన ప్రాపంచిక దృక్పథం కూడా ఇక్కడే రూపొందింది. అధ్యయన సంస్కారం వలన ముసిరిన అనేక ప్రశ్నలకు సమాధానాలు వెతికే క్రమంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదంలోని విస్తరణవాదాన్ని అర్థం చేసుకోగల్గినారు. ఈ క్రమంలో ప్రశ్న నుంచి జనించిన అసమ్మతి మంద్రస్థాయిలోనైనా పోరాట రూపంగా మారింది. జాతీయోద్యమ భావాలు విస్తరించడానికి విశ్వవిద్యాలయాలు మూలమయ్యాయి. ఆధునిక విశ్వవిద్యాలయాలు సామాజిక చలనంలో ప్రధాన భూమికను పోషించాయి. సైద్ధాంతిక చర్చలకు, రాజకీయ ఆచరణకు, బరువైన సామాజిక కట్టుబాట్ల వ్యతిరేకతకు విశ్వవిద్యాలయాలు రంగాన్ని తయారుచేసాయి. ప్రజాస్వామిక భావాలు విస్తృతం కావడానికి దోహదం చేసాయి.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం(1916), ఉస్మానియా విశ్వవిద్యాలయం(1917) అనేక ప్రశ్నలను విద్యార్థులలో ప్రోదిచేసాయి. వందేమాతర ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, నిజాం వ్యతిరేక పోరాటాలకు విశ్వవిద్యాలయాలు వేదికలయ్యాయి. నేరుగా పాలకవర్గాల మీద అనేక ప్రశ్నలను ఉంచడం, రాజకీయ ఆచరణను కల్గి ఉండటం నాటి అధ్యయనంలో భాగంగా ఉండేవి. సోషలిస్టు విప్లవాల ప్రభావంతో కొత్త కలల ప్రపంచాన్ని ఆవాహనం చేసుకోవడానికి

కావలసిన దృష్టిని విశ్వవిద్యాలయాలు ఇచ్చాయి. సమాజంలో మౌలిక మార్పు కోసం జరుగుతున్న పెనుగులాటకు కావలసిన నాయకత్వాన్ని అందించటం విశ్వవిద్యాలయాలు బాధ్యతగా స్వీకరించాయి. నక్సల్బరీ వసంత మేఘ గర్జన కాలంలో తడిసిన యువత మరో ప్రపంచపు తెల్ల రేకై పల్లవించారు. ఇదే కాలంలో జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమాలు రూపొందడానికి విశ్వవిద్యాలయాలు పోషించిన పాత్ర చరిత్రలో అపురూపంగా నమోదయింది. ఈ ఉద్యమాలు రూపొందించిన వ్యక్తులు ఇవాల్టి రాజకీయ యవనిక మీద విశేష ప్రభావాన్ని కల్గి ఉన్నారు. ఎమర్జెన్సీ వ్యతిరేక ఆందోళనలలో విశ్వవిద్యాలయాలు తోటి మనిషి విముక్తి కోసం ప్రాణత్యాగం చేసే సంప్రదాయాన్ని నెలకొల్పాయి. అమరత్వం రమణీయమయినదనే భావుకతను యువతలో ప్రోదిచేసాయి. మొన్నటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం పోషించిన పాత్రను ప్రపంచమంతా శ్లాఘించింది.

కొత్త స్రవంతిలోకి ప్రయాణించే సమాజాలకు కావలసిన పరిపక్వతను, చైతన్య వ్యక్తీకరణలను విశ్వవిద్యాలయాలు సమకూర్చటం ఒక సంప్రదాయంగా వస్తుంది. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిన నవభారతావనికి ఎదురైన సవాళ్లను అధిగమించడంలో విశ్వవిద్యాలయాలు చేసిన మేధోకృషి ఎంతో ఉంది. మనదేశంలో బాల్యావస్థలో ఉన్న ప్రజాస్వామ్య భావాలను పరిపక్వం చేయడంలో ఈ జ్ఞాన కేంద్రాలే ప్రముఖపాత్రను వహించాయి. తొమ్మిదిన్నర ఏళ్ల కింద ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం సామాజిక, రాజకీయార్థిక స్థాయిని ఇక్కడి ఉన్నత విద్యారంగం ప్రతిబింబిస్తుంది. మునుపటి పాలకులను అనేక శాపనార్థాలు పెట్టిన ఏలిక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విశ్వవిద్యాలయాలను విస్మరించింది. తెలంగాణ సమాజపు రాజకీయార్థిక సమస్యలకు పరిష్కారం వెతకవలసిన ఉన్నత విద్యాసంస్థలు పతనావస్థకు చేరుకున్నాయి. ఉజ్జ్వల గతాన్ని కీర్తిస్తూ అంపశయ్య మీద కొనప్రాణంతో మినుకు మినుకుమంటున్నాయి. కొత్త రాష్ట్రంలో సరికొత్త సంవిధానంతో సంవాదంలో ఉండవలసిన మేధోరంగాలు కురుచగా మారిపోతున్నాయి. ఒక సమాజపు సంస్కారాన్ని అంచనా వేయాలంటే అక్కడి విద్యారంగ స్థాయిని ప్రధాన ఆకరంగా తీసుకుంటారు. తెలంగాణ సమాజపు విలువకు క్షీణిస్తున్న విద్యావ్యవస్థయే ప్రతిబింబం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి ఉస్మానియా, కాకతీయ, తెలుగు, తెలంగాణ, శాతవాహన, మహాత్మగాంధి, పాలమూరు విశ్వవిద్యాలయాలు ఏర్పడి ఉన్నాయి. ఇవి కాకుండా వ్యవసాయ, జేఎన్‌టియు, ఫైన్‌ఆర్ట్స్, ఆర్‌జికెటియూ వృత్తి విద్యను నేర్పించే విశ్వవిద్యాలయాలు కూడా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాత వాటికి పేర్లు మార్చటం మినహాయించి కొత్తగా చేసింది చెప్పుకోవడానికి ఏమీ లేదు. అదనంగా హెల్త్, అటవీ యూనివర్సిటీలను, ఉస్మానియా పరిధిలో ఉన్న కోఠి మహిళ కళాశాలను పేరు మార్చి ఏడాది కిందట తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేసారు. తెలంగాణ సమాజం ఎదుర్కొనే సవాళ్లకు తగిన పరిష్కారాలను పరిశోధించి చెప్పవలసిన విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలను ప్రదానం చేసే పాత్రకే పరిమితమయ్యాయి. నాణ్యమైన బోధన, పరిశోధన గాలిలో దీపంలా ఉంది. పరిశోధనలో అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పిన ఉస్మానియా విశ్వవిద్యాలయం వరల్డ్ ర్యాంకింగ్‌లో పతనావస్థకు చేరుకున్నది. భౌతిక శాస్త్రంలో సూరిభగవంతం, అర్థశాస్త్రంలో సిహెచ్ హనుమంతరావు,

సాహిత్యంలో సి.నారాయణరెడ్డిని అందించిన ఓయూ సంక్షోభంలోకి నెట్టబడింది. ప్రపంచీకరణ ఆర్థిక నమూనాలో తన ప్రాభవాన్ని కోల్పోయిన మొదటి సంస్థ ఉస్మానియా విశ్వవిద్యాలయమే. తొంభయో దశకం తర్వాత ప్రభుత్వాల ప్రధాన్యతలు మారిపోయాయి. విద్యారంగం మీద చేసే ఖర్చును భారంగా భావించే నాయకులు పాలకులుగా ఎదిగారు. ప్రభుత్వ విద్యారంగానికి సమాంతరంగా ప్రైవేట్ విద్యా మాఫియాను పాలకులే ప్రోత్సహిస్తూ వచ్చారు. ఇదంతా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటి పూర్వపుస్థితి. చదువుల తల్లిని సంతలో పెట్టిన ప్రభుత్వ విధానాల మీద ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో నాటి నాయకత్వం గంభీరమైన విమర్శను ఎక్కుపెట్టింది. కానీ రాష్ట్రం సిద్ధించాక విధాన నిర్ణయాలలో జరిగిన మార్పేమి లేదు.

తెలంగాణ సమాజంలో వేల సంవత్సరాలుగా గుడి, బడి విస్మరించిన సామాజిక సమూహాల నుంచి ఇప్పుడిప్పుడే విశ్వవిద్యాలయాల మెట్లు ఎక్కుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలు. కానీ ఈ వర్గాలను ఓటు బ్యాంకుగా భావించే పాలకులు వారికి నాణ్యమైన విద్యను అందించాలని భావించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలోని భూమిపుత్రులకు సరైన జ్ఞానాన్ని అందిస్తే వాళ్లు సృష్టించే అద్భుతాల ముందు ఈ ప్రపంచం కురుచగా మారిపోతుంది. కానీ వారికి జ్ఞానబోధ చేయడానికి విశ్వవిద్యాలయాలలో గురువులే లేరు. తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలలో ఇప్పటికే 2,152 ఆచార్యుల పోస్టుల ఖాళీలు ఉన్నాయి. ఓయులో 1268 ఆచార్యుల పోస్టులు ఉండవలసినచోట కేవలం 350 మంది మాత్రమే పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని చాలా విశ్వవిద్యాలయాల్లోనూ రెండంకెలకు మించి ఆచార్యులు లేరంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. 2018లోనే తెలంగాణ ప్రభుత్వం 1,061 ఆచార్యుల పోస్టులను మంజూరు చేసింది. కానీ ఐదేళ్లు గడిచినా అవి భర్తీకి నోచుకోలేదు. రాజకీయ ఉద్దేశ్యాలతో గవర్నర్ కార్యాలయంలో ఖాళీల ఫైలు ఏకాంత తపస్సు చేస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం కోరుకున్నది, గవర్నర్ కార్యాలయం చేసింది ఒకటే కావడం ఈ కాలపు మేధో విషాదం. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలకు విదలించే నిధులు జీతభత్యాలకు కూడా సరిపోని దుస్థితి ఉంది.

నిధుల, నియామకాల కొరత కొత్త ప్రభుత్వం ముందు సవాలుగా ఉంది. విద్యారంగం మీద చేసే ఖర్చు ప్రభుత్వానికి తక్షణంగా ఏ రకంగానూ లాభించదని గత ప్రభుత్వాలు భావించాయి. కనుక వారికది ప్రాధాన్యత లేని అంశంగా మారిపోయింది. నాణ్యమైన విద్య అనే డిమాండ్ ప్రజాక్షేత్రంలో లేకపోవడం వలన ఓట్లను ప్రభావితం చేసే అంశంగా కూడా కాలేకపోయింది. ఫలితంగా గత పాలకులు విద్యను విస్మరించారు. తెలంగాణ రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడానికి యూనివర్సిటీ విద్యార్థులు పోషించిన పాత్ర తక్కువేమీ కాదని నేటి ముఖ్యమంత్రికి తెలుసు. తెలంగాణ సమాజంలో సర్వతోముఖాభివృద్ధి జరిగి ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే విశ్వవిద్యాలయాల పునాదులను ప్రభుత్వం పటిష్టం చేయాలి. తక్షణంగా ఓయూకు వెయ్యి కోట్లు, ఇతర విశ్వవిద్యాలయాలకు మరో 500 కోట్ల నిధులను కేటాయించాలి. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉపకారవేతనం మూడు వేలకు పెంచాలి. అధ్యాపకుల ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రారంభించి మేధో సంపన్నులైన ఆచార్యులను ఎంపిక చేయాలి. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రతిభకే ప్రాధాన్యత ఇవ్వాలి. విశ్వవిద్యాలయాలలో విలువల రాహిత్యానికి, అరాచకత్వానికి తావు లేకుండా పరిపాలనా యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలి.

✶ రచయిత: అడ్వకేట్, హైకోర్టు

# ఈ తరానికి మహనీయుల చిరునామా

ప్రొ॥ చింతకింది కాశీం

అంటరానితల్లి అంట్లు తోముతుంది. బతుకు చితికి, కన్నీరు కతికి బతుకు దెరువు కోసం బండెడు చాకిరి ఆ తల్లి దైనందిన జీవితం. బిడ్డలకు ఇంత కూడు పెట్టడానికి తల్లి యాతన పడుతుంది. సూర్యుని వెంట పరుగెత్తే జీవితం. మగ పెత్తనం, కుల పెత్తనం రెండు హింసలను ఒకే జీవితం పొడుగునా అనుభవించింది. ఈ తల్లి ఎంగిలి గిన్నెలు కడుగుతుంది, కోమటోళ్ల తల్లి తన బిడ్డల తలను నిమురుతూ నూనె పెట్టి నున్నగా దువ్వుతుంది. పలక, బలపం చేతికిచ్చి బుగ్గ మీద ముద్దుపెట్టి బడికి పంపుతుంది. అప్పుడు ఆలోచించింది ఈ పేద తల్లి–గోసంగి తల్లి. 'నా బిడ్డలెందుకు అక్షరానికి దూరంగా ఉన్నారని...!?' తన బిడ్డల నాలుక మీద నాలుగు అక్షరాలు రాయాలనుకుంది. ఆలోచిస్తూ ఇంటికి చేరింది. రాత్రంతా మధనపడింది. మూసుకుంటున్న కనురెప్పలకు ఆవేదన అడ్డుపడింది. ఎలాగైనా సరే బిడ్డలను బడికి పంపాలనుకుంది.

అదిగో ఆనాడు ఆ అంటరాని పేద గోసంగి తల్లి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయం వలన గోసంగి కులంలో అక్షరాలు మొలిచాయి. అవి ఇవ్వాళ తెలుగు నేలంతా విస్తరించాయి. ఆ తల్లి బిడ్డడే ఈ రచయిత, గనిసెట్టి రాములు. ఆయనకే అద్భుతమైన జీవిత నేపథ్యముంది. జీవిత చరిత్ర ఉంది. కాని తన ముందరి తరాల జీవితాలను మనకు పరిచయం చేయటానికి మహనీయులను గుర్తు చేసుకుంటూ అక్షరబద్ధం చేస్తున్నాడు. ఆ తరం చిరునామాను ఈ తరానికి అందిస్తున్నాడు. ఆయన పుట్టుకతో రచయిత కాదు. తన కులం చరిత్రను ఈ సమాజానికి అందించటం కోసం కలం పట్టాడు. ఎవరి చరిత్రను వాళ్లే రాసుకోవాలనే తాత్విక భావధారలో ప్రయాణిస్తున్నాడు. History form the below అనే సూత్రానికి రాములు దాఖలా. కులం ధృవీకరణ పత్రం కోసం పెనుగులాట, బడిలో కులవివక్ష, తరగతి గదిలో చిట్ట చివరన కూర్చోవటం, మాదిగలను యాచిస్తూ బుర్రకథలు చెప్పటం ఇలా అడుగడుగునా ఆయన జీవితం నిండా కన్నీటి చారికలే ఉన్నాయి. అవమానాల ముడతలే కనిపించాయి.

ఆ కసితో చదివాడు. అక్షరానికున్న శక్తిని పట్టుకున్నాడు. ఓపికగా అక్షరాన్ని ప్రయోగించటం మొదలుపెట్టాడు. గోసంగి కులంలో మొదటి రచయితగా రూపొందాడు. అపారమైన జీవితమున్న రాములు 'చీకటి బతుకుల్లో గోసంగీలు', 'గోసంగీలు ఎవరు?' అనే రెండు పుస్తకాలను రాసి ఈ సమాజం ముందుపెట్టాడు. ఇప్పుడు బ్రాహ్మణిజానికి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన మహనీయులను మన ముందుకు తెస్తున్నాడు. రాములు జీవితం నుంచి ఎదిగిన రచయిత. సారవంతమైన జీవితమున్న రచయిత. అయితే రాములు అందరి లాంటి సాదాసీదా రచయిత కాదు. ఆయనకు స్పష్టమైన దృక్పథం ఉంది. అందుకే భారతదేశంలో కులవ్యవస్థకు, పీడనకు వ్యతిరేకంగా పోరాడిన, ప్రపంచ వ్యాపితంగా శ్రామికవర్గ పక్షపాతం వహించిన నాయకుల గురించి తెలుగు సమాజానికి అందిస్తున్నాడు.

రాములు మన ముందుకు తెస్తున్న ఈ పుస్తకం జీవిత చరిత్రలు కాదు. ఆయా వ్యక్తుల మీద రాసిన వ్యాసాలు మాత్రమే. వారి జీవిత రేఖలను స్థూలంగా తడిమాడు. అయితే ప్రక్రియ రీత్యా చూస్తే ఈ వ్యాసాలన్నీ జీవిత చరిత్ర విభాగంలోకి వస్తాయి. సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత, నైతిక, సాంస్కృతిక మానవ జీవిత సంబంధాలన్ని ఈ ప్రక్రియ ద్వారా అద్భుతంగా పాఠకులకు అందుతాయి. చరిత్రలో మహాత్ములైన వాళ్లు, చిరంజీవిగా నిలిచే శక్తిని ప్రజలలో వ్యాపించినవాళ్లు, బుద్ధికారణంగా ప్రసిద్ధులైనవాళ్లు స్మరణీయులవుతారు. వారి జీవితం సమాజ పురోగమనానికి మూలమవుతుంది. కొందరు వ్యక్తుల జీవితం తెలుసుకోవటం వలన సమాజ గమనం తెలుస్తుంది. జీవిత చరిత్రలో ఒక పార్శ్వాన్ని తెల్పటం జీవితచరిత్ర వ్యాసాల ఉద్దేశ్యంగా ఉంటుంది. జీవిత చరిత్ర

రచనకు సంబంధించిన ప్రణాళిక చాలా విస్తృతమైనది. కాని జీవిత చరిత్ర వ్యాసం ఒక ప్రత్యేకాంశానికి పరిమితమై ఉంటుంది. ఈ కోణాన్నే రాములు తన వ్యాసాలలో తడిమాడు. వ్యక్తుల జీవితంలోని ప్రసిద్ధమైన, లోకోపకారమైన అంశాన్ని రాములు వివరించిన తీరు అభినందనీయం.

ఈ నేపథ్యంలో రాములు రాసిన మహనీయులు వ్యాసాలను మనం అధ్యయనం చేసి పరిశీలించవచ్చు. ఈ పుస్తకంలో పద్నాలుగు వ్యాసాలున్నాయి. గాడ్గెబాబా, బోయ జంగయ్య, గూడ అంజయ్య, మహాశ్వేతాదేవి, అంబేద్కర్, జాషువా, కాస్ట్రో, ఇరోమ్ షర్మిలా, బొజ్జతారకం, బాహుసాతె, నాయ్‌దేవ్ దాసాల్, జె.బి.రాజుల మీద తనదైన కోణంలో రాములు విశ్లేషణను ఈ జీవిత చరిత్ర వ్యాసాలలో మనం చూడవచ్చు. గత ఐదేళ్లుగా స్వచ్ఛ భారత్ గురించి పాలకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. చీపురు పట్టి రెండు నిమిషాలు ఫోటోకు ఫోజిచ్చి ప్రచారం పొందుతున్నారు. కాని వేల సంవత్సరాలుగా చచ్చిన పశువులను తొలగించి, మల మూత్రాలను చేతులతో ఎత్తేసి, రోడ్లను ఊడ్చి గ్రామాలను శుభ్రం చేసిన దళితులను ఇప్పటికీ అంటరానివారిగా ఊరికి దూరంగా ఉంచుతున్నారు. 1890వ దశకంలోనే స్వచ్ఛ భారత్ గురించి మాట్లాడిన, ఆచరించిన గాడ్గేబాబా గురించి రాములు రాసాడు. మహారాష్ట్రలో రజక కులంలో పుట్టిన గాడ్గే గ్రామాలకు వెళ్లి చీపురుతో శుభ్రపరిచి ప్రజలను చైతన్యపర్చాడు. కింది కులాలలో చదువు పట్ల అవగాహన కల్పించడానికి ఎంతో కృషి చేసాడు. మదన్‌మోహన్ మాలవ్య ఆహ్వానం మేరకు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి వెళ్లిన గాడ్గే

> ***"విశ్వేశ్వరుని, విశాలాక్షిని చూసినంత మాత్రాన కాశియాత్ర పరిసమాప్తి కాదని, యూనివర్సిటీని చూస్తే తప్ప ఆ యాత్రకు సార్థకత ఉండదని చెప్పేవాడు".***

విషాదమేమిటంటే మదన్‌మోహన్ మాలవ్యకు భారతరత్న ఇచ్చారు. గాడ్గేను విస్మరించారు. ఇది కేవలం కులం కారణంగానే జరిగిందని అనటం అతిశయోక్తి కాదు.

నామ్‌దేవ్ దాసాల్ గురించి సాహిత్య ప్రపంచంతో సంబంధం ఉన్నవారికి తెలిసే ఉంటుంది. అయినా రాములు ప్రయత్నం మాత్రం ఈ తరానికి ఆయనను కొత్తగా పరిచయం చేయటం. దేశంలో దళిత పాంథర్స్ ఉద్యమానికి జీవం పోసిన నామ్‌దేవ్ చరిత్రలో చిరస్మరణీయుడు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని సాహిత్యానికి అన్వయించి రచనలు చేసాడు. సాహిత్య ఉద్యమానికి తాత్విక భూమికను ఇచ్చాడు. అమెరికన్ బ్లాక్ పాంథర్స్ ఉద్యమాన్ని అధ్యయనం చేసి దానిని ఇక్కడి నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించిన తీరును రాములు తన వ్యాసంలో ప్రస్తావించాడు. నిజానికి నామ్‌దేవ్ మార్క్సిజాన్ని కూడా అధ్యయనం చేసాడు. దళితుల విముక్తికి అంబేద్కరిజం -మార్క్సిజం రెండూ అవసరమని భావించాడు.

> ***"నా ముందు జీవితపు దారులు రెండు ఉన్నవి. ఒక దారిలో ఆకలి, పరాధీనత, రాజీపడటం, తనను తాను అమ్ముకోవటం మరోదారి తిరుగుబాటు, రాజ్యాధికారం, ప్రపంచాన్నే మార్చటం, తనను తాను మార్చుకోవటం"***

అంటూ నామ్‌దేవ్ ప్రకటించిన తీరును రాములు వివరంగా తన వ్యాసంలో చెప్పాడు. 'శాంతి తన పాదాలపై నిలబడి తనకు తాను విముక్తి చేసుకుంటుందని' నామ్‌దేవ్ ప్రకటించాడు.

రాములు రాసిన మరో మంచి వ్యాసం అన్నాబాహు సాఠే గురించినది. మహారాష్ట్రలో మాంగ్(మాదిగ) కులంలో జన్మించిన సాఠే తన జీవితంలో అంటరానితనం, పీడన అనుభవించాడు. అన్యాయాన్ని సహించలేని స్వభావం ఉండటం వలన తన పట్ల కులవివక్షను పాటించిన ఉపాధ్యాయుడ్ని రాయితో కొట్టి పారిపోయాడు. చిన్నతనంలోనే అతనిలో తిరుగుబాటుతత్వం ఉంది. రాత్రి సమయాలలో అక్షరాలు నేర్చుకొని 23 నవలలు, 150 కథలు, 11 నాటకాలు రాసాడు. ఒక రకంగా సాఠే జీవితం రాములు జీవితం సారూప్యంగా ఉంటుంది. తొంభై శాతం దళితుల జీవితాలు కూడా ఇలాగే ఉంటాయి.

రాములు రాసిన మరో చారిత్రాత్మకమైన వ్యాసం గురించి తప్పక మాట్లాడుకోవాలి. అది ఇవాల్టికి రిలవెంట్‌గా ఉంది. డా॥అంబేద్కర్ గురించి రాస్తూ ఆయన రిజర్వేషన్ల కోసం చేసిన రాజీలేని పోరాటాన్ని వివరించాడు. 1928లోనే రెసిడెన్షియల్ స్కూల్ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనను అంబేద్కర్ ముందుకు తీసుకొచ్చాడు. 1927లో బొంబాయి ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా నామినేట్ అయ్యాక అంటరాని కులాల పిల్లలకు విద్య అందాలంటే వారికి ప్రత్యేక పద్ధతిలో విద్యాబోధన జరగాలని సైమన్ కమీషన్‌కు ఇచ్చిన నివేదికలో కూడా అంబేద్కర్ చెప్పాడు. రాములు మరిన్ని వివరాలను రాస్తూ, సౌత్‌బరో కమిటీ ముందు అంబేద్కర్ రిజర్వేషన్ల కోసం చేసిన వాదనను ప్రస్థావించాడు. విద్యావంతులకు, పన్నులు కట్టేవారికి, జమీందార్లకు, భూస్వాములకు మాత్రమే ఓటు హక్కు ఉన్న సందర్భంలో దళితుల పాత్ర శూన్యంగా ఉందని, కనుక అందరికీ ఓటు హక్కు కావాలని అడిగాడు. రౌండ్ టేబుల్ సమావేశాలలో దళితులకు రెండు ఓట్లు ఉండాలని, తమ ప్రతినిధులను తామే ఎన్నుకొనే వెసులుబాటు కావాలని కోరాడు. కమ్యూనల్ అవార్డు దీనికోసం ప్రటించటం, గాంధీ నిరాహారదీక్ష, పూనా ఒడంబడిక మొదలైన వివరాలను ఈ వ్యాసంలో చూడవచ్చు. రాములు చాలా తార్కికంగా, సాధికారికంగా ఈ వ్యాసాన్ని రాసాడు.

మహద్ చెరువు పోరాటానికి అంబేద్కర్ రాజకీయ కార్యాచరణలో భాగంగా నడిపాడు. 1926లో బొంబాయి లెజిస్లేటివ్ ఒక తీర్మానం చేస్తూ మహద్ చెరువులో అస్పృశ్యులు నీళ్లు తాగవచ్చునని చెప్పింది. దీనిని ఆ మున్సిపాలిటీలోని అగ్రకులాలు వ్యతిరేకించాయి. అప్పుడు అస్పృశ్యుల హక్కుల కోసం అంబేద్కర్ పోరాటానికి పూనుకున్నాడు. అయితే ఈ వ్యాసంలో రాములు ఒక ప్రత్యేక పరిశీలన చేసాడు, సంఘ సంస్కరణ గురించి మాట్లాడే, అంటరానితనం గురించి రాసే అగ్రకుల జాతీయ నాయకులైన గాంధీ, నెహ్రూ, పటేల్, మదన్‌మోహన్ మాలవ్య మొదలైనవాళ్లు ఈ వివక్ష గురించి మాట్లాడలేదు. అందరూ అస్పృశ్యుల హక్కుల పట్ల మౌనం వహించారని ఈ రచయిత ప్రశ్నించాడు.

రాములు అంటరానికులాలలో మరింత అంటరానికులం (గోసంగి)లో పుట్టి ఎం.కాం వరకు చదివి కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసులో ఉద్యోగం సాధించి, డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా పదవీ విరమణ పొందారు. ఇదంతా అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలాల వలన సాధ్యపడింది. ఆయన తన జ్ఞానాన్ని తన వరకే పరిమితం చేయకుండా తన కులానికి, సమాజానికి అందించాలని నిర్ణయించుకున్నాడు. గోసంగి కులం కోసం కలం పట్టి విస్తరించాడు. అవసరం కొద్ది రచయితగా మారిన రాములు ఇవ్వాళ అలవాటుగా రాస్తున్నాడు. దళితుల విముక్తిలోనే గోసంగీల విముక్తి ఉందని ఆయన నమ్మాడు. అదేవిధంగా ప్రజలందరి విముక్తిలోనే దళితుల విముక్తి ఉందనే తాత్వికత కూడా ఆయనకు ఉంది. దాని పట్ల విశ్వాసాన్ని కూడా ప్రకటించాడు. అవమానాల పెనుమంటలో నేర్చుకున్న అక్షరాలను ఆయుధాలుగా ప్రయోగిస్తున్నాడు. ''ఎవరో ఒకరు అది అన్యాయమని రుజువు చేయగలిగిననాడు అన్యాయం చేసినవారు శక్తి సామర్థ్యాలను కోల్పోతారు''(తారకం) అనే మార్గంలో ప్రయాణిస్తున్న రాములు రాసిన 'మహనీయుల'లోకి మిమ్మల్ని ఆహ్వానిస్తూ...

గోసంగి కులం గురించి ఈ తరంలో చాలామందికి తెలియదు. అదొక దళిత కులం. గోసంగులు మాదిగ ఉపకులం. గ్రామాలలో ఎవరి ఇంట్లోనైనా మనిషి చనిపోతే బంధువులు రాత్రంతా నిద్రపోకుండా మేల్కొనటం కోసం కథలు చెబుతూ అద్భుతమైన మౌఖిక సాహిత్యాన్ని ఆవిష్కరించే కళాకారులు గోసంగులు. మీరెప్పుడైనా చిందు బాగోతం చూసి ఉంటే, బ్రాహ్మణ వేషధారి పాత్రతో గోసంగి పాత్ర సంవాదం వింటే పండితుల పాండిత్యం దిగదుడుపేననిపిస్తుంది. 'ఏరుల జన్మము, శూరుల జన్మము ఎరుగగానగునే' అంటారు. బ్రాహ్మణుల 'జన్మ రహస్యం' మాత్రం గోసంగి పాత్రకు ఎరుకనే. కనుక ఆ గోసంగిగా పుట్టిన రాములుకు ఈ దేశంలో ఉన్న నిచ్చెనమెట్ల కులవ్యవస్థ గురించి, దానిని సృష్టించిన మనువు గురించి, కులాన్ని ఇప్పటికీ కాపాడుతున్న బ్రాహ్మణిజం గురించిన రహస్యం బాగా తెలుసు. అందుకే దానిని తుదముట్టించే అక్షర మార్గం వేసుకుంటూ మనలందర్నీ ఆ బాటలో ప్రయాణించమని ఆహ్వానిస్తున్నాడు.

**★ రచయిత: ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఓయు**

# స్మార్ట్‌ఫోన్ ఆప్‌లలో తెలుగు భాషా సాహిత్యాలు

డా॥దానక్క ఉదయ్ భాను

ఇప్పుడు నడుస్తున్నది స్మార్ట్‌ఫోన్ యుగం. సమస్త ప్రపంచాన్ని దర్శించే అవకాశం అరచేతిలోని స్మార్ట్‌ఫోన్ అందిస్తోంది. ఇంటర్నెట్ సౌలభ్యం ఉంటేచాలు, భూగోళం మీది ఏ మూలకు సంబంధించిన ఎటువంటి సమాచారమైనా సెకన్లలో తెలుసుకోవచ్చు. దీనికి అనేకానేక పరిమితులు ఉన్నప్పటికీ, వినియోగ సామర్థ్యం, సృజనాత్మక ఆలోచనాశక్తి ఉన్నవారికి మాత్రం స్మార్ట్‌ఫోన్ ఒక విశ్వవిజ్ఞాన సర్వస్వం.

కాలం మారేకొద్ది అనేక రంగాల్లో సరళత్వం వచ్చినట్లే పుస్తకాల లభ్యతకు సంబంధించి కూడా పలు సౌకర్యాలు నేడు అందుబాటులోకి వచ్చాయి. పుస్తకాల షాపులకు వెళ్లి పుస్తకాలు కొనుక్కోవడం, లేదా లైబ్రరీకి వెళ్లి పుస్తకాలు చదువుకోవడం అన్నది గతంతో పోలిస్తే చాలామట్టుకు తగ్గిపోయింది. పుస్తకాలు అమ్ముకునేవారు కూడా పీడీఎఫ్ కాపీలను ఆన్‌లైన్‌లో అమ్ముకుంటున్నారు. మరికొందరు తమవద్ద ఉన్న పుస్తకాలను అందరికీ అందుబాటులోకి తేవాలనే సదుద్దేశంతో స్కాన్ చేసి పీడీఎఫ్ కాపీలను ఆన్‌లైన్‌లో పెడుతున్నారు. వివిధ విశ్వవిద్యాలయాలలో పలు రంగాల్లో జరిగిన పరిశోధనల గ్రంథాలు కూడా చాలామట్టుకు పీడీఎఫ్ కాపీలను స్వయంగా యూనివర్శిటీల లైబ్రరీలే అందరికీ అందుబాటులోకి తెస్తున్నాయి. కొన్ని సంస్థల వెబ్‌సైట్లు కూడా తమ ప్రచురణలను విస్తృతంగా ప్రచారం చేసుకోవడం కోసం ఆన్‌లైన్‌లో ఉంచుతున్నాయి. ఇట్లా గత పదేళ్ల కాలంలో పుస్తకాల లభ్యతకు సంబంధించిన అనేక గుణాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి.

రెండువేల ఏళ్ల తెలుగు సాహిత్యానికి సంబంధించిన అనేక మౌలిక గ్రంథాలన్నీ ఇవాళ మార్కెట్‌లో లభించడం లేదు. కొంతమంది పెద్దవాళ్ల వ్యక్తిగత గ్రంథాలయాల్లోనో, ప్రభుత్వ గ్రంథాలయాల్లోనో తప్పితే ఇవాళ తాము చదవాలనుకున్న పాత పుస్తకాల కాపీలు అందుబాటులో ఉండడం లేదు. ప్రధానంగా ప్రాచీన సాహిత్యాన్ని, ఆలంకారిక గ్రంథాలను, వ్యాకరణశాస్త్ర పుస్తకాలను, ఛందస్సు పుస్తకాలను, చరిత్ర గ్రంథాలను అధ్యయనం చేయాలనుకునేవారికి, లేదా ఆధునిక సాహిత్యాన్ని చదవాలనుకునేవారికి కూడా పుస్తకాల కొరత చాలా ఇబ్బందులకు గురిచేస్తోంది. నిఘంటువులకు సంబంధించి కూడా ఈ కొరత ఉన్నది. కానీ ఇవాళ పెరిగిన సాంకేతికత ఆ కొరతను గణనీయంగా తీరుస్తుందని చెప్పవచ్చు. వివిధ విశ్వవిద్యాలయాల తెలుగుశాఖల్లో జరిగిన ఎం.ఫిల్., పీహెచ్.డీ. పరిశోధన గ్రంథాల దగ్గరి నుండి నిఘంటువులు మొదలు అనేక విలువైన పుస్తకాల దాకా పీడీఎఫ్ కాపీల రూపంలోనో, యూనీకోడ్‌లోనో స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్స్‌లో లభిస్తున్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం ఉన్నప్పుడు వాటిని డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు, తరువాత ఇంటర్నెట్ లేకపోయినా వాడుకోవచ్చు. చాలా కొన్నింటికి మాత్రం ఇంటర్నెట్ తప్పనిసరి. ఆయా అప్లికేషన్ల తయారీదార్లు కాలం గడిచేకొద్దీ చేసిన అనేక చేర్పుల్ని అప్‌డేట్ చేసుకోమనే సంకేతం ఇచ్చినప్పుడు అప్‌డేట్ చేసుకుంటే చాలు, ఆప్ విస్తృతి గతం కంటే పెరిగిపోతుంది. అట్లా ఇప్పటికి కొన్ని లక్షల తెలుగు పుస్తకాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. కానీ చాలామందికి అవి అందుబాటులో ఉన్న సంగతే తెలియడం లేదు. స్మార్ట్‌ఫోన్‌లలో తెలుగుసాహిత్యాన్ని అందిస్తున్న అప్లికేషన్స్(ఆప్‌లు) గురించి బిబ్లియోగ్రఫికల్‌గా పరిచయం చేయడం, రేఖామాత్ర సమీక్ష ఈ వ్యాసోద్దేశం.

## పురాణం




తెలుగులో అష్టాదశ పురాణాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన అనేక పుస్తకాలు **'3500 Free Telugu Bhakti Books'** అనే ఉచిత ఆప్‌లో లభిస్తున్నాయి. ఈ అప్లికేషన్ పేరులో 'భక్తి' అనే పరిమితత్వం ఉంది గానీ, అది అందించే సాహిత్యం మాత్రం చాలా విస్తృతమైనదే. ఈ ఆప్‌ను ఒక్కసారి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు, ఆఫ్‌లైన్ లోనూ(ఇంటర్నెట్ లేనప్పటికీ) వినియోగించవచ్చు. ఇందులో శివపురాణం, గరుడ పురాణం, 26 రకాల భాగవత పురాణాలతో కూడిన అష్టాదశ పురాణాలు లభిస్తున్నాయి. కొన్నింటికి ఆడియో సౌకర్యం కూడా ఉంది. సుమారుగా

అన్నింటికి ప్రతిపదార్థ తాత్పర్యం ఉన్నది. పురాణాలకు సంబంధించి ఒక్క భాగవతానికి తప్ప మిగతావాటికి ప్రత్యేకమైన అప్లికేషన్లు లేవు. అన్నింటినీ ఈ ఆప్‌లోంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

అష్టాదశ పురాణాలే కాకుండా జానపద జీవితంలో కూడా అనేక కులపురాణాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన ఆప్‌లు ఇంకా రూపొందకపోవడం పూడ్చాల్సిన వెలితి.




**ఇతిహాసం**

మహాభారతం, రామాయణాలను ఇతిహాసాలు అంటారు. రామాయణం 25 ఆప్‌లలో, మహాభారతం 4 ఆప్‌లలో లభిస్తోంది. మొత్తం ఈ 29 ఉచిత ఆప్‌లే. ఇవన్నీ ఆఫ్‌లైన్‌లోనూ వినియోగించే వీలుంది. రామాయణ మహాభారతాలు వచనంలోనూ, పద్య సహితంగానూ లభిస్తున్నాయి. పర్వాలు, ఆశ్వాసాలు విడివిడిగా లభ్యం. అవసరమైన విభాగాన్ని చదువుకోవచ్చు. కొన్ని ఆప్‌లలో ఆడియో కూడా లభ్యం. రామయణ ప్రవచనాలు, రామాయణ కథలు, పిల్లలకోసం బొమ్మల రామాయణం ప్రత్యేకంగా లభ్యం. అయితే, ఆడియో ఆప్ చాలా నెమ్మదిగా ఉంది. ప్లే కావడానికి 1-3 నిమిషాల సమయం తీసుకుంటుంది. ఇది అంతర్జాల సమస్య కాదు. పూర్తిస్థాయి నెట్‌వర్క్ ఉన్నప్పటికీ సమస్య అట్లే ఉంది.

**కావ్యం**

తెలుగు కావ్యాల గురించిన అనేక పుస్తకాలు '**3500 Free Telugu Bhakti Books**' ఉచిత ఆప్‌లోనే లభిస్తున్నాయి. ఇందులో ఈ 21 కావ్యాలు మాత్రమే పీడీఎఫ్ రూపంలో లభిస్తున్నాయి. ఈ ఆప్‌ను ఆఫ్‌లైన్‌లోనూ వినియోగించే వీలుంది. కుమార సంభవం, బసవపురాణము, దశకుమార చరిత్ర, మార్కండేయ పురాణము, శృంగార శాకుంతలము, మనుచరిత్ర, కాళహస్తి మహాత్మ్యము, వసుచరిత్రము, విజయ విలాసము, వేంకటాచల మహాత్మ్యము, గీతగోవిందం, భామినీ విలాసము, రఘువంశము, మేఘసందేశం, స్వప్నకథ, పిరదౌసి, ముంతాజమహలు, కాందిశీకుడు, బాపూజీ, నేతాజి, గబ్బిలం.

ఇక్కడ పేర్కొన్న కావ్యాలు మాత్రమే కాకుండా తెలుగులో ఇంకా ఎన్నో ఉత్తమ కావ్యాలు ఉన్నాయి. వాటన్నింటిని కూడా




అప్లికేషన్‌లలో పొందుపర్చాల్సిన వెలితి ఉన్నది. అంతేకాదు, ఇక్కడ పేర్కొన్న కావ్యాలకు విడివిడి, ప్రత్యేకమైన ఆప్‌లు లేకపోవడం పెద్ద లోటు.

**సాహిత్య చరిత్ర**

తెలుగు సాహిత్య చరిత్రలు 4 '**3500 Free Telugu Bhakti Books**' ఉచిత ఆప్‌లో లభిస్తున్నాయి. ఈ ఆప్‌ను ఆఫ్‌లైన్‌లోనూ వినియోగించే వీలుంది. ఇందులో లభిస్తున్న నాలుగు పుస్తకాలూ పీడీఎఫ్ రూపంలో ఉన్నాయి. కందుకూరి వీరేశలింగం రాసిన ఆంధ్ర కవుల చరిత్రము, ముదిగంటి సుజాతారెడ్డి రాసిన తెలుగు సాహిత్య చరిత్ర, పింగళి లక్ష్మీకాంతం రాసిన ఆంధ్ర సాహిత్య చరిత్ర, దివాకర్ల వేంకటావధాని రాసిన ఆంధ్ర వాఙ్మయ చరిత్ర లభ్య గ్రంథాలు. తెలుగులో ఇరవైకి పైగా సాహిత్య చరిత్రలు ఉన్నాయి. వాటన్నింటిని పొందుపర్చకపోవడం ఒక పెద్దలోపం.

**సాహిత్య విమర్శ**

మను, వసు చరిత్ర-తులనాత్మక పరిశీలన, పంచకావ్యాలలో జనజీవన పరిశీలన, ప్రాచీన కావ్యాలు, గ్రామీణ జీవన చిత్రణ, ప్రాచీన తెలుగు కావ్యాల్లో తెలుగునాడు మొదలైన వివిధ రకాల 854 సాహిత్య విమర్శ గ్రంథాలు లభిస్తున్న ఉచిత ఆప్ '**3500 Free Telugu Bhakti Books**'. దీనిని ఆఫ్‌లైన్‌లోనూ వినియోగించవచ్చు. రకరకాల విమర్శ గ్రంథాలు ఒకేచోట అందివ్వడం దీని ప్రత్యేకత. తెలుగు సాహిత్య విమర్శ గ్రంథాలు లభిస్తున్న ఏకైక ఆప్ ఇది. ఆధునిక కాలంలో వచ్చిన సాహిత్య విమర్శ గ్రంథాలు, సిద్ధాంత గ్రంథాలు లేకపోవడం ఈ ఆప్‌లోని ప్రధాన లోపం.

**నిఘంటువు**

తెలుగు నుండి తెలుగుకు ప్రత్యేకంగా ఉన్న ఏకైక ఆప్ ఇది. దీనిని ఆన్‌లైన్ సౌకర్యంతో మాత్రమే వినియోగించవచ్చు. ఒక పదానికి అర్థంతో పాటుగా భాషాభాగం, వ్యుత్పత్తి, వచనం, నానార్థాలు, సంబంధిత పదాలు, వ్యతిరేక పదాలు, ప్రయోగం, అనువాదం మొదలైన వివరాలు చూపిస్తుంది.

అయితే '**3500 Free Telugu Bhakti Books**' ఒక్క ఆప్‌లోనే అమరకోశము, తెలుగు నిఘంటువు, తెలుగు

పర్యాయపద నిఘంటువు, లిటిల్ మాస్టర్స్ తెలుగు నిఘంటువు, ఆంధ్ర తమిళ కన్నడ త్రిభాషా నిఘంటువు, విద్యార్థికోశము, సంస్కృత ఆంధ్ర నిఘంటువు, విశ్వకోశము– సంస్కృతాంధ్ర నిఘంటువు, ఆంధ్రవాచస్పత్యము–ఆంధ్ర ప్రతిపదార్థ పర్యాయపద నిఘంటువు, అచ్చతెలుగు కోశము, శబ్దార్థ చంద్రిక, ఆంధ్రదీపిక, బాలల శబ్ద రత్నాకరము, శబ్దరత్నాకరము, తెలుగు వ్యుత్పత్తికోశము, ఛందఃపదకోశము, జర్నలిస్ట్ పదకోశము, ప్రాసాక్షర పదకోశము, పత్రికాభాష నిఘంటువు, సంస్కృత పదార్ణవము, సూర్యరాయాంధ్ర నిఘంటువు, లలితకళా పదకోశము, మాండలిక పదకోశము, మాండలిక వృత్తిపదకోశము–కళలు, మాండలిక వృత్తిపదకోశము –లోహకార, మాండలిక వృత్తిపదకోశము–మేదర, మాండలిక వృత్తిపదకోశము– చేనేత, వైద్యక పరిభాష, సమాన వ్యతిరేకార్థ పద నిఘంటువు, తెలుగు ఇంగ్లీష్ నిఘంటువు, ఇంగ్లీష్ – తెలుగు డిక్షనరీ, హిందీ తెలుగు కోశం, హిందీ తెలుగు డిక్షనరీ, ఆంధ్ర సంస్కృత కోశము, తర్కశాస్త్ర నిఘంటువు మొదలైన 50 నిఘంటువులు పీడీఎఫ్ రూపంలో లభిస్తున్నాయి.




## పాట

తెలుగు పాటలను అందించే ఆప్స్ 260కి పైగా ఉన్నాయి. వీటిలో పిల్లల పాటలు 21 ఆప్స్‌లో, తెలంగాణ పాటలు15 ఆప్స్‌లో, జానపద పాటలు 28 ఆప్స్‌లో, కొత్త సినిమా పాటలు 69 ఆప్స్‌లో, పాత సినిమా పాటలు 23 ఆప్స్‌లో, భక్తి పాటలు 32 ఆప్స్‌లో, దేశభక్తి పాటలు4 ఆప్స్‌లో, తెలంగాణ ఉద్యమ పాటలు 12 ఆప్స్‌లో, కథాగేయాలు 12 ఆప్స్‌లో, డిజె పాటలు 38 ఆప్స్‌లో లభిస్తున్నాయి. ఈ ఆప్‌లలో కొన్ని ఇంటర్నెట్ ఉన్నప్పుడు, మరికొన్ని లేనప్పుడు కూడా వినియోగించుకునే అవకాశం ఉన్నది. అయితే పాటల కోసం వెతుకుతుంటే చాలా వ్యాపార ప్రకటనలు రావడం ఈ ఆప్స్‌కు ఉన్న ప్రధాన లోపం. సినిమా పాటలు, భక్తి పాటలు మొదలైనవి మినహాయిస్తే జానపద పాటలకు మాత్రం సగటున 50 రూపాయలు చెల్లించి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

## కథ

జానపద కథల దగ్గరి నుండి నేటికాలపు అనువాద కథలదాకా వందల సంఖ్యలో తెలుగు కథలు ఆప్‌లలో లభిస్తున్నాయి. పక్కన ఉన్న లోగో Free stories - Read & listen - Pratilipiది. ఇది శాంపిల్ మాత్రమే. ఇటువంటి కథల ఆప్‌లు అనేకం ఉన్నాయి. నీతి కథల కోసం 89, తెలంగి కథల కోసం 2, ఋగ్వేద కథల కోసం1, అమ్మ కథల కోసం 5, జానపద కథల కోసం11, కాశిమజిలీ కథల కోసం1, చదువు కథల కోసం 1, జేజమ్మ కథల కోసం 1, శుకసప్తతి కథల కోసం 1 ఆప్‌లు ఉన్నాయి. అలాగే అనువాద కథలకు సంబంధించి చైనా జపాన్ కథల కోసం 1, టాలస్టాయి కథల కోసం 1, దేశదేశాల జానపద కథల కోసం 1, పంజాబు కథల కోసం 1, బెంగాలీ కథల కోసం 1, సింధూబాద్ – సాహస వీరగాథల కోసం 1 ఆప్‌లు ఉన్నాయి.

కథల ఆప్‌లకు సంబంధించి అనేక ప్రత్యేక ఆప్‌లు ఉన్నాయి, అలాగే ఇంతకుముందే పేర్కొన్న '3500 Free Telugu Bhakti Books'ఆప్ లో భాగంగా కూడా ఉన్నాయి. ఇంకా 'Dasubhashitam — Telugu Audio Books'లో కూడా పి.వి.నరసింహా రావు రాసిన గొల్లరామవ్వ మరికొన్ని కథలు, రావికొండలరావు రాసిన కథలు, సత్యం శంకరమంచి రాసిన అమరావతి కథలు కూడా లభిస్తున్నాయి.

ఇన్ని కథలు ఆప్‌లలో లభిస్తున్నప్పటికీ 'ఆధునిక కథలు' అని చెప్పబడుతున్న కథలకు సంబంధించిన ఆప్‌లు మాత్రం చాలా పరిమితంగా ఉన్నాయి. ఇటీవలి సాహిత్య వరణాన్ని ఏలుతున్న కథలకు సంబంధించిన ఆప్‌లు లేకపోవడం అతిపెద్ద వెలితి.

## నవల

అప్లికేషన్లలోని తెలుగు సాహిత్యంలో అత్యంత బలహీనమైన విభాగం నవలదే. కేవలం వందలోపు నవలలు మాత్రమే ఆప్‌లలో లభిస్తున్నాయి. అనంతం (శ్రీశ్రీ), రాజశేఖర చరిత్రము(కందుకూరి వీరేశలింగం), ఊడలమట్టి (ఎం.ఎస్.తెలంగి), పోరుబాట (ఎం.ఎస్.తెలంగి), భిన్నకోణాలు (ఎం.ఎస్.తెలంగి), రాత్రి

(ఉప్పలపాటి ప్రశాంత్‌వర్మ), ఇలా ఎందరున్నారు?(అంగులూరి అంజనీదేవి), గగనయానంలో అంతర్ మథనం(కలనాథభట్ల వీరభద్రశాస్త్రి), మొండి(కార్తికేయ నందివెలుగు), జీవితం కోసం ప్రేమ(శివకుమార్ నక్క), నిన్నిలా(అవనిక), నీ జతగా నేనుండాలి(మాలాకుమార్), ప్రేమ చదరంగం(కిరణ్ కుమార్), గొంగళిపురుగు(సుధీర్ కస్పా), మనసు(ఉప్పలపాటి ప్రశాంత్‌వర్మ), స్రవంతి(ఉప్పలపాటి ప్రశాంత్‌వర్మ), సాగరతరంగాలు(ఆదూరి హైమావతి) వంటి నవలలు సుకథ, ప్రతిలిపి ఆప్‌లలో లభిస్తున్నాయి.

తెలుగు నవలలు లభిస్తోన్న మరొక ఆప్ 'Dasubhashitam — Telugu Audio Books'. ఇది ఆన్‌లైన్ సౌకర్యంతో నడిచే ఆప్. ఇందులో పాకుడురాళ్లు(రావూరి భరద్వాజ), దక్షిణ కాశీ(డా॥ముక్తేవి భారతి), గణపతి(చిలకమర్తి లక్ష్మీనరసింహం), మిథునం(తనికెళ్ల భరణి), మంగయ్య అదృష్టం(పి.వి.నరసింహా రావు) ఉన్నాయి.

ఈ ఆప్‌లలో కొన్నింటిని మినహాయిస్తే, సామాజిక నవలలు కనిపించకపోవడం పెద్ద లోటు.

## సూక్తులు

మానవ జీవిత అనుభవంలోంచి రూపొందిన సూక్తులకు సంబంధించిన ఆప్స్ చాలా లభిస్తున్నాయి. ఉదాహరణకు **'Telugu Quotes(Telugu Sukthulu)'**. ఇది ఆఫ్‌లైన్‌లోనూ వినియోగించదగినది. ఇటువంటి మరికొన్ని ఉన్నాయి. తెలుగు సూక్తుల పేరుమీద ఒక ఆప్, మంచిమాటలు పేరు మీద 3 ఆప్‌లు, మహాత్ముల మంచిమాటల పేరుమీద 5 ఆప్‌లు, నిత్యజీవితానికి సంబంధించిన కోట్స్ కోసం 2 ఆప్‌లు, తెలుగు ఫేమస్ కొటేషన్స్ తెలుపుతూ 4 ఆప్‌లు, తెలుగు కొటేషన్ వాల్‌పేపర్‌లతో 10 ఆప్‌లు, వ్యక్తిత్వ వికాస సూక్తులు పేరుతో 5 ఆప్‌లు, తెలుగు సందేశాలు పేరుతో 5 ఆప్‌లు, హృదయాన్ని తాకే కోట్స్ పేరుతో 3 ఆప్‌లు, శుభాకాంక్షల కొటేషన్స్ పేరుతో 12 ఆప్‌లు, బైబిల్ సూక్తులతో 3 ఆప్‌లు, శుభోదయం, శుభరాత్రి కోట్స్ పేరుతో 6 ఆప్‌లు, ప్రేమ కొటేషన్స్ పేరుతో 15 ఆప్‌లు, వాట్సాప్, ఫేస్‌బుక్ స్టేటస్ కొటేషన్స్ పేరుతో 3 ఆప్‌లు, శ్రీసాయి కొటేషన్స్ పేరుతో ఒక ఆప్ ఉన్నాయి. దాదాపుగా ఈ ఆప్‌లలోని సూక్తులన్నీ లేఖన రూపంలో ఉండటంతోపాటు, నచ్చినవాటిని అంతర్జాల సౌకర్యం ఉన్నప్పుడు ఇతరులకు పంచుకునే వీలు కూడా ఉంది.

## సామెతలు

తెలుగు ప్రజలు నిత్యజీవితంలో వినియోగించే సామెతలను అందిస్తున్న ఆప్‌లు 16 ఉన్నాయి. ఉదాహరణకు **'Telangana Samethalu – Proverbs'**. ఇది ఆఫ్‌లైన్ ఆప్. సామెతలు విడిగా లభించడంతో పాటు పొడుపు కథలతోపాటు కలిసిన ఆప్ కూడా ఒకటి అందుబాటులో ఉంది.

## శతకం

69 తెలుగు శతకాలు ఆప్‌లలో లభిస్తున్నాయి. ఉదాహరణకు **'Telugu Satakamulu'**. ఈ ఆప్‌లన్నీ దాదాపుగా ఆఫ్‌లైన్‌లోనూ వినియోగించదగినవే. ఇక్కడ ఉదహరించిన ఆప్‌లో వేమన, సుమతీ, కుమార, భాస్కర, దాశరథీ, కృష్ణ, శ్రీకాళహస్తీశ్వర శతకాలు ఉన్నాయి. వీటిలో పద్యాలతోపాటు సవివరమైన తాత్పర్యం కలిగి ఉండడం ప్రత్యేకత. ఈ శతకాలకు ప్రత్యేకమైన ఆప్‌లు కూడా విడివిడిగా అందుబాటులో ఉన్నాయి. అలా కాకుండా ఒకే ఆప్‌లో(3500 Free Telugu Bhakti Books) 51 శతకాలు అందుబాటులో ఉన్నాయి. వాటి వివరాలు ఇవి: కాసుల పురుషోత్తమకవి– ఆంధ్ర నాయక శతకం, కలివర్తన దర్పణం – పవని వేణుగోపాల్, ధూర్జటి – శ్రీకాళహస్తీశ్వర శతకం, కుమార శతకం, మారన వెంకన్న – కుమారి శతకం, కృష్ణ శతకం, దామెర చినవెంకటరాయ – దశావతారను శతకము, రామదాసు(కంచెర్ల గోపన్న) – దాశరథి శతకం, శేషప్పకవి – నరసింహ శతకం, వేమన – వేమన శతకం, తాడేపల్లి లలితాబాలసుబ్రహ్మణ్యం – పుణ్యగాణము, ఏనుగు లక్ష్మణకవి – భర్తృహరి సుభాషితాలు, మారన – భాస్కర శతకం, కాసుల పురుషోత్తమకవి – ఆంధ్రనాయక శతకం, గోపినాథ శ్రీనివాసమూర్తి – మారుతి శతకం, దోర్భల విశ్వనాథశర్మ – మూక పంచశతి కటాక్ష శతకం, బద్దెన – నీతిసార ముక్తావళి, సుమతి శతకం, మేకా బాపన్న – అచంట రామేశ్వర శతకము, మెండా చిన సీతారామయ్య – అప్పనపల్లి బాలాజీ చతుస్సతి, బాపట్ల

హనుమంతరావు – ఆపదుద్ధారక శతకము, కోసంగి సిద్దేశ్వర ప్రసాద్ – కలుముల జవరాల శతకము, ఐతా చంద్రయ్య – గిరీశ శతకం, అడుగుల రామయాచారి – చెన్నకేశవస్వామి శతకం, చుక్కకోటి వీరభద్రమ్మ – నగజా శతకము, ఆదిభట్ట నారాయణదాసు – నారాయణదాస పంచశతి, షేక్ ఖాశీ మలీషా – పరమామృతము, రాంభట్ల చంద్రశేఖరశాస్త్రి – పార్వతీశ్వర




శతకము, పుత్ర శతకము, ఆలపాటి వెంకటప్పయ్య – బాల శతకము, సిద్దేశ్వరం కొల్లప్ప – మనసా శతకము, మావుడూరు శ్రీశైల మల్లిఖార్జునరావు – మల్లేశ్వర శతకము, రంగన్న – రఘురామ శతకము, తిరుమల రాఘవాచార్య – రాఘవ వెంకటేశ్వర శతకము, కేశవాచార్య – రాజరాజేశ్వర శతకము, అప్పలస్వామి – వంగపండు శతకము, రాఘవ శర్మ – వాసుదేవ శతకము, విశ్వనాథ మధ్యాక్కరలు, వెల్లంకి ఉమాకాంతశాస్త్రి –విశ్వశాంతి శతకము, ఉన్నవ రామకృష్ణ – వీరాంజనేయ శతకము, వేమూరి వేంకటేశ్వర – వేంకటేశ శతకం, నూతలపాటి వేంకటరత్న – వేంకటేశ్వర శతకము, పువ్వాడ శేషగిరిరావు – శతపత్రము, వంశీ – శ్రీకృష్ణ శతకము, చింతలపాటి పూర్ణ చంద్రరావు – శ్రీనివాస శతకము, అల్లమరాజు రంగశాయి – సర్వేశ్వర శతకము, సుబ్బరాయ స్మృతి శతకము, ఆకునూరు గోపాలకిషన్రావు – స్వర్ణ గోపాల శతకము, మహమ్మద్ హుస్సేన్ – హరిహరనాధ శతకము, విశ్వనాథ సత్యనారాయణ – మాస్వామి – విశ్వేశ్వర శతకము, సత్యవోలు అప్పారావు – నీతిబోధ, నరసింహకవి – కృష్ణ శతకము.

తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియ ప్రారంభమైన తొలికాలపు శతకాలకు ప్రత్యేకమైన ఆప్స్ లేవు.

## పరిశోధన వ్యాసాలు

అనేక విలువైన విశ్వవిద్యాలయ సిద్ధాంత గ్రంథాలు, పరిశోధన వ్యాసాలు కూడా '**3500 Free Telugu Bhakti Books**'లో లభిస్తున్నాయి. పరిశోధన వ్యాసాలకు సంబంధించిన ఏకైక ఆప్ ఇది. ఇతరత్రా తెలుగులో పరిశోధన వ్యాసాలకు విడిగా ప్రత్యేకమైన యాప్స్ లేవు. పైన తెలిపిన ఆప్‌లో లభించే గ్రంథాలివి: 1. తెలుగు సాహిత్యంలో భక్తితత్త్వం – కొడాలి సోమసుందరరావు 2. తెలుగులో యాత్రా చరిత్రలు – మచ్చహరిదాసు 3. శ్రీరామ కథామృతము – సమగ్ర పరిశీలన – తూమూరి దక్షిణామూర్తిశాస్త్రి, 4. ఆంధ్రమహాభారతంలో ధర్మసూక్ష్మములు – శ్రీరామచంద్రమూర్తి 5. భారతము – రాజనీతి విశేషాలు – సంధ్యావందనం గోదావరిభాయి 6. ఆంధ్ర మహాభారతంలో వరాలు, శాపాలు – ఒక పరిశీలన – జయరామిరెడ్డి 7. తిక్కన చేసిన మార్పులు – ఔచిత్యపు తీర్పులు – సుమతీ నరేంద్ర 8. తిక్కన భారతము – రసపోషణ – ఆంద్ర కమలాదేవి 9. ఆంధ్రమహాభారతం ఔపదేశిక ప్రతిపత్తి – గోపాలకృష్ణమూర్తి 10. భాగవతంలో కృష్ణతత్వం – సూరంపూడి సుధ 11. భాగవత రహస్యోపన్యాసములు – పులిపాటి వేంకటసుబ్బయ్య 12. వ్యాస–పోతన భాగవతములతో తులనాత్మక పరిశీలన – హృసీకేశ శర్మ 13. భారతంలో విద్యా విధానం – మల్లేశుడు 14. ఆంధ్రభాషా వికాసం – గంటిజోగి సోమయాజి 15. భాషాశాస్త్ర మూలసూత్రాలు – కొత్తపల్లి రంగారావు 16. భాషాచరిత్ర వ్యాసావళి – తూమాటి దోణప్ప 17. ద్రావిడ భాషా పరిశీలనము – చిన సీతారామస్వామి 18. తెలుగు భాషా చరిత్ర – భద్రిరాజు కృష్ణమూర్తి 19. వ్యావహారిక భాషావికాసం – బూదరాజు రాధాకృష్ణ 20. దక్షిణ దేశ భాషాసారస్వతములు – కోరాడ రామకృష్ణయ్య, 21. ఆంధ్ర భాషా చరిత్రము – చిలుకూరి నారాయణరావు 22. బాల ప్రౌఢ వ్యాకరణములు విశ్లేషణాత్మక అధ్యయనం – హరి శివకుమార్ 23. ఆంధ్ర మహాభారతము ఛంద:శ్శిల్పము – పాటిబండ మాధవశర్మ, 24. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు – పి.ఎస్.సుబ్రహ్మణ్యం, 25. ధ్వని – మనుచరిత్ర – రాజన్న శాస్త్రి, 26. జానపద సాహిత్యంలో అలంకార విధానం – ఖుద్దీన్, 27. ప్రసిద్ధాంధ్ర వ్యాకరణాలు – ప్రసన్నరావు, 28. శ్రీనాథ భాషాపరిశీలన – నేతి అనంతరామశర్మ, 29. తెలుగు వ్యాకరణంపై సంస్కృత ప్రాకృత వ్యాకరణాల ప్రభావం –బేతవోలు రామబ్రహ్మం. 30. తెలుగువాక్యం – చేకూరి రామారావు.

**అలంకారశాస్త్రం, ఛందస్సు, వ్యాకరణం మొదలైన అంశాలకు సంబంధించిన పుస్తకాలు కూడా అనేకం '3500 Free Telugu Bhakti Books'లోనే లభిస్తున్నాయి.**

ఈ వ్యాసంలో పేర్కొన్న ఆప్‌లు అన్నీ గూగుల్ ప్లేస్టోర్‌లో లభిస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందరూ ఒక్క నొక్కుతో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇక్కడ పేర్కొన్న సాహిత్యాంశాలకు సంబంధించిన ఆప్‌లు సంపూర్ణమైనవి కాకపోయినా, వాటి పరిమితుల్లోనే అయినా విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి. వాటిని వినియోగించుకునే నైపుణ్యం లేదని బాధపడేవారు కూడా ఉంటారు. కానీ వీటిని వాడటం మొదలుపెట్టిన కొద్ది రోజుల్లోనే నిష్ణాతులు కాగలరు.

★ **రచయిత: తెలుగు సాహిత్య పరిశోధకులు**

# తెలంగాణ సాహిత్య విమర్శ వికాసం

ఇమ్మిడి మహేందర్

0. వ్యాస సంక్షిప్తి:

తెలంగాణ ప్రాంతం ఇతర ప్రాంతాలకన్న చాలా విషయయాలలో భిన్నమైనది. తెలుగు సాహిత్య విమర్శలో తనదైన స్థానాన్ని నిలుపుకున్న తెలంగాణ సాహిత్య విమర్శను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. ఇది చారిత్రక సందర్భం కూడా. ఈ వ్యాసం దేన్ని తెలంగాణ సాహిత్య విమర్శ అనాలి ? అన్న ప్రశ్నతో ప్రారంభమై, ఆలంకారిక విమర్శను స్పృశిస్తూ, ఆధునికత భావాన్ని వివరిస్తుంది. తెలంగాణలో సాహిత్య విమర్శ పరిశోధన, విమర్శ కలగలిపి రాసిన తెలంగాణ, తెలంగాణేతర విమర్శకులను పరిచయం చేస్తుంది. ఆధునిక కాలంలో వివిధ సిద్ధాంతాల ఆధారంగా వెలువడిన విమర్శను తెలంగాణ ప్రాంత దృష్టితో అంచనా వేస్తూ, వివిధ వికాస దశలను విశ్లేషించడం ఈ పరిశోధన వ్యాసం పరిమితి. ముఖ్యోద్దేశం. తెలంగాణ ప్రాంతం కేంద్రంగా సాగిన విమర్శ 'ప్రాంతీయ సాహిత్య విమర్శ'గా పరిణామం చెందడానికి భూమికగా పని చేసిన తెలంగాణ, తెలంగాణేతర సాహిత్య విమర్శకుల కృషిని స్థూలంగా చర్చిస్తుందివ. వివిధ సాహిత్య విమర్శ దృక్పథాలను, వాదాలను, సిద్ధాంతాలను తలస్పర్శిగా పరిచయం చేస్తూ, తర్వాత కేవలం తెలంగాణ స్థానికత కలిగిన విమర్శకులు చేసిన సాహిత్య విమర్శను వికాస దృష్టితో అనుభవంలోకి తెస్తుంది.

1. ఏది తెలంగాణ సాహిత్య విమర్శ:

తెలంగాణలో సాహిత్య విమర్శను అధ్యయనం చేసే ముందు దేనిని తెలంగాణ సాహిత్య విమర్శగా పరిగణించాలి అన్న సందేహం ముందుకొస్తుంది. తెలంగాణ సాహిత్య విమర్శను అంచనా వేసే ప్రయత్నాలు ఇదివరకు కొన్ని జరిగినట్టుగా ఈ కింది ప్రతిపాదనల వల్ల తెలుస్తుంది.

"తెలంగాణ ఆత్మగౌరవ దృక్కోణం నుండి అంటే తెలంగాణ అస్తిత్వ దృక్కోణం నుండి తెలంగాణ సాహిత్యాన్ని వెలికితీసి చరిత్రలో దానికి సముచిత స్థానం కల్పించే పరిశోధన, సాహిత్య చరిత్ర రచన, తెలంగాణ సాహిత్య విశిష్టతను చాటే విమర్శ ఈ మూడింటి సమాహారాన్ని తెలంగాణ సాహిత్య విమర్శగా పరిగణించడం ప్రస్తుత అవసరం. ఒక రకంగా దీనిని తెలంగాణ వాద సాహిత్య విమర్శ అనవచ్చు."(నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. దక్కన్ ల్యాండ్, జూన్ 2017 పుట: 9 - 13) నారాయణరెడ్డి గారు తెలంగాణ సాహిత్య విమర్శను అస్తిత్వవాద దృష్టితో పరిశీలించారు. తెలంగాణలో అస్తిత్వవాద విమర్శతో పాటు వివిధ సిద్ధాంతాల వెలుగులో కూడా సాహిత్య విమర్శ వెలువడింది. కానీ కేవలం అస్తిత్వవాద, ఆత్మగౌరవ ప్రతీకగా వచ్చిన విమర్శను మాత్రమే తెలంగాణ విమర్శగా గుర్తించాలని సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారు అభిప్రాయపడుతున్నారు.

డా. లక్ష్మణ చక్రవర్తి గారు 'తెలుగు సాహిత్య విమర్శలో తెలంగాణ తోవ' (చక్రవర్తి, లక్ష్మణ. 2014: 51) అనే వ్యాసంలో తెలంగాణ

సాహిత్య విమర్శకు సంబంధించి ఈ కింది ప్రతిపాదనలు చేశారు.

1. “సంస్కృతం, తెలుగు భాషల్లో ఈ ప్రాంతం నుంచి వచ్చిన లక్షణ గ్రంథాలు (క్రీ. శ. 1800 వరకు)

2. తెలంగాణ ప్రాంతపు కవుల కావ్యావతారికలు, పండితుల వ్యాఖ్యానాలు (క్రీ. శ. 1800 వరకు)

3. 20వ శతాబ్ది తొలి అడుగులో జరిగిన పరిశోధన, విమర్శలు (క్రీ. శ. 1900 – 1960)

4. 20వ శతాబ్ది మలి అడుగులో ఈ ప్రాంత విమర్శ ఎదిగిన తీరు (క్రీ. శ. 1960 – 1995)

5. ప్రాంతీయ అస్తిత్వ దృష్టిలో వెలువడుతున్న ఈ ప్రాంత సాహిత్య విమర్శ (క్రీ. శ. 1996 – 2012)

లక్ష్మణ చక్రవర్తి గారు తెలంగాణ సాహిత్య విమర్శను సమగ్రంగా అధ్యయనం చేయడానికి పనికే వచ్చే వివరణ ఇచ్చారు. ప్రారంభం నుండి ఇప్పటివరకు వచ్చిన తెలంగాణ సాహిత్య విమర్శను పరిశీలించడానికి అవసరమయ్యే విస్తృతి ఈయన ప్రతిపాదనలో గమనించవచ్చు. వీరు తెలంగాణ అస్తిత్వ దృష్టితో కాకుండా కాలం దృష్టితో పరిశీలించినట్టు తెలుస్తుంది. తెలంగాణేతర విమర్శకులు వివిధ కారణాల రీత్యా తెలంగాణలో జీవిస్తూ, తెలంగాణ సాహిత్యాన్నీ, తెలుగు సాహిత్యాన్ని అనుశీలిస్తే అది తెలంగాణ విమర్శ అవుతుందా?, కాదా? అనే మౌలిక ప్రశ్నకు సమాధానం వెతకాల్సి ఉంది. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం వెతుక్కోవాల్సిన సమయం కూడా ఇది. ఈయన సంస్కృత గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాసిన తెలంగాణ ప్రాంత విమర్శకులను కూడా స్థానమివ్వాలని అభిప్రాయపడుతున్నట్టుగా పై ప్రతిపాదనలో తెలుస్తుంది.

తెలుగు సాహిత్య విమర్శ ఆధునిక ధోరణులను విశ్లేషించిన సాహిత్య విమర్శకులు యాకుబ్ “తెలంగాణ సాహిత్య విమర్శ అనే అంశాన్ని ఎలా చూడాలనే విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు స్థూలంగా కింది విధంగా విభజించుకోవచ్చు. ఈ విభజన సాహిత్య విమర్శను సులభరీతిలో విశ్లేషించడానికి పనికి వచ్చేది మాత్రమే గాని రూఢీ చేయలేము. ఆ రకంగా చూసినప్పుడు

1. తెలంగాణ సాహిత్య విమర్శకులు చేసిన సాహిత్య విమర్శ

2. తెలంగాణ సాహిత్యంపై వచ్చిన విమర్శ

3. తెలంగాణ అస్తిత్వ కోణంలో వెలువడిన విమర్శ అని మూడు రకాలుగా విభజించుకోవచ్చు.''గా వింగడించారు. (యాకుబ్, 2016: 262)

యాకుబ్ గారు పేర్కొన్న మొదటి అంశంలో తెలంగాణ సాహిత్య విమర్శకులు చేసిన సాహిత్య విమర్శను తెలంగాణ సాహిత్య విమర్శగా గుర్తించాలన్నారు. రెండవ అంశంలో తెలంగాణేతరులు తెలంగాణ ప్రాంత సాహిత్యంపై చేసిన విమర్శను తెలంగాణ సాహిత్య విమర్శగా పరిగణించవచ్చా? లేదా? వంటి సందేహాలకు సమాధానాలను వెతుకవల్సిన అవసరం ఉంది.

మరో విమర్శకుడు కాసుల ప్రతాపరెడ్డిగారు కూడా తన ‘తెలంగాణ సాహిత్యోద్యమాలు’ గ్రంథంలో దాదాపుగా ఇలాంటి అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.

పైన ఉటంకించిన వివిధ సాహిత్య విమర్శకుల అభిప్రాయాలను విశ్లేషించిన మీదట దేనిని తెలంగాణ సాహిత్య విమర్శగా పరిగణించాలి అన్న మౌలిక ప్రశ్నకు సమాధానంగా ఈ కింది ఆలోచనలను పేర్కొనవచ్చు.

1. తెలంగాణలో పుట్టి తెలంగాణ సాహిత్యాన్ని వివేచించిన వారు

2. తెలంగాణలో పుట్టి తెలంగాణేతర సాహిత్యాన్ని వివేచించిన వారు

3. తెలంగాణేతర ప్రాంతంలో పుట్టి తెలంగాణ సాహిత్యాన్ని వివేచించిన వారు

4. తెలంగాణేతర ప్రాంతంలో పుట్టి తెలంగాణను కార్యక్షేత్రంగా చేసుకుని సాహిత్య వివేచన చేసిన వారు

5. తెలంగాణేతర ప్రాంతంలో పుట్టి ప్రారంభంలో తెలంగాణ కార్యక్షేత్రంగా సాహిత్యాన్ని విస్తృత కోణంలో సాహిత్య వివేచన చేసినవారు

పై అయిదు అంశాలు తెలంగాణ సాహిత్య విమర్శను గుర్తించడానికి మౌలికంగా చేసిన ప్రతిపాదనలు. పై ప్రతిపాదనల్లో ఒకటవ, రెండవ అంశాలు తెలంగాణ సాహిత్య విమర్శకు ప్రధానమైనవి. మూడవ, నాలుగవ అంశాలు తెలంగాణ సాహిత్యంపై తెలంగాణేతర విమర్శకులు చేసిన కృషిని తెలుపుతాయి. ఐదవ అంశం తెలంగాణలో సాహిత్య విమర్శ ఆరంభానికి దోహదపడిన తెలంగాణేతరుల విమర్శకుల కృషిని తెలుపుతుంది.

2. తెలంగాణ ఆలంకారిక విమర్శ:

తెలంగాణ ఆలంకారిక విమర్శ అన్నప్పుడు తెలంగాణ ప్రాంతం నుండి సంస్కృత, ప్రాకృత, తెలుగు భాషలల్లో వెలువడిన సాహిత్య వివేచన గ్రంథాలని విమర్శకులు నిర్ధారించారు. ఇతర భాషా సాహిత్యాలలో (సంస్కృత, ప్రాకృత) వచ్చిన అలంకార శాస్త్ర గ్రంథాలను తెలుగువారు తమవిగా చేసుకొని మాట్లాడుకునే పరిస్థితి ఎందుకు వచ్చిందో లోతుగా చర్చించాల్సిన అవసరం ఉంది. తెలుగు సాహితీ ప్రపంచంలో ప్రత్యేకమైన ఆలంకారిక శాస్త్ర గ్రంథాలు ఉన్నాయా? శాస్త్ర సంబంధిత విషయాలు భాష, ప్రాంతాలను బట్టి మారుతాయా? అన్నవి చర్చనీయాంశాలు. ఇక్కడ చేకూరి రామారావుగారి మాటలను ఒక సారి గుర్తుచేసుకోవాలి. ‘‘మనకు తెలుగులో సంస్కృతానికి భిన్నమైన సాహిత్య శాస్త్రం లేదు. మన సాహిత్య శాస్త్ర గ్రంథాలన్నీ సంస్కృత సిద్ధాంతాలకు పద్యంలోనో, గద్యంలోనో చేసిన అనువాదాలు. నన్నయ్య మొదలైన కవులు తమ గ్రంథాలలో కవిత్వాన్ని గురించిన కొన్ని అభిప్రాయాలు చెప్పారుగానీ వాటికి సిద్ధాంత స్థాయిలేదు”. (సాహిత్య వ్యాస రింఛోళి. పుట: 01)

తెలుగువారికి ప్రత్యేకమైన సాహిత్యశాస్త్ర గ్రంథాలు లేకపోయినా, సాహిత్యం ఉంది. తెలుగు సాహిత్యాన్ని కూడా సంస్కృత భాష సాహిత్య దృక్పథాలతో వివేచించడం జరిగింది. మనకంటూ ప్రత్యేకమైన సాహిత్యశాస్త్రం అభివృద్ధి చెందకపోవడానికి భాషా, సంస్కృతిపరమైన ఆధిపత్య దోరణి, వివక్షత కారణమై ఉండవచ్చు. ఏది ఏమైనా మనకంటూ ప్రత్యేకమైన సాహిత్యశాస్త్రం లేదని ఒప్పుకోవాల్సిందే.

తెలంగాణ నుండి సంస్కృత పండితుడైన భవభూతిని రససమీకరణ ఆలోచనలకు ఊతమిచ్చినవాడిగా లక్ష్మణ చక్రవర్తిగారు గుర్తించారు. కావ్యాత్మ సిద్ధాంతాలలో

ఇప్పటివరకు చివరిదైన చమత్కార సిద్ధాంతాన్ని విశ్వేశ్వరుడు చమత్కార చంద్రిక గ్రంథం ద్వారా ప్రతిపాదించాడు. ప్రతాపరుద్ర యశోభూషణం, రసార్ణవ సుధాకరం, లక్షణ దీపిక, అలంకార సుధానిధి మొదలైన గ్రంథాలు సంస్కృతం నుండి వెలువడ్డాయి. లక్షణ సార సంగ్రహం, అప్పకవీయాలు తెలుగులో వెలువడ్డాయి. వీటితో పాటు సంస్కృత గ్రంథాలకు అనువాదాలు, వాఖ్యానాలు - విమర్శలు తెలంగాణ నుండి బాగానే వెలువడ్డాయి. తెలంగాణ ప్రాంతం నుండి ఆలంకారిక శాస్త్రానికి సంబంధించిన ఆలోచనలు, వివేచనలు నేటికి కొనసాగుతున్నాయి. అలంకార సిద్ధాంతాల్ని స్త్రీ కోణం నుండి ప్రొఫసర్ కాత్యాయని విద్మహే వివేచిస్తున్నారు. రస సిద్ధాంతాన్ని నవలకు అనువర్తిస్తూ డా. ముదిగంటి సుజాతరెడ్డి గ్రంథాన్ని రాసారు. అలంకారశాస్త్ర వికాసంపై డా. లక్ష్మణ చక్రవర్తి అధ్యయనం చేస్తున్నారు. డా. గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి, పెన్నా శివరామకృష్ణ, సుంకిరెడ్డి నారాయణరెడ్డిలాంటి విమర్శకులు కృషి చేస్తున్నారు.

3. తెలంగాణ - ఆధునికత:

తెలుగు సాహిత్యానికి సంబంధించి ఆధునికత అనే సాంకేతిక పదాన్ని దాన్ని స్వభావాన్ని, అంచనా వేయడానికి ఇప్పటివరకు ఎన్నో చర్చోపచర్చలు జరిగాయి. ఈ చర్చలన్నీ విదేశీయమైన పారిశ్రామిక, ఫ్రెంచి, రష్యా విప్లవాలు వాటికి సమాంతరంగా అభివృద్ధి చెందిన ప్రజాస్వామిక భావజాలాలు తెలుగు నేలను ముఖ్యంగా బ్రిటిష్ పాలిత నేటి ఆంధ్రప్రదేశ్‌ను దాని అభివృద్ధి క్రమాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. కానీ, తెలంగాణలో ప్రత్యక్షంగా బ్రిటిష్ పాలన లేకపోవడంవల్ల ఇక్కడ ఇతర తెలుగు ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి, సాంస్కృతిక జాగరణ, ఆంగ్ల విద్య వ్యాప్తి, ప్రజాస్వామిక భావాలు ప్రసరించే అవకాశం లేకుండా పోయింది. కానీ ఆర్యసమాజం, బ్రహ్మసమాజం, సాలర్‌జంగ్ సంస్కరణలు, ఆంధ్ర మహాసభ, కమ్యునిస్టు ఉద్యమాల ప్రభావంవల్ల తెలంగాణలో భావ చైతన్యం వెల్లివిరిసింది. కనుక తెలంగాణలో ఆధునికతను అర్థం చేసుకోవాలంటే వీటి పరిణామ క్రమాన్ని, వాటి ప్రభావాలు తెలంగాణ సమాజాన్ని, భాషాసాహిత్యాలను ఏ విధంగా ప్రేరేపించాయో అంచనా వేయాల్సి ఉంటుంది.

ఆధునికత అనేది 19వ శతాబ్దిలో వచ్చిన భావన. సాహిత్యానికి సంబంధించి ఆధునికత కాలంలో వచ్చిన మార్పా?, ప్రక్రియలో వచ్చిన మార్పా? లేక భావనలో వచ్చిన మార్పా? అన్నది గమనించాల్సిన అంశం. ప్రస్తుతం చాలా మంది పరిశోధకులు, విమర్శకులు ఆధునికతను భావనలో వచ్చిన మార్పుగా అంగీరించారు. తెలుగు ప్రాంతాలు ఆధునికతను పూర్తిగా సంతరించుకోకముందే ఆధునికానంతరత వాదాలు కూడా వచ్చాయి. నిజానికీ ఏ సిద్ధాంతం కూడా నిత్యమైనది కాదు. ఏ కాలానికి ఆ కాలంలో సమకాలీనంగా వెలువడుతున్న సాహిత్యాన్ని వివిధ సిద్ధాంతాలు ప్రభావితం చేసినా తర్వాతి కాలాలలో ఆ సిద్ధాంతాలకు ఎదురయ్యే ఆటుపోట్ల వలన వేరే సిద్ధాంతాలు ఉనికిలోకి వస్తాయి.

"నిరంతర చలనశీలమైన సమాజంలో ఆధునికత ఎప్పటికప్పుడు సాపేక్షమే. అందువల్ల ఆధునికతని నిర్వచించడం, ఆధునిక విమర్శకు ప్రారంభ దినాల్ని నిర్ధారించడం చాలా కష్టమైన పని. ఆధునికత కేవలం కాలవాచి కాదు. అదొక జీవన విధానం, ఆలోచనా విధానం. మరింత లోతుగా ఆలోచిస్తే అదొక సామాజిక తాత్త్వికత.

దాన్ని సాహిత్యానికీ సాహిత్య విమర్శకూ అన్వయించడంలో సాంకేతిక సామాజిక రాజకీయ ఆర్థిక శాస్త్రాల ప్రమేయం చాలా ఉంటుంది."(యాకుబ్. 2018:11)

ఆంగ్లేయుల పాలనలోని తెలుగు ప్రాంతాలలో జరిగినట్టుగా తెలంగాణలో వికాసభావాల వ్యాప్తి జరగలేదని చెప్పడానికి వీలు లేదు. ఈ రెండు ప్రాంతాలలో జరిగిన వికాసాన్ని, ఆధునికతను భిన్నమైన అంశాలుగా చూడాలి. తెలంగాణ నైజాము పాలనలో అంధకారంలో ఉండిపోయింది అనే వ్యాఖ్యానాలు కాలం చెల్లిపోయాయి. నిజానికి తెలంగాణ అయినా, ఇంకే ప్రజా సమూహమైనా సుదీర్ఘ కాలం జడంగా ఉండదు. సమాజం ఎల్లప్పుడూ చలనశీలమైనది. ఏ సమాజం కూడా అభివృద్ధి, వికాసాలు లేకుండా ఉండదు. ఆధునికత వివిధ సమాజాలలో బయటి శక్తుల వల్ల కొద్దిపాటు ప్రభావానికి గురైన మాట వాస్తవమైనప్పటికీ, దేశీయమైన అభివృద్ధి మూలాలను మరవడానికి వీలులేదు. ఈ విధంగా తెలంగాణ దేశీయ మూలాలైన అభివృద్ధికర శక్తుల ద్వారా ఆధునికత వైపు సొంత అడుగులు వేసింది. ఈ విషయాన్ని కె. శ్రీనివాస్ గారు తన పరిశోధన (తెలంగాణ సాహిత్య వికాసం)లో చాలా బాగా చర్చించారు.

4. తెలంగాణ సాహిత్య విమర్శ – ప్రారంభ దశ:

తెలంగాణ ప్రాంతంలో తెలుగు సాహిత్య విమర్శ 20వ శతాబ్దం తొలి దశల్లో ప్రారంభమైంది. తెలంగాణలో విమర్శ, పరిశోధన ప్రారంభానికి ఈ ప్రాంత పరిశోధకులు, విమర్శకులతోపాటు తెలంగాణేతరులు కూడా కృషి చేశారు. తెలంగాణలో విమర్శకు పాదులు వేసిన వారిలో తెలంగాణ వారితోపాటు తెలంగాణేతరులు చేసిన కృషి స్మరించదగినది. నేటి తెలంగాణ ప్రాతిపదికను కొలబద్ధగా చేసుకొని తెలంగాణేతరుల కృషిని తగ్గించడం వల్ల తెలంగాణ సాహిత్య విమర్శ కృత్యాద్యవస్థను అర్థం చేసుకోలేము. అది వేసిన ప్రభావాన్ని మూల్యాంకనం చేయలేము. మనకు మనంగా పరిధిని గీసుకున్న వాళ్లమవుతాం. వారంతా తెలంగాణ సాహిత్య విమర్శకు తొలి అడుగులను నేర్పించినవారు. తెలంగాణ సాహిత్యాన్ని విస్తృత కోణంలో పరిశీలించినవారు. విస్మృతమౌతున్న తెలంగాణ అస్తిత్వాన్ని జవజీవాలతో నిలబెట్టినవారు.

తెలంగాణ సాహిత్య విమర్శ ప్రారంభ దశలో వెలువడిన వ్యాసాల్లో పరిశోధనాత్మక దృష్టితో పాటు, విమర్శనాత్మక దృష్టి కనబడుతుంది. సాహిత్యం ఏదైనా ఆ ప్రాంత సామాజిక, రాజకీయ, చరిత్రాది రంగాలపై ఆధారపడి నిష్పన్నమవుతుంది. తెలంగాణలో విమర్శకు పునాదులు వేసిన తొలి తరం విమర్శకులు చేసిన కృషి సేకరణ ప్రధానమైన పరిశోధన, విశ్లేషణ ప్రధానమైన విమర్శగా కలగాపులగంగా నడిపించారు. పరిశోధన దృష్టి, విమర్శ దృష్టి ఉన్న స్థితినుండి ఒక రచనను కేంద్రంగా చేసుకొని విమర్శను వెలువరించే స్థాయికి తెలంగాణ విమర్శ చేరుకుంది. ఈ విశాలత్వం ప్రాతిపదికన తెలంగాణ సాహిత్య విమర్శ తొలి అడుగులను స్థూలంగా ఈ కింద విశ్లేషించడమైంది.

మానవల్లి రామకృష్ణకవి (1866–1957) తెలంగాణేతర ప్రాంతంలో జన్మించినా వనపర్తి సంస్థానంలో ఆయనున్నంతకాలం గ్రంథ పరిష్కరణలో కొత్త జాడలు చూపించారు. "విస్మృత కవులు" శీర్షికతో వెలుగులోకి రాని ఎందరో కవులను సాహితీ లోకానికి పరిచయం చేశారు. స్థలాభావం దృష్ట్యా వాటిని ప్రస్తుత

వ్యాసంలో పొందుపరచడంలేదు.

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు (1876 – 1923) కృష్ణాజిల్లాలో జన్మించినా, బాల్యం అంతా తెలంగాణలోని భువనగిరి, దేవరకొండ ప్రాంతాలలో గడిచింది. ఈ నేల నుంచే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. ఈయన ఆనాటి తెలంగాణ అస్తిత్వం కోసం చాలా కృషి చేశారు. పోతనను తెలంగాణ వాడిగా నిరూపించారు. రామాయణంలోని పర్ణశాల భద్రాచలంలో ఉన్నట్లు సహేతుకంగా నిరూపించారు. త్రిలింగాలలోని మూడవ క్షేత్రం శ్రీకాళహస్తి కాదని కరీంనగర్‌లోని కాళేశ్వరం అని చాటి చెప్పారు. ఈయన రాసిన వ్యాసాలు "లక్ష్మణరాయ వ్యాసావళి" పేరుతో పుస్తకంగా వచ్చాయి. ఈయన బహుగ్రంథ కర్త. పరిశోధకుడిగా, విమర్శకుడిగా, రచయితగా బహుముఖీన కృషి చేశారు.

శేషాద్రి రమణ కవులు(1890–1940/ 1893%--%1963). వీరు ''దూపాటి శేషాచార్యులు'', ''దుపాటి వెంకట రమణాచార్యులు"గా ప్రసిద్ధులు. వీరి జన్మస్థానం గుంటూరు జిల్లా అయినా, హన్మకొండ కేంద్రంగా సాహితీ గవేషణను కొనసాగించారు. తెలంగాణ ప్రాంత సాహిత్యాన్ని విస్తృత కోణంలో పరిశోధించి వెలుగులోకి తేవడానికి అహర్నిశలు కృషి చేశారు. అందులో భాగంగా 1927వ సంవత్సరంలో "నిజామురాష్ట్రాంధ్ర కవులు" అనే వ్యాసం ప్రచురించబడింది.

సురభిమాధవరాయలు రచించిన ''చంద్రికా పరిణయానికి'' వీరు రాసిన వ్యాఖ్యానం" 1924 ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో ప్రచురించారు.

ఆదిరాజు వీరభద్రరావు (1890 –1973) తొలి తరం పరిశోధకులలో తెలుగు సాహిత్యానికి అవసరమైన చారిత్రక భూమికను అందించిన వ్యక్తి. ఆనాటి శోభ పత్రికలో జానపద విజ్ఞానికి సంబంధించి ''పల్లె పదాలు'', ''తాళపత్ర గ్రంథాలు" అన్న విమర్శ వ్యాసాలు రాశారు. వీరి రచనలు తెలంగాణ చరిత్రను నిర్మించడంలో విశేషమైన ఆధారాలను అందించగలిగాయి.

మాడపాటి హనుమంతరావు (1885 – 1970) 'మహాభారత సమీక్షణము' అనే వ్యాసం1914లో వేలో ఆంధ్రభారతిలో వెలువడింది. ''తెలంగాణ ప్రాంత తొలి విమర్శకుడెవరు? అని ప్రశ్నించుకున్నప్పుడు ఒక రచన తత్త్వాన్ని విశ్లేషించడమే విమర్శ అనుకున్నప్పుడు దొరుకుతున్న ఆధారాలనుబట్టి ఈయనను తొలి తెలంగాణ ప్రాంత విమర్శకుడిగా చెప్పవలసి వస్తుంది కానీ ఇది సంస్కృత మహాభారతానికి సంబంధించింది" అని డా. లక్ష్మణ చక్రవర్తిగారు మాడపాటి హనుమంతరావు గారిని తెలంగాణ తొలి విమర్శకుడిగా గుర్తించనట్టుగా తోస్తుంది. (లక్ష్మణ చక్రవర్తి. 2014:59)

సురవరం ప్రతాపరెడ్డి (1896–1953) "కవిత్వ విషయం – ద్విపద రామాయణం" అన్న వ్యాసం 1922లో ప్రచురితం అయింది. ఒక వేళ మాడపాటి హనుమంతరావు గారి వ్యాసం సంస్కృత సాహిత్యానికి సంబంధించినదిగా గుర్తిస్తే తెలంగాణ ప్రాంత తొలి విమర్శకుడు సురవరం ప్రతాపరెడ్డి అవుతారు. వీరు విమర్శ, పరిశోధన రంగాలలో విశిష్ట కృషి చేశారు. గోలకొండ పత్రికకు సంపాదకత్వం వహించారు. తెలంగాణ అస్తిత్వ పతాకను 'గోలకొండ కవుల' సంచిక ద్వారా చాటారు. తొలి తెలంగాణ అస్తిత్వవాద సాహిత్య విమర్శకుడిగా గుర్తింపు పొందారు. సురవరంను "తెలంగాణ తొలి సమగ్ర

విమర్శకుడి”గా సుంకిరెడ్డి నారాయణరెడ్డి గారు ప్రతిపాదించారు. (చూ. దక్కన్ ల్యాండ్ మాస పత్రిక. ఆగస్టు 2016: 09) వీరు చారిత్రక, సామాజిక విమర్శలకు కేంద్ర స్థానంగా నిలిచారు. ఈయన ‘గోల్కొండ కవుల సంచిక’, ‘ఆంధ్రుల సాంఘిక చరిత్ర’, ‘హైందవ ధర్మవీరులు’, ‘హిందువుల పండుగలు’, ‘రామాయణ విశేషములు’ మొదలైన గ్రంథాలను రచించారు. వీరి వ్యాసాలను తెలంగాణ సారస్వత పరిషత్, సంగిశెట్టి శ్రీనివాస్ ఇతరులు వెలుగులోకి తీసుకువచ్చారు. తెలంగాణలో చారిత్రక విమర్శను చేపట్టి పరిశోధన, విమర్శా రంగాలలో చాలా కృషి చేశారు.

బూర్గుల రామకృష్ణరావు (1899 – 1967) బహు భాషావేత్త. ఈయన రాసిన “నవీన వాఙ్మయం – ఎంకిపాటలు” వ్యాసం గోలకొండ పత్రికలో 1926లో వెలువడింది. ఈయన స్వయంగా సృజనకారుడు. ఈయన రచించిన విమర్శ వ్యాసాలు “సారస్వత ముక్తావళి” పేరుతో వెలువడ్డాయి. 1989లో “పారశీక వాఙ్మయ చరిత్ర'', 1995లో ''బూర్గుల పీఠికలు'' వెలువడ్డాయి. “బూర్గుల రామకృష్ణరావు 1926లో రాసిన వ్యాసం అచ్చుమైన ఆధునిక సాహిత్య విమర్శ వ్యాసంగా కనిపిస్తుంది. నవీన వాఙ్మయ తత్త్వాన్ని చెబుతూ ఎంకి పాటల విశిష్టతను సోపపత్తికంగా ఆయన వివరించిన తీరు “తెలంగాణ ప్రాంత తొలి ఆధునిక సాహిత్య విమర్శకుడి”గా బూర్గుల రామకృష్ణారావును చెప్పడానికి వీలు కల్పిస్తున్నది.” (చక్రవర్తి, లక్ష్మణ. 2016: 59, 60) అని డా. లక్ష్మణ చక్రవర్తి ప్రతిపాదించారు.

తెలంగాణ తొలి విమర్శకుడు, తొలి ఆధునిక సాహిత్య విమర్శకుడు అనే అంశాల విభజన విషయంలో కొద్దిపాటి అస్పష్టత ఉన్నది. తెలుగు సాహిత్యంలో విమర్శ ప్రక్రియ పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో వచ్చింది. ఇది ఆధునికమైనది. విమర్శ ప్రక్రియనే ఆధునికమైనప్పుడు తెలంగాణ తొలి విమర్శకుడు, తొలి ఆధునిక సాహిత్య విమర్శకుడు అని విభజించడం వెనుకాల ఉన్న సైద్ధాంతిక స్పష్టత ఏమిటి? అన్న విషయం ఆలోచించాలి. ఈ విషయంపై సాహిత్య విమర్శనా రంగంలో మరింత చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ఆధునిక సాహిత్యాన్ని వివేచించడం మూలంగా డా. లక్ష్మణ చక్రవర్తి ఆధునిక సాహిత్య విమర్శకుడు అన్నారా? ఒక వేళ ఈ అంశాన్నే పరిగణలోకి తీసుకుంటే ఈ వాదన నిలబడదు. మరి సురవరం ప్రతాపరెడ్డి ప్రాచీన సాహిత్యాన్ని వివేచన చేయడంవల్ల సాంప్రదాయక విమర్శకుడిగా గుర్తించాలా? అన్నది వివాదాంశం. ప్రాచీన సాహిత్యాన్నైనా, ఆధునిక సాహిత్యాన్నైనా ఆధునికత దృక్పథంతో పరిశీలించడం ఆధునిక విమర్శకుడి లక్షణం. ఈ కారణంగా పై వాదన గెలవలేదు. కాబట్టి డా. లక్ష్మణ చక్రవర్తి ప్రతిపాదించిన తొలి ఆధునిక సాహిత్య విమర్శకుడు అనే ప్రతిపాదన చర్చకు నిలబడదు. కావున తెలంగాణ తొలి సాహిత్య విమర్శకుడు అన్నా, తెలంగాణ ఆధునిక సాహిత్య విమర్శకుడు అన్నా సురవరం ప్రతాపరెడ్డిని గుర్తించాల్సి ఉంటుంది. ఇక్కడ స్పష్టత రావాల్సిన విషయమేమిటంటే ఆధునిక సాహిత్య విమర్శకుడు అన్న పదబంధంలో ఆధునిక భావాలతో సాహిత్యాన్ని అంచనా వేయడం అన్న స్పష్టత ఏర్పరుచుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే తెలుగు సాహిత్యంలో ఆధునికత కాలవాచిగా కాకుండా గుణవాచిగా ఉంది. ఆధునిక కాలంలోను సంప్రదాయ భావాలు గల రచనలు ఉన్నాయి కాబట్టి వాటిని ఆధునికత భావాలు గల రచనలుగా గుర్తించలేము కదా!

తెలంగాణలో సురవరం ప్రతాపరెడ్డి తర్వాత అస్తిత్వవాద దృక్కోణంలో సాహిత్య విమర్శ, రచనలు వెలువరించిన వ్యక్తి 'మాడపాటి హనుమంత రావు' (1917-1993). వీరు 'సారస్వత నవనీతము', 'వ్యాస మంజూష', 'నా సాహిత్యోపన్యాసములు', 'తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం' మొదలైన రచనలు వారి విమర్శనాదృక్పథానికి అద్దం పడుతాయి.

పైన పేర్కొన్న వారితోపాటు వెల్దండ ప్రభాకరమాత్య, కేశవపంతుల నరసింహశాస్త్రి, చొల్లేటి నృసింహశర్మ, అంబటిపూడి వెంకటరత్నం, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, వెల్లాల సదాశివశాస్త్రి, అప్పన్నశాస్త్రి, పాములపర్తి సదాశివరావు, సుందరీ బాయి, నందగిరి వెంకటరావు, శేషభట్టర్ రమానుజచార్యులు, బొంగులూరు నరసింహశర్మ, కోదాటి రామకృష్ణారావు, నందగిరి ఇందిరాదేవి, వెల్దూర్తి మాణిక్యరావు, బెల్లకొండ చంద్రమౌళిశాస్త్రి, బుక్కపట్నం రామానుజాచార్యులు, మల్యాల దేవీప్రసాద్ యాదవ్, గడియారం రామకృష్ణశర్మ, చిదిరె మఠం వీరభద్రయ్య, షబ్నవీస్, గవ్వా సోదరులు, పింగళి వెంకటేశ్వరరావు, చెలమచర్ల రంగాచార్యులు, కోలాచలం కృష్ణ సోమయాజి, గాదా వఝల రామావధాని, మాదిరాజు నాగభూషణరావు, కవి తార్కిక సింహగోపాలాచార్యులు, రవాడ సత్యనారాయణ, పల్లెర్ల హనుమతరావు, డి. సూర్యనారాయణ శాస్త్రి, పింగళి హనుమంతరావు, మఠం సిద్ధి వీరయ్య, సిరుగూరి జయరావు, శిలగం జగన్నాథం, సర్వతీ దేవి, తిరుమల బుక్కపట్నం వెంకటాచార్యులు, వాజుపేయాజుల రామ సుబ్బారాయుడు, మహాలక్ష్మి, బి. శ్యామలాంబ వీరభద్రమ్మ, అలివేలమ్మ, సి. కృష్ణశర్మ, గుండవరపు హనుమంతరావ, బోయినేపల్లి రంగారావు, కాంచనపల్లి చిన వెంకటరాయ రావు, పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి, పులిజాల హనుమంతరావు, ధవళా శ్రీనివాసరావు, అడ్లూరి అయోధ్య రామయ్య, బూర్గుల రంగనాథరావు, కోదాటి నారాయణరావు, బండారు చంద్రమౌళీశ్వరరావు, బిరుదురాజు రామరాజు, పువ్వాడ వెంకట అప్పయ్య, వెల్దండ ప్రభాకరామాత్యులు లాంటి చాలా మంది విమర్శకులు 1913, 1922 నాటి హితబోధిని, నీలగిరి, తెనుగు, గోలకొండ, సుజాత మొదలైన పత్రికల్లో ఎంతో విశేషమైన సాహితీ విమర్శ వ్యాసాలను రచించారు. వాటిని సేకరించి తెలంగాణ ప్రాంత దృష్టితో వివేచించాల్సి ఉంది.

5. తెలంగాణ సాహిత్య విమర్శ - వికాస దశ:

గ్రంథ సేకరణ, పరిష్కరణ, పరిశోధన/విమర్శ మొదలైన పద్ధతుల్లో తెలంగాణ సాహిత్య విమర్శ తొలి అడుగులను నేర్చుకున్న విధానాన్ని పైన గమనించాం. తర్వాతి కాలంలో ప్రపంచవ్యాప్తంగానూ, దేశీయంగానూ సామాజికాది రంగాలలో సంభవించిన అనేక పరిణామాలు తెలంగాణను ఎంతో ప్రభావితం చేశాయి. ముఖ్యంగా స్థానికంగా వెల్లువెత్తిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, జగిత్యాల జైత్రయాత్ర, దేశీయంగా నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాటాల ప్రభావం తెలంగాణ కవులను ఒక చేత్తో కలాన్ని, మరో చేత్తో ఆయుధాన్ని పట్టించాయి. 1990ల తర్వాత కమ్యూనిస్టు పోరాటాలు ఒడిదొడులకు లోను కావటం, భిన్న సమాజాల అస్తిత్వ భావనలకు ఊతం రావడం వలన స్త్రీవాద, దళిత, ప్రాంతీయాది అస్తిత్వోద్యమ సాహిత్యం తెరమీదికి వచ్చింది. వీటి నేపథ్యంలో ముఖ్యంగా మార్క్సిస్టు, అస్తిత్వ ఉద్యమాల సాహిత్యమే తెలంగాణలో

విస్తృతంగా వెలువడింది. ఈ వ్యాస రచనకు ప్రేరణనిచ్చిన తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యం గరిష్ఠంగా వెలువడింది. ఈ రకమైన సాహిత్యాన్ని పరామర్శించడానికి వివిధ సాహిత్య సిద్ధాంత పరికరాలు సృష్టించబడ్డాయి. వీటికి సమాంతరంగా మనోవైజ్ఞానిక, నవ్య సంప్రదాయవాద విమర్శ కూడా వెలువడింది. తద్విమర్శా పద్ధతులన్నింటిని ఈ కింద తలస్పర్శిగా చర్చించడమైంది.

5.1 నవ్య సంప్రదాయ సాహిత్య విమర్శ:

ఆధునిక తెలుగు సాహిత్యంలో వినబడే సాహిత్య పారిభాషిక పదాల్లో సంప్రదాయం, నవ్య సంప్రదాయం అనే పదాలు సంప్రదాయానికి అనుకూలంగా కన్పిస్తాయి. ''సమాజం ఆచరించడానికి యోగ్యమై అర్థవంతమైన అవగాహనతో కూడుకొన్న ఒక జాతి యొక్క సజీవ విజ్ఞానం సంప్రదాయం" (సుబ్రహ్మణ్యం, జి. వి. 1995: 16) అని నిర్వచించారు.

తెలుగులో ప్రాచ్య ప్రభావం ద్వారా వచ్చిన విమర్శనా రీతి సాంప్రదాయిక విమర్శ. ఈ విమర్శ కాల్పనికవాదం, అభ్యుదయవాదం, విప్లవవాదం మరియు అనేక అస్తిత్వోద్యమాలకు విరుద్ధంగా కన్పడుతుంది. ఈ విరుద్ధ భావాలకు కారణం పరస్పర భిన్నంగా ఉండే సిద్ధాంతాల ఆచరణ. ఇంగ్లీష్‌లో "నియోక్లాసిజమ్'' అనే పదానికి సమానార్థకంగా తెలుగులో "నవ్య సంప్రదాయం" అని ఉపయోగిస్తున్నారు.

నవ్య సంప్రదాయ విమర్శలో ఎన్నో ఉప విభజనలు ఉన్నాయి. వీటన్నింటిని సాంప్రదాయికత భూమిక కిందికి తెచ్చి ఒక దగ్గర చేర్చవచ్చు. ఆధునిక సాహిత్య విమర్శలో సాంప్రదాయికత అన్నప్పుడు సంస్కృతి, అలంకారశాస్త్రం, వేదాంతాల నేపథ్యంలో విమర్శ చేయడం జరుగుతుంది. అందువల్ల సాంస్కృతిక, సౌందర్య, అలంకార శాస్త్రాల భూమికలో వెలువడిన విమర్శకైనా, ఆధ్యాత్మిక సాహిత్యంలో వేదాంత పార్శ్వాన్ని అన్వయించే విమర్శ అయినా ఈ నవ్య సాంప్రదాయిక రీతి కిందికే వస్తాయి. నవ్య సంప్రదాయ వాద విమర్శకులు పూర్వకవులకు వారసులుగా భావించుకుంటారు. సాంస్కృతిక వారసత్వాన్ని అంగీకరిస్తారు. ఇటువంటి విమర్శకు సైద్ధాంతిక భూమికను అందించిన వారు ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం, కోవెల సంపత్కుమారాచార్య గార్లు. సంపత్కుమారాచార్య గారు "ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ %--% సాంప్రదాయిక రీతి" అనే గ్రంథంలో ఈ సాహిత్య విమర్శకు సైద్ధాంతిక భూమికను అందించారు. ఇదే కోణంలో ఇంకా కోవెల సుప్రసన్నాచార్య, ముదిగొండ వీరభద్రయ్య, ఆనుమండ్ల భూమయ్య, పేర్వారం జగన్నాథం మొదలైన వారు విమర్శను కొనసాగించారు. విశ్వనాథ వేయిపడగలు నవలపై గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తిగారి వ్యాసంలో దేశీయత భూమిక, భారతీయ దృష్టితో కూడుకుని ఉంది. ఇదే కోణంలో ముదిగంటి సుజాతరెడ్డిగారి "రస చర్చ - ఆధునికత' అనే గ్రంథం కూడా చేరుతుంది.

5. 2. అభ్యుదయ సాహిత్య విమర్శ:

సామాజిక వ్యవస్థకు పునాది ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సంబంధాలు. దీని ఆధారంగానే ఉపరితల అంశాలు నిర్ణయమవుతాయి. ఆ విధంగా ఉపరితల అంశమైన సాహిత్యాన్ని గతితార్కిక చారిత్రక భౌతికవాద దృష్టితో చూడడం ఈ విమర్శనా రీతి ప్రధాన లక్ష్యం. ఇది పునాది %--% ఉపరితలం అనే అంశాల ఆధారంగా తన సంవిధానాన్ని కలిగి ఉంటుంది. అభ్యుదయ సాహిత్య విమర్శ మొదట మార్క్సిస్టు

సాహిత్య విమర్శగా ప్రారంభమైంది.

"మార్క్సిస్టు విమర్శ పరిశీలిస్తున్న సాహిత్యం వల్ల నిర్వచింపబడదు, పరిశీలించే పద్ధతి వల్ల నిర్వచింపబడుతుంది," (సుబ్బారావు, సి. వి. 1986. ముందుమాట 12)

"మార్క్సిస్టు దృక్పథంతో సాహిత్యాన్ని పరిశీలించడమంటే ప్రకృతిని, చరిత్రను, సాహిత్యాన్ని గతితార్కిక భౌతికవాద పరంగా పరిశీలించటమని అర్థం." (శ్రీనివాసరావు, చేకూరి. అభ్యుదయ విమర్శ విశేష సంచిక. పుట: 75)

పై అంశాలను బట్టి మార్క్సిస్టు సాహిత్య విమర్శ తనదైన చూపు నుండి సమాజాన్ని, చరిత్రను, సాహిత్యాన్ని వివేచిస్తుందని తెలుస్తుంది. మార్క్సిస్టు సాహిత్య విమర్శ పరిశీలించే విధానాన్ని బట్టి నిర్ణీతమవుతుంది. తెలంగాణలో కమ్యూనిజం ప్రభావం ఎక్కువ. తెలంగాణ విమర్శకులు మార్క్సిస్టు సాహిత్య విమర్శ రీతిలో సాహిత్యాన్ని వివేచించారు. తెలుగు సాహిత్య విమర్శకులలో చాలా మందికి సిద్ధాంత అధ్యయన భూమికను మార్క్సిజం అందించింది. "తెలుగు ఆధునిక సాహిత్య విమర్శకుల్లో నూటికి తొంభై తొమ్మిది మంది మార్క్సిస్టు విమర్శలోనే పుట్టినప్పటికీ అస్తిత్వోద్యమాల నేపథ్యంలో చాలామంది దానికి దూరమయ్యారు". (యాకుబ్, 2019. పుట: 12).

సమాజం మొత్తం వర్గమయం. సమాజం నుండి వెలువడిన సాహిత్యాన్ని వర్గ దృక్పథ కోణం నుండి విశ్లేషించడం అభ్యుదయవాద సాహిత్య విమర్శ ప్రధాన లక్షణం. సాహిత్యంలో వివిధ ప్రక్రియలు ఉనికిలోకి రావడానికి గల చారిత్రక, సాంఘిక పరిణామాలను, వాటికి ముఖ్యమైన కారణాలను, అంశాలను పరిశీలించి విశ్లేషిస్తుంది. ఈ విమర్శలో సామాజిక శాస్త్రాల ప్రమేయం కూడా ఉంటుంది. సామాజిక వాస్తవికత, ప్రజాజీవన స్వరూప స్వభావాలు ఈ విమర్శలో అంతర్గతంగా కనిపిస్తాయి. ప్రతితరం వెనుకటి విజ్ఞానంతో భవిష్యత్తు అభ్యుదయం కొరకు మేల్కొని ప్రవర్తిస్తుందని ఈ వాద విమర్శకుల అభిప్రాయం.

తెలంగాణలో ప్రాచీనాధునిక సాహిత్యాలను మార్క్సిస్టు, చారిత్రక భౌతికవాద దృక్కోణంలో నాటి ఆంధ్ర సారస్వత పరిషత్ చాలా కృషి చేసింది. అ పరంపరలో కె. కె. రంగనాథాచార్యులు 'తెలుగు సాహిత్యం – మరో చూపు', తెలుగులో తొలి సమాజ కవులు, 'ఆధునిక తెలుగు సాహిత్యం విభిన్న ధోరణులులాంటి గ్రంథాలకు రాసిన ముందుమాటల్లో అభ్యుదయ విమర్శ కన్పిస్తుంది. డి. చంద్రశేఖర్ రెడ్డి తెలుగు సాహిత్యం – చారిత్రక నేపథ్యం, సంహిత వ్యాస సంపుటి వ్యాసాలలో అభ్యుదయ దృక్పథం కన్పిస్తుంది. కేతవరపు రామకోటి శాస్త్రి, పాములపర్తి సదాశివరావు, విశాలాంధ్ర సంపాదకులు సి. రఘువాచారి, చేకూరి రామారావు, డాక్టర్ శ్రీనివాస్, క్యాత్యాయనీ విద్మహే, జయధీర్ తిరుమల్‌రావు, ఎస్. వి సత్యనారాయణ, చేకూరి శ్రీనివాసరావు మొదలైనవారు సాహిత్యాన్ని అభ్యుదయ దృక్పథంతో విశ్లేషిస్తున్నారు. వరవరరావు, ఎన్. వేణుగోపాల్‌లాంటి వారు మొదట మార్క్సిస్టు విమర్శతో ప్రారంభించినా నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాల స్ఫూర్తితో మార్క్సిజం – లెనినిజం – మావోయిజం దృక్పథంతో సాహిత్య వివేచన చేస్తున్నారు.

5.3 విప్లవ సాహిత్య విమర్శ:

నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల నేపథ్యంలో, ఆ పోరాటంలో అమరుడైన సుబ్బారావు

పాణిగ్రహి స్ఫూర్తితో, మార్క్సిజం – లెనినిజం – మావో ఆలోచన విధానం అనే ప్రాపంచిక దృక్పథంతో సాహిత్య సాంస్కృతిక రంగాల్లో పనిచెయ్యడం కోసం 1970 జులై 4వ తేదిన విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. సాహిత్యాన్ని పీడిత ప్రజల కోసం పుట్టినప్పుడు దాన్ని ప్రజల దగ్గరకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత రచయితలపై ఉందని విరసం నమ్మింది. కళ కళకోసం కాదు ప్రజల కోసమని, పోరాడే ప్రజల కోసమని నిరూపించింది. ఈ అవగాహనతోనే విప్లవ సాహిత్యంతో పాటు విప్లవ సాహిత్య విమర్శ కూడా ప్రారంభమైంది. విప్లవ సాహిత్య విమర్శను అర్థం చేసుకొనే ముందు దీని సిద్ధాంత భూమికను అర్థం చేసుకోవాలి. మార్క్సిస్టు పేరుతో ఉన్నదంతా విప్లవ సాహిత్య విమర్శ కాదు. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాల్లో మార్క్సిజం పరిపుష్టం అవుతూ వచ్చినట్టే మార్క్సిజాన్ని సమాజానికి అన్వయించడంలో కూడా మార్పులు వచ్చాయి.

విప్లవ సాహిత్య విమర్శకు రెండు ప్రధానమైన లక్ష్యాలున్నాయి. మొదటిది ప్రజా వ్యతిరేక సాహిత్యాన్ని ఖండించడం. రెండోది ప్రజా సాహిత్యాన్ని అభివృద్ధి చేయడం. విప్లవ రచయితలు సాహిత్య విమర్శను వర్గ పోరాటాల సాధనంగా గుర్తించారు. విమర్శకుడు నిత్యం విద్యార్థిగా ఉంటూనే సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర పోషించాలనే దృక్పథం విప్లవ విమర్శకులకు ఉంది.

“సాహిత్యం సమాజం నుండి పుట్టిందే కాబట్టి సాహిత్య విమర్శలో సమాజ విమర్శ కలిసే ఉంటుంది. సమాజంలో వచ్చే మార్పుకీ గతితార్కికత సంబంధం ఉందని చెబుతుంది విప్లవ సాహిత్య విమర్శ. రచయితల చుట్టూ ఒక సమాజం ఉంటుంది. సమాజానికొక చరిత్ర ఉంటుంది. ఆ చరిత్రకొక పరిణామం ఉంటుంది. ఆ పరిణామనికొక లక్ష్యం ఉంటుంది. రచయిత చేత, పాఠకుల చేత దీన్ని గుర్తింపజెయ్యడానికి విప్లవ సాహిత్య విమర్శ కృషి చేస్తుంది”. (చెంచయ్య, వి. విప్లవ సాహిత్య విమర్శ. తెలుగు సాహిత్య విమర్శ దర్శనం. 2016. పుట: 1035)

తెలంగాణలో విప్లవ సాహిత్య విమర్శను వరవరరావు తెలంగాణ పోరాట నవలలను మార్క్సిస్టు కోణంలో పరిశీలిస్తూ వాటిని ప్రజా రాజకీయ నవలలుగా సిద్ధాంతీకరించారు. వరవరరావు విమర్శ ప్రసంగాలలో అధికంగా కన్పిస్తుంది. నిఖిలేశ్వర్ విరసంపై సంస్థాగత విమర్శ చేశారు. ప్రపంచ సాహిత్యంలో తిరుగుబాటు ఉద్యమాలు, మారుతున్న విలువలు – సమకాలీన సాహిత్యం, శ్రీశ్రీ దిగంబర కవులు – విరసం అనే రచనలలో విప్లవ సాహిత్య విమర్శ చోటు చేసుకుంది. ఎన్. వేణుగోపాల్ సామాజిక భూమికగా నవలా సాహిత్యాన్ని పరిశీలించారు. అలాగే నవలా సమయం, “కథా సమయం”, “ప్రజల మనిషి నవల సంక్షిప్తికరణ” లాంటి గ్రంథాలతో విప్లవ సాహిత్య విమర్శను కొనసాగిస్తున్నారు. చేకూరి రామారావు మొదట్లో విప్లవ సాహిత్య విమర్శ చేసినా తర్వాత మార్క్సిస్టు సాహిత్య విమర్శకు మారిపోయారు. సి. కాశీం విస్మరణకు గురౌతున్న పాటను వర్గ దృక్పథంతో అంచనా వేస్తూ పాట ప్రజా ఉద్యమాలను కదిలించే విధానాన్ని, పాట సమాజ మూలాల్ని విశ్లేషించారు. ఈయన రాసిన వ్యాసాలు, ఇచ్చిన ప్రసంగాలు సమకాలీన విప్లవ సాహిత్య విమర్శను అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. వీరందరి మొదలు ప్రస్తుత యువతరం ఈ విమర్శారీతిలో కృషి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

5.4 మనోవైజ్ఞానిక సాహిత్య విమర్శ:

మనిషి అంతరంగానికి సంబంధించిన విషయాలను మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు శాస్త్ర

నేపథ్యంలో చర్చిస్తారు. అదే ఒక సృజనకారుడు హృదయ స్పందనలోంచి వ్యాఖ్యానిస్తాడు. తెలుగు సాహిత్య విమర్శలో ఫ్రాయిడ్, యూంగ్, అల్డేర్ వంటి మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన సిద్ధాంతాల ఆధారంగా మనోవైజ్ఞానిక సాహిత్య విమర్శ వెలువడింది. రచనల్లోని వివిధ సన్నివేశాల్లో పాత్రలు, లేదా రచయిత మనః ప్రవృత్తుల పరిశీలన, వివరణ గానీ చేయడం ఈ విమర్శ ప్రధాన లక్షణం. మనోవైజ్ఞానిక విమర్శ ప్రధానంగా రెండు విధాలుగా సాగుతుంది.

1. పాత్రల ప్రవర్తనలోని వైచిత్రిని సైకో ఎనాలిసిస్ సిద్ధాంత నేపథ్యంలోంచి విశ్లేషించి, వివరించడం

2. రచయిత సృష్టించిన పాత్రల నేపథ్యంలోంచి, అతను జీవించిన కాలం నాటి పరిస్థితుల నేపథ్యంలోంచి రచయిత అంతరంగ ప్రవృత్తిని అంచనా వేయటం.

ఈ కోణంలో కె. పి. అశోక్ కుమార్ చైతన్య స్రవంతి నవలలను విశ్లేషించారు. అంపశయ్య నవీన్, మాదిరాజు రంగారావు, ముదిగొండ వీరభద్రయ్య, కాత్యాయని విద్మహే మనోవైజ్ఞానిక దృష్టితో విమర్శను చేశారు. అద్లూరి రఘురామరాజు తత్త్వశాస్త్ర నేపథ్యంలో మనోవైజ్ఞానిక సాహిత్య విమర్శను కొనసాగించారు.

6. అస్తిత్వవాద సాహిత్యోద్యమాల విమర్శ:

అణచివేత ఉన్నప్పుడే తిరుగుబాటు వస్తుంది. ప్రశ్నించడం మొదలవుతుంది. వివక్షత గురైనప్పుడే అప్పటివరకు ఉన్న చైతన్యం ఉద్యమంగా రూపుదాల్చుతుంది. తెలుగుసాహిత్యంలో ఉన్న ప్రధాన స్రవంతి ధోరణులు తమను పట్టించుకోవడం లేదని, తాము విస్మరణకు గురయ్యామని కొన్ని వర్గాలు అస్తిత్వోద్యమాలను ప్రారంభించి, సాహిత్యాన్ని సృజించారు. తెలంగాణ పరిశోధకులు, విమర్శకులు వివిధ సిద్ధాంతాల నేపథ్యంలో తమను తాము తెలుసుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. అప్పటివరకు ఉన్న సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేయడం మొదలు పెట్టారు. తమ చైతన్యంతో చాలా పదునుగా సాహిత్య సృజన చేశారు. అప్పటి వరకు సాహిత్యంలో లేని జీవితాలు, భాషా, సంస్కృతులు సాహిత్యంలోకి ప్రవేశించాయి. మునుపెన్నడు లేని వ్యక్తీకరణలు, ప్రశ్నలు సాహిత్యాన్ని కుదిపేశాయి. ఈ అస్తిత్వోద్యమ నేపథ్యంలో వచ్చిన సాహిత్యాన్ని వివేచించడానికి అప్పటివరకు ఉన్న సాహిత్య విమర్శ పరికరాలు పనికిరాకుకండా పోయాయి. సాహిత్య గౌరవం పొందలేని అనేక జీవితాలు సాహిత్యంలోకి రావడంతో వాటిని వివేచించడానికి కొత్త విమర్శ పరికరాలు అవసరం అయ్యాయి. ప్రజా జీవితంలోంచి వచ్చిన వివిధ సాహిత్య సిద్ధాంతాల నేపథ్యంలో సాహిత్యాన్ని వివేచించడం మొదలు పెట్టారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో వెలువడిన సాహిత్యం ప్రాంతీయ స్పృహను పెంచింది. ఈ ఉద్యమం సాహిత్యాన్నీ వివిధ కోణాలలో సమీక్షించింది. ఇలా సాహిత్యాన్ని సమాలోచించే దిశగా వెలువడిన విమర్శ సాహితీ విమర్శకులలో నూతన సాహిత్య విమర్శ పద్ధతులను ఆవిష్కరింపజేసింది. ఈ పద్ధతుల ఆధారంగా చాలా మంది విమర్శకులు తెలంగాణలో వెలువడిన వివిధ సాహిత్య ప్రక్రియలపై విమర్శలు రాశారు. వివిధ సిద్ధాంతాల నేపథ్యంలో వచ్చిన సాహిత్యాన్ని వివేచించే సాహిత్య విమర్శను అదే సిద్ధాంతాల నేపథ్యంలోనే చూడాలి. ఎందుకంటే సాహిత్యం సమాజానికి సంబంధించింది. కళ అంతిమ ప్రయోజనం ప్రజలను చైతన్యవంతం

చేయడం. అస్తిత్వోద్యమాల నేపథ్యంలో వెలువడిన సాహిత్యాన్ని వాటి వాటి సిద్ధాంతాల వెలుగులో విశ్లేషించకపోతే వాటికి సమగ్రత చేకూరే అవకాశం తక్కువగా ఉంటుంది. కాబట్టి తెలంగాణ విమర్శను వివిధ సిద్ధాంతాల నేపథ్యంలో అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది.

6.1 స్త్రీవాద సాహిత్య విమర్శ:

స్వేచ్ఛా, సమానత్వాలు ఉన్నత మానవుల విలువలుగా ఫ్రెంచి ఉద్యమకాలం నాటి నుండి బలపడింది. నాటి నుండి న్యాయపూరితమైన ఆకాంక్షలు, హక్కులు సాధించుకునే దిశగా స్త్రీ సమాజం ముందుకు నడిచింది. పుట్టుకలోనే మనిషి సహజంగా ఆడ మగ భేదంతో పుడుతున్నా, అది స్త్రీ పట్ల వివక్షత చూపడానికి కారణం కాదని గ్రహించారు. సమాజంలో స్త్రీలు బానిసలుగా ఉండాలని భావించేది పురుషస్వామ్యం. ఇది ఒక రకంగా ఆధిపత్య భావజాలం. పురుషస్వామ్యం స్త్రీని అన్ని రకాలుగా బంధి చేయడానికి సమాజంలో అనేక కట్టుబాట్లను రూపొందించి, స్త్రీలకు వాటిని అలవాటు చేసి, సంప్రదాయం ముసుగులో వారి హక్కులను అణచివేశారు. ఇటువంటి జెండర్ సమస్య స్త్రీవాదంలో బలపడింది. పురుషస్వామ్య సమాజంలో స్త్రీల లైంగికత్వాన్ని, సంతానోత్పత్తిని, స్త్రీల శరీరాన్ని, చైతన్యాన్ని, ఆలోచనలను నిత్యం అణచివేసే పురుషస్వామ్యాన్ని ప్రశ్నించడం మొదలుపెట్టారు. 1975వ సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ మహిళ సంవత్సరంగా ప్రకటించింది. తర్వాత దానిని దశాబ్దంపాటు పొడిగించింది. ఈ సమయంలో అంతర్జాతీయంగా మహిళలకు తమ గురించి తాము మాట్లాడుకుని, విశ్లేషించుకునే అవకాశం లభించింది. వాళ్ల స్థితిగతులను అధ్యయనం చేస్తూ మాట్లాడే అవకాశం దక్కింది. భారతదేశంలో సంస్కరణోద్యమ కాలం నాటి నుండి స్త్రీ అభ్యున్నతి గురించి మాట్లాడింది పురుషులే. కానీ ప్రజాస్వామిక ఉద్యమాలు బలపడిన తర్వాత వివిధ ఉద్యమాలలో స్త్రీలు పాలుపంచుకోవడం మూలంగా వారి సమాజ అవగాహన స్థాయిల్లో మార్పులు వచ్చాయి. మన సమాజంలో ముందుగా విప్లవోద్యమం వారికి ఆ చైతన్యాన్ని అందించింది. "1975 నాటికి నక్సల్బరీ పోరాటపు వెలుగులో రగులుకున్న శ్రీకాకుళ గిరిజన విప్లవోద్యమ జ్వాల ఉత్తర తెలంగాణ జిల్లాలకు విస్తరించింది. రాజకీయార్థిక సమానత్వాన్ని కాంక్షిస్తూ సాగిన ఈ ఉద్యమాలు పౌర ప్రజాస్వామిక హక్కుల గురించిన చైతన్యంలో గుణాత్మకమైన అభివృద్ధికి కారణమైనాయి. ఈ చైతన్యం మొత్తం మీద స్త్రీల సమస్యలను మూలాల నుండి అన్వేషించడానికి, అర్థం చేసుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని సమకూర్చింది. విప్లవకర శక్తులలో భాగం కావడానికి, పీడితులలోకెల్ల పీడితురాలిగా స్త్రీకి వున్న అవకాశాన్ని అవసరాన్ని అర్థం చేసుకునే క్రమం ఈ కాలంలో బాగా అభివృద్ధి చెందింది."(కాత్యాయని విద్మహే. కేతవరపు. 2006. పుట: 02) నేడు వివిధ అస్తిత్వోద్యమాల నేపథ్యంలో కూడా స్త్రీ సాహిత్య విమర్శ అభివృద్ధి చెందింది.

స్త్రీవాద సాహిత్య విశ్లేషణలో కాత్యాయని విద్మహే, రావి ప్రేమలత మొదలైన వారు కృషి చేశారు. స్త్రీవాద సాహిత్య దృక్పథంతో సాహిత్య విశ్లేషణకు ఒక సమగ్ర నమూనా వంటి వ్యాసాలు, రచనలు, కాత్యాయనీ విద్మహే వెలువరించారు. స్త్రీవాద దృష్టితో ప్రాచీనాధునిక సాహిత్యాల విశ్లేషణ ప్రారంభించిన ఆమె విశ్లేషణలో మార్క్సిజం పునాదులు కొంత ఉన్నాయి.

సంప్రదాయ సాహిత్యాన్ని స్త్రీవాద దృష్టితో పరిశీలించి ప్రాచీన సాహిత్య విశ్లేషణకు కొత్త మార్గం వేశారు. స్త్రీవాద సాహిత్యాన్ని సానుకూల దృక్పథంతో చేకూరి రామారావు, వరవరరావు, ముదిగొండ వీరభద్రయ్యలు వ్యాఖ్యానిస్తే ప్రతికూల వాతావరణం నుండి జ్వాలాముఖి, ఎస్. వి. సత్యనారాయణ విశ్లేషించారు. శిలాలోలిత ఈ మార్గంలో మరింత కృషి చేస్తుంది. జానపద సాహిత్యాన్ని స్త్రీవాద దృక్కోణంలో రావి ప్రేమలత పరిశీలిస్తున్నారు. ఈవిడ రాసిన జానపద సాహిత్యంలో "స్త్రీ", "వ్యాసలతిక" వ్యాసాల్లో ఈ దృక్పథాన్ని అంచనా వేయవచ్చు. దళిత స్త్రీవాదానికి భూమిక అందించిన వారు బి. ఎస్. రాములు గారు. ఈయన బహుజన స్త్రీవాదానికి అవసరమైన భూమికను ఏర్పరిచారు. ఈ కోణంలో జూపాక సుభద్ర, జాజుల గౌరి, గోగు శ్యామల విశ్లేషణలు చేస్తున్నారు.

6.2 దళితవాద సాహిత్య విమర్శ:

కొన్ని వేల సంవత్సరాలుగా విద్యకు, సామాజిక గౌరవానికి నోచుకోనిది శూద్రజాతి. అందులో అతిశూద్రులుగా భావిస్తున్న ఎస్. సి.లు ఈ నిచ్చెన మెట్ల సమాజంలో మరింత దుర్భరమైన సామాజిక వివక్షతను అనుభవిస్తున్నారు. సామాజిక మార్పులో భాగంగా నేడు చాలా మంది దళితులు చదువుకుని తమ సాహిత్యాన్ని తామే రచించడం మొదలు పెట్టారు. ఆవేదన హృదయంతో రాయడంవల్ల ఆ సాహిత్యానికి మరింత పదునెక్కింది. 1968లో కంచికచర్లలో కోటేశుని సజీన దహనం చేయడం, 1985లో కారంచేడు ఘటన, 1990 ఆగస్టులో చుండూరు దళితుల ఊచకోతలు జరిగాయి. ఈ సంఘటనలు అంతవరకు సంస్కరణోద్యమాలలో, విప్లవోద్యమాలలో, సామాజికోద్యమాలలో పని చేస్తున్న వారిని ప్రభావితం చేశాయి. అప్పటి నుండి తెలుగు సాహిత్యంలో చాలా మంది కవులు తమ కలాలను దళిత నేపథ్యంలో సృజనాత్మక రచనలు చేశారు. ఈ వాదానికి మహాత్మా జ్యోతిబాపూలే, అంబేద్కర్‌లు అందించిన ముందు చూపు సిద్ధాంత భూమికగా ఉన్నాయి.

దళిత సాహిత్యమే స్వతహాగా విమర్శ. అప్పటివరకు ఉన్న సాహిత్యాన్ని దళిత నేపథ్యంలో పునర్మూల్యాంకనం చేస్తూ సాహిత్యం వెలువడింది. బుద్ధుని భోదనలు కూడా దళితవాదానికి నేపథ్యంగా ఉన్నాయి. దళిత అనే పదంపై విస్తృతమైన చర్చ జరిగింది. ఎవరు దళితులు? అనే మౌలికమైన ప్రశ్నలు దళిత సాహిత్య విమర్శ ప్రారంభంలో వచ్చిన అంశాలు. దళిత సాహిత్యోద్యమ సమయంలో వచ్చిన చర్చలను ఎస్. వి. సత్యనారాయణగారు "దళితవాద వివాదాలు" అనే సంకలనంగా ప్రచురించారు.

దళిత సాహిత్య విమర్శలో ఎస్. వి. సత్యనారాయణ, ననుమాస స్వామి కృషి చేస్తున్నారు. బి. ఎస్ రాములు, బన్న అయిలయ్య, గౌరిశంకర్, కాశీం, పసునూరి రవిందర్, కాలువ మల్లయ్య, జిలుకర శ్రీనివాస్, మార్క్సిస్టు వాదానికి, దళితవాద చింతనకు మధ్య ఉన్న తేడాను మరింత స్పష్టంగా సైద్ధాంతిక కోణంనుండి చెప్పేందుకు జిలుకుర శ్రీనివాస్ ప్రయత్నిస్తున్నారు. కాసుల ప్రతాపరెడ్డి తెలంగాణ దళితవాదానికి, ఆంధ్ర దళితవాదానికి మధ్యగల అంతరాలను విశ్లేషించారు. బ్రిటీషాంధ్ర వచన కవితా తాలూకు దళితవాదం అప్పటికే అందుకున్న అభివృద్ధిలో భాగమనీ, తెలంగాణలో దళితవాదం సామాజిక, సాంస్కృతిక, రాజకీయోద్యమాలలో భాగం అని నిరూపించారు.

6.3 మైనారిటీవాద సాహిత్య విమర్శ:

మైనారిటీ అనగా తక్కువగా ఉన్న జన

సమూహం అని అర్థం. వీరు తమ సంస్కృతిలోను, భాషలో, ఆచారాలలో ఇతర జాతుల కంటె భిన్నంగా ఉంటుంది. తర్వాతి కాలంలో మైనారిటీ సాహిత్యం అంటే ముస్లిం సాహిత్యవిమర్శగా రూఢి అయిపోయింది. ముస్లింలు తమ సామాజిక జీవితంలో, మెజారిటీ జన సమూహాలతో గల సంబంధాలు, మత ఛాందస మూఢనమ్మకాలను తెలియజేస్తూ రచనలు సాగించారు. బాబ్రీ మసీదు సంఘటన, మెజారిటీ హిందూ దేశంలో ముస్లింల అభద్రతా భావం వల్ల ముస్లిం సాహిత్యం అధికంగా వస్తుంది. ఇలాంటి సంఘటనలకు ముందు ముస్లిం వాద సాహిత్యం దళిత, బహుజన సాహిత్యంలో అంతర్భాగంగా ఉండేది.

మైనార్టీ వాద విమర్శకులలో దిలావర్, షాజహానా, స్కైబాబా, అఫ్సర్, యాకుబ్ ప్రధానంగా కన్పిస్తారు. ప్రాపంచిక దృక్పథంతో విమర్శ రాస్తుండగా, మైనారిటీవాదంలో స్త్రీవాద దృక్పథాన్ని షాజహానా నిర్వర్తిస్తున్నారు. ఈవిడ స్కైబాబా కథలతో పాటు, యాకుబ్ కవిత్వాన్ని లోతైన విశ్లేషణలతో చర్చించారు. అఫ్సర్ మైనారిటీ వాద దృక్పథాన్ని సైద్ధాంతిక నేపథ్యంలో విశ్లేషిస్తూ వ్యాసాలు రాశారు. ఖాజా రాసిన ముస్లింవాద తాత్త్వికత – సిద్ధాంతం సాహిత్యాన్ని ఈ కోణంలో వ్యాఖ్యానించింది.

6.4 ప్రాంతీయవాద సాహిత్య విమర్శ:

తెలంగాణ ప్రాంతం విభిన్నమైన రాజకీయ నేపథ్యం కలిగివుంది. శాతవాహనుల నుండి నిజాం ప్రభువుల పరిపాలన వరకు తనదైన సామాజిక, రాజకీయ నేపథ్యాలు ఏర్పడ్డాయి. సంస్కృతులు, జానపదాలు, భౌగోళికమైన విశిష్టత తెలంగాణ సొంతం. తెలంగాణ ప్రాంతం రాచరిక పాలన నుండి విముక్తి అయిన తర్వాత భారత యూనియన్‌లో కలిసింది. తర్వాత భాషా ప్రాతిపదిక రాష్ట్రంగా మద్రాసు రాష్టంలోని తెలుగు ప్రాంతాలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడింది. నాటి నుండి తెలంగాణ ఏర్పడేవరకు ఈ నేల అనేక వివక్షతలను ఎదుర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రత్యేకమైన భౌగోళిక, చారిత్రక, సామాజిక అస్తిత్వంగా ముందుకు వచ్చింది. తెలంగాణ అన్యాయానికి, వివక్షతకు గురవుతున్నదని గుర్తించిన తెలంగాణ విద్యావంతులు ప్రతిఘటనను మొదలుపెట్టారు. ఈ ప్రతిఘటన బలమైన చైతన్యం రూపు తీసుకుని ఉద్యమ రూపు సంతరించుకుంది. ఆత్మగౌరవ పోరాటంగా ముందుకు నడిచింది. అందులో భాగంగానే సాహిత్యంలో ప్రాంతీయ అస్తిత్వంలో భాగంగా సృజనాత్మక సాహిత్యం వచ్చింది. ఈ క్రమంలో వచ్చిన సాహిత్యాన్ని వివేచించడానికి విమర్శ కూడా వచ్చింది. తెలంగాణలో మొదటసారిగా అస్తిత్వ కోణంలో విమర్శ చేసినవారు సురవరం ప్రతాపరెడ్డిగారు. తెలుగు సాహిత్యంలో తెలంగాణ కవుల అస్తిత్వం ప్రశ్నార్థకమైనప్పుడు సగౌరవంగా గోలకొండ కవుల సంచిక ప్రచురించి అస్తిత్వవాదానికి దారులు తెరిచారు. ఆ తర్వాత చాలామంది తెలంగాణ సాహిత్య విమర్శకు అవసరమైన సిద్ధాంతాన్ని నిర్మించారు. అందులో భాగంగా తెలంగాణ సాంస్కృతిక వేదిక కాసుల ప్రతాపరెడ్డి సంపాదకత్వంలో "తెలంగాణ తోవలు" అన్న పుస్తకం వచ్చింది. ఇది తెలంగాణలో తెలంగాణ సాహిత్య విమర్శ సిద్ధాంతానికి పూర్వ రంగాన్ని అందించింది. తర్వాత ముదిగంటి సుజాతారెడ్డి గారు ముద్దెర తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్య విమర్శ వ్యాసాలు వచ్చింది.

తెలంగాణ అన్ని రకాల వివక్షతల నుండి తెలంగాణ ప్రాంత నవలల ప్రత్యేకతను కాసుల ప్రతాపరెడ్డిగారు విశ్లేషించారు. గుడిపాటి అభివ్యక్తి, ఫాయిదా, ఇతివృత్తం, కటికీ మొదలైన

గ్రంథాలలో ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని విశ్లేషించారు. నందిని సిధారెడ్డి ఇగురం, ఆవర్తనం పుస్తకాలు రాశారు. కాసుల ప్రతాపరెడ్డి తెలంగాణ సందర్భాలు, తెలంగాణ సాహితత్యోద్యమాలు, భౌగోళిక సందర్భం, తెలంగాణ తోవలు పుస్తకాలను ప్రచురించారు. కె. శ్రీనివాస్ సంభాషణ, కొత్త వంతెన, అనేక సందర్భాలు పుస్తకాలు వెలువరించారు. కాసులలింగారెడ్డి, జూలూరి గౌరిశంకర్, ఎన్, వేణుగోపాల్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీధరరావు పాండే, కాలువ మల్లయ్య, కందుకూరి రమేష్ బాబు, పరావస్తు లోకేశ్వర్, అంబటి సురేంద్రరాజు, ఎస్. రామకృష్ణ, సంగిశెట్టి శ్రీనివాస్ మొదలైన విమర్శకులు తెలంగాణ సాహిత్య విమర్శను సుసంపన్నం చేస్తున్నారు.

7. ముగింపు:

విశ్వవిద్యాలయ పరిధిలోని పరిశోధనలకు కాల పరిమితి ఉంటుంది. ఈ అంశాల ఆధారంగా తెలంగాణ సాహిత్య విమర్శపై చాలా పరిశోధనలు రావాల్సిన అవసరం ఉంది. పై అయిదు అంశాలను ఏక పరిశోధనలో పూర్తిగా పరిగణలోకి తీసుకుని సమగ్ర తెలంగాణ సాహిత్య విమర్శని అధ్యయనం చేయలేము. ఒకవేళ పరిశోధన చేసినా పూర్తి విషయాన్ని మూల్యాంకనం చేసినప్పటికీ అస్పష్టతకు, అసమగ్రతకు దారి తీసే ప్రమాదం ఎక్కువ. పై అంశాలను వివిధ ఉప అంశాలుగా విభజించుకుని పరిశోధనలు వెలువడితేనే అంతిమంగా సమగ్రమైన తెలంగాణ సాహిత్య విమర్శ సాధ్యమవుతుంది. ఒక విస్తృతి గల అంశాన్ని ఒక నిర్వచనంలోకి, చిన్న వివరణలోకి కుదించడం కష్టం. కానీ, వచ్చిన వివరణలను వివేచించి, చర్చించి సమగ్రత వైపు ప్రయానించడం ఆధునిక సమాజ లక్షణం.

8. ఉపయుక్త గ్రంథ సూచి:


1. అభ్యుదయ విమర్శ విశేష సంచిక.

2. ఇనాక్, కొలకలూరి. "ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం". గుంటూరు: మారుతి బుక్ హౌస్, 1996.

3. కాత్యాయని విద్మహే. "ప్రాంతీయ చైతన్యం – తెలంగాణ సాహిత్యం". హైదరాబాద్: పాలపిట్ట బుక్స్, 2013.

4. కాత్యాయని విద్మహే. "ఆధునిక తెలుగు సాహిత్యం స్త్రీవాద భూమిక". వరంగల్లు: స్త్రీ జనాభ్యుదయ సంస్థ, 2006.

5. చెన్నయ్య, జె. (సంపా). "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం". హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 2013.

6. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. "గనుమ". హనుమకొండ: తెలంగాణ సాహితీ పబ్లికేషన్స్, 2010.

7. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. "తెలంగాణ సాహిత్య విమర్శ దశ – దిశ" (వ్యాసం). దక్కన్ ల్యాండ్. జూన్ 2017.

8. ప్రతాపరెడ్డి, కాసుల. "తెలంగాణ సాహిత్యోద్యమాలు". హైదరాబాద్: తెలంగాణ ప్రచురణలు, 2015.

9. ప్రతాపరెడ్డి, కాసుల (సంపా). "తెలంగాణ తోవలు". హైదరాబాద్: తెలంగాణ సాంస్కృతిక వేదిక, 2011.

10. యాకుబ్. "ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ". హైదరాబాద్: నవ తెలంగాణ ప్రచురణలు, 2018.

11. రామారావు, ఎస్. వి. "విమర్శక వతంసులు". హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు, 2011.

12. రామారావు, ఎస్. వి. "తెలుగులో

సాహిత్య విమర్శ". హైదరాబాద్: పసిడి ప్రచురణలు, 2014.

13. లక్ష్మణ చక్రవర్తి, సి. హెచ్. పి. వారిజారాణి, జి. విజయ్‌కుమార్. (సంపా) "ఆధునిక సాహిత్య విమర్శ రీతులు". హైదరాబాద్: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర శాఖ ప్రచురణ, 2004.

14. లక్ష్మణ చక్రవర్తి, సి. హెచ్. "ప్రతిబింబం" హైదరాబాద్: ఆముక్త ప్రచురణలు, 2014.

15. సత్యనారాయణ, ఎస్, వి.(సంకలనం). "స్త్రీవాద వివాదాలు". హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, 2001.

16. సుజాతరెడ్డి, ముదిగంటి. (సంపా) "ముద్దెర". హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2005.

17. సుబ్రహ్మణ్యం, జి. వి. "సాహిత్యంలో చర్చనీయాంశాలు"

18. శ్రీహరి, రవ్వా. "తెలంగాణ ఆధునిక సాహిత్య చరిత్ర". హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2016.

19. చెంచయ్య, వి. "విప్లవ సాహిత్య విమర్శ". "తెలుగు సాహిత్య విమర్శ దర్శనం". హైదరాబాద్: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, 2016

★ రచయిత: తెలుగు అధ్యాపకులు, తెలుగుశాఖ, ఓయు

**రచయితలకు సూచనలు:**

**1.** రచనలను పేజీకి ఒకవైపు మాత్రమే అర్థమయ్యేలా రాసి పత్రిక అడ్రస్‌కు ప్రతినెల 15వ తేదీలోగా పంపగలరు.

**2.** డీటీపీ చేయించి పంపేవారు ప్రతినెల 18వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో పంపించగలరు.

**3.** చేతి రాతలో పంపే రచనలను స్కాన్ చేసి మెయిల్ ద్వారా కాకుండా పోస్ట్ ద్వారా పంపించగలరు.

**4.** స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.

**5.** ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.

**6.** అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.

**7.** పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.

–సం.

తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం

# TELUGU LITERARY CONGRESS (TLC) 2024

# తెలుగు సాహిత్య మహాసభ 2024











RNI Number : APTEL/2011/37247

ISSN 2349 - 2376
Publishing Date : 6-03-2024

# విజయవంతమైన తెలుగు సాహిత్య మహాసభ - 2024




**ఈ పత్రికను చదివాక మీ అభిప్రాయాలు రాయడం మర్చిపోవద్దు. మీ సూచనలే మా తొవ్వకు వెలుగు.**

**To** Printed Matter **BOOK-POST**

Stamp

**చందాదారులుగా చేరండి - చేర్పించండి**
**సంవత్సర చందా200/- రూ.**

**నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్:**
**62254225854, ఎస్‌బీహెచ్,**
**రాంకోఠి బ్రాంచ్ (20350), హైదరాబాద్**

***From :***
**ఎడిటర్, నడుస్తున్న తెలంగాణ**
**ఇంటి నెం. 2-95, ప్లాట్ నెం. 301, వైష్ణవి స్మార్ట్,**
**రోడ్ నెం. 2, కాకతీయ నగర్, హబ్సిగూడ,**
**హైదరాబాద్. 500007.**
**ఫోన్ నం. 9290745490**

Printed, published and owned by M. Snehalatha printed at Black pen publications. House. No 2 - 95, Flat No. 301, Vaishnavi smart, Road No. 2, Kakatiya Nagar, Habsiguda, Hyderabad, 500007, published at Black pen publications. House. No 2 - 95, Flat No. 301, Vaishnavi smart, Road No. 2, Kakatiya Nagar, Habsiguda, Hyderabad, 500007. Editor Dr. C. Kaseem.RNI No. APTEL/2011/37247.